

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 8-6-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 53 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: ద్వాదశి ఉ.7:18 తదుపరి త్రయోదశి, నక్షత్రం: స్వాతి మ.12:42 తదుపరి విశాఖ, వర్జ్యం: రా.6:57-8:44, దుర్ముహూర్తం: సా.5:00-5:52, అమృతఘడియలు:ఉ. 5.43-7.34, రాహుకాలం: సా. 4:30-6:00, సూర్యోదయం: 5:43, సూర్యాస్తమయం: 6:44 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రజా ధనం రూపాయి ఖర్చుపెట్టినా దానికి ఒక అర్థం ఉండాలి! ఆ ఖర్చుకు ఒక ఫలితం దక్కాలి! పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి కాబట్టే... వేలకోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. కష్టనష్టాలకు ఎదురొడ్డి తిండి గింజలు పండిస్తున్నారు కాబట్టే అన్నదాతలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. ఆహార భద్రత కోసం వందలకోట్ల సబ్సిడీ భరించి మరీ రేషన్ సరుకులు అందిస్తున్నారు. మరి... 'ఇంటింటికీ రేషన్ సరుకులు' పేరిట గత జగన్ సర్కారు రుద్దిన వాహనాలతో లాభమేమిటి? ఈ విధానాన్ని రద్దు చేసిన నేటి ప్రభుత్వం... ఆ వాహనాలకు తీసుకున్న రుణాన్ని తానే చెల్లించడమేమిటి? వాటిని ఆపరేటర్లకు 'ఫ్రీ'గా ఇచ్చేయడమేమిటి? ఇలా వందలకోట్లు ఖర్చు చేయడం వెనుక ప్రజా ప్రయోజనం ఉందా? పోనీ... కూటమి పార్టీలకు రాజకీయ ప్రయోజనమైనా దక్కుతుందా? లేదు... లేదు... లేదు!



మే 31న రాజమహేంద్రవరంలో ఎండీయూ వాహనదారుల ఆందోళనలో వైసీపీ నేత, మాజీ ఎంపీ భరత్

ఎందుకీ వాహన సేవ?

'ఇంటింటికీ రేషన్' విధానం రద్దు
వాహనాలు మాత్రం ఆపరేటర్లకు ఉచితం

బ్యాంకు రుణం ప్రభుత్వమే కట్టాలని నిర్ణయం
530 కోట్లు అప్పు తెచ్చి వాహనాల కొనుగోలు
రూ.6 లక్షల్లో ఆపరేటర్ వాటా 60 వేలు మాత్రమే
మిగిలిన మొత్తం ప్రభుత్వమే చెల్లించేలా నిర్ణయం
ఇంత చేసినా సంతృప్తి వ్యక్తం చేయని ఆపరేటర్లు
ఉచితంగా వాహనం వచ్చినా సర్కారుపై విమర్శలే
జగన్‌కు జై కొడుతూ రేషన్ వాహనాలతో ర్యాలీలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మంచి ప్రభుత్వం' అంటే ఏమిటి? లెక్కా పక్కా లేకుండా ప్రజాధనాన్ని అనాలోచితంగా ఖర్చు చేసేయడమేనా? కోట్లు పంచిపెట్టి మరీ... తిట్టించుకోవడం ఈ ప్రభుత్వానికి అవసరమా? రేషన్ సరుకుల పంపిణీ వాహనాల (ఎండీయూ) విషయంలో తలెత్తుతున్న ప్రశ్నలివి! రాష్ట్రంలో మొత్తం 1.46 కోట్ల రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా ఉచిత బియ్యం, ఇతర రేషన్

మిగతా 14వ పేజీలో...

కోట్లు ఇచ్చి తిట్టించుకోవడమే..

దాదాపు రూ.6 లక్షల విలువైన వాహనాన్ని ఉచితంగా ఇచ్చేయాలని కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయంపై... ఎండీయూ ఆపరేటర్లు సంతృప్తిగా ఉన్నారా? హర్షం వ్యక్తం చేశారా? ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పారా? లేనే లేదు! పైగా... ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నారు. 'మాది వైసీపీ... మా నాయకుడు జగన్' అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఇప్పటి ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తోందంటూ గగ్గోలుపెడుతున్నారు. నిరసనలకు దిగుతున్నారు. కొందరు ఆపరేటర్లు మరో అడుగు ముందుకు వేసి.. 4వ తేదీన వైసీపీ నిర్వహించిన 'వెన్నుపోటు దినం'లో తమ వాహనాలతో సహా పాల్గొన్నారు. జగన్‌కు జై కొట్టారు. పలుచోట్ల వైసీపీ నేతలు ఎండీయూ ఆపరేటర్లను పిలిపించుకుని... ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు జరిపేలా వ్యూహాలు రచిస్తున్నారు. వెరసి... రాజకీయ ప్రయోజనం లేదు. ప్రజా ప్రయోజనం అసలే లేదు. మరి... ఎండీయూ వాహనాలను ఆపరేటర్లకే ఇవ్వడంలో ఔచిత్యమేమిటి?

7 రోజుల్లో కోటి కుటుంబాలకు రేషన్

రేషన్ పంపిణీ చరిత్రలో ఇదో మైలురాయి: నాదెండ్ల 13

జగన్.. నేరం..
రాజకీయం!



పులివెందుల మార్క్ రాజకీయాలు రాష్ట్రంలోకి ప్రవేశించిన తర్వాత సంఘ విద్రోహ శక్తులకు, నేరస్తులకు రాజకీయాల్లోకి ఎంట్రీ లభించింది. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో మొదలైన ఈ సంస్కృతి ఇప్పుడు స్వైర విహారం చేస్తోంది. 'కడప పాలెగాళ్లు' పేరిట పౌర హక్కుల సంఘం వాళ్లు ప్రచురించిన పుస్తకంలో వైఎస్ కుటుంబం గురించి వివరించారు.

తెనాలిలో పేరు మోసిన ముగ్గురు నేరస్తులను పోలీసులు ఇటీవల నడిరోడ్డుపై చితకబాదారు. బాధితులు కరుడుగట్టిన నేరస్తులని తెలిసి కూడా పరామర్శకు పూనుకున్నారంటే... అందుకు జగన్ రెడ్డి ఆలోచనలు, రాజకీయ ఎత్తుగడలు వేరే లెవల్లో ఉండటమే కారణం.

ఒకప్పుడు నేరస్తుల భుజంపై చేయి వేయాలంటే రాజకీయ నాయకులు భయపడేవారు. ఇప్పుడు వారి చుట్టూ నేరస్తులే ఉంటున్నారు. తన ఓటు బ్యాంకును స్థిరీకరించుకొనే పనిలో భాగంగా నేరస్తుల కుటుంబాల పరామర్శకు జగన్ బయలుదేరారు.

డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రమణ్యం వంటి మంచివాళ్ల కోసం అదే దళితులు ఎందుకు నిలబడలేదు? ఈ సైకాలజీని ఒడిసిపట్టుకున్న జగన్ రెడ్డి వారిని కవచంలా వాడుకుంటున్నారు.

కేసులు ఉన్న వారు ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు. అలాగే... రౌడీషీటర్లు, గంజాయి వ్యాపారం చేసేవాళ్లు, ఇతర నేరాలకు పాల్పడిన వాళ్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులని కూటమి ప్రభుత్వం ఎందుకు ప్రకటించకూడదు?

రాష్ట్రం పట్ల, సమాజం పట్ల జగన్ రెడ్డికి ఏ బాధ్యతా ఉండదు. ఆయనకు కావాల్సింది అధికారం మాత్రమే. అధికారం అండతో రాష్ట్ర సంపదను దోచుకొని పొరుగున ఉన్న బెంగళూరు, చెన్నైతో పాటు దుబాయ్‌లో ఆస్తులు సమకూర్చుకోవడమే వారికి కావాల్సింది. ఇందుకోసం ఎంతకైనా తెగిస్తారు.

జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే పరిస్థితులు ఎంత దారుణంగా ఉంటాయో తెలుసు కనుకే ఎవరు ఎన్ని కుట్రలకు పాల్పడినా కూటమి భాగస్వామ్య పక్షాలు అపోహలకు తావు లేకుండా జాగరూకతతో వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను అభినందించాలి.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



భారీగా తగ్గిన 'తీవ్ర పేదరికం'

దేశంలో 27.1% నుంచి 5.3 శాతానికి
26 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి
ప్రపంచ బ్యాంకు గణాంకాలతో కేంద్ర ప్రభుత్వ ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 7: పేదరిక నిర్మూలనలో భారత్ మంచి ఫలితాలు సాధిస్తోంది. దేశంలో దశాబ్దకాలంలో తీవ్ర పేదరికం రేటు భారీగా తగ్గింది. ప్రపంచ బ్యాంకు గణాంకాల ఆధారంగా కేంద్రం దీనిపై ఒక ప్రకటన విడుదల చేసింది. 2011-12లో దేశంలో 27.1 శాతంగా ఉన్న తీవ్ర పేదరికం రేటు 2022-23 నాటికి 5.3 శాతానికి తగ్గిపోయిందని పేర్కొంది. 2011-12లో 34.4 కోట్ల మంది తీవ్ర పేదరికంలో ఉండగా.. 2022-23 నాటికి ఆ సంఖ్య 7.5 కోట్లకు తగ్గిందని చెప్పింది. ఆ 11 ఏళ్ల కాలంలో సుమారు 26.9 కోట్ల మంది తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని వరల్డ్ బ్యాంక్ డేటా స్పష్టం చేసింది. 2011-12లో దేశంలోని అత్యంత పేదల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్, మధ్య ప్రదేశ్‌లోనే 65 శాతం మంది ఉండేవారు. ఇప్పుడు తగ్గిన సంఖ్యలో కూడా వారు మూడింట రెండు వంతులు ఉన్నారు. 2021 మారకం ప్రకారం రోజుకు 3 డాలర్లు ఖర్చు చేసే స్తోమత.. అనే అంతర్జాతీయ పేదరిక రేఖను ఆధారంగా చేసుకుని ప్రపంచ బ్యాంకు మన దేశంలో పేదరికాన్ని మదింపు చేసింది. దీనిలో పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా పేదరికం బాగా తగ్గినట్లు తేలిందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో 18.4 శాతం


మిగతా 11వ పేజీలో...

తప్పు చేస్తే ఊరుకోను

"గత ప్రభుత్వాన్ని భరించలేకే ప్రజలు ఏకపక్షంగా మనకు ఓట్లేసి గెలిపించారు. అధికారంలో ఉన్నప్పుడు మరింత బాధ్యతగా వ్యవహరించాలి. శాశ్వతంగా ప్రజలు మనతో ఉండేలా చూసుకోవాలి. ప్రజల్లో మరింత నమ్మకాన్ని కలిగించాలి. మొదటి సారి ఎమ్మెల్యేలు నిత్యం ప్రజల్లో ఉండాలి. విమర్శలకు, వివాదాలకు, ఆరోపణలకు దూరంగా ఉండాలి." - చంద్రబాబు

ఎవరినైనా దూరం పెడతా.. వ్యవస్థకు నష్టం జరగకూడదు
తప్పు చేసే వారి కోసం పార్టీ సహా ప్రభుత్వ ప్రయోజనాలు విస్మరించను

వన్‌టైం ఎమ్మెల్యేగా ఉంటామంటే మీ ఇష్టం
ప్రతి ఆరుమాసాలకూ పనితీరుపై సర్వే
అధికారుల తీరుతోనూ ప్రభుత్వానికి చెడ్డపేరు
ఈ విషయంలో మంత్రులు బాధ్యతగా ఉండాలి
జగన్ పాలనలో రాష్ట్రమంతా నిరాశ, నిస్పృహ
ఆ ప్రభుత్వాన్ని భరించలేకే మనల్ని గెలిపించారు
కూటమి ఏడాది పాలనపై 12న విజయోత్సవాలు
14లోపే తల్లికి వందనం.. ఈ నెల్లోనే 'అన్నదాత'
టీడీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞం ఆగదని స్పష్టీకరణ



అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): "ప్రతి ఆరు నెలలకోసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు చేసి నివేదికలు తెప్పించుకుంటున్నా. మంచి చేస్తే ప్రోత్సహిస్తా. అవకాశాలు కల్పిస్తా. తప్పు చేస్తే మాత్రం దూరం పెడతా. అవసరమైతే వదులుకుంటా." అని ముఖ్యమంత్రి చంద్రబాబు.. టీడీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు తేల్చి చెప్పారు. తప్పులు చేసే వారి విషయంలో రాజీ పడబోనని అన్నారు. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని, ఏ ఒక్కరి వల్లైనా వ్యవస్థకు నష్టం జరుగుతుందనుకుంటే అంగీకరించేది లేదని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో చంద్రబాబు శనివారం టెలీకాన్ఫరెన్స్

మిగతా 13వ పేజీలో...



బాలాజీ గోవిందప్ప
రాజ్ కసిరెడ్డి
చాణక్య

లిక్కర్ సొమ్ము విదేశాలకు!

షెల్ కంపెనీల ద్వారా భారీగా మళ్లింపు
ముంబై కేంద్రంగా నడిచిన వ్యవహారం

కీలక రూటింగ్ గుర్తించిన సీఐడీ బృందం
గోవిందప్ప బినామీ బ్యాంక్ ఖాతా నుంచి షెల్ కంపెనీలకు మళ్లింపు
బ్యాంకుల కేంద్ర కార్యాలయాల్లో గుర్తింపు
ఐదు దశలు దాటి ఆరో దశలో విదేశాలకు
ముంబైలో డీఐజీ నేతృత్వంలో విచారణ

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ మద్యం కుంభకోణంలో సిట్ అధికారులు అత్యంత కీలక సమాచారం సేకరించారు. దోచుకున్న వేల కోట్లలో పెద్ద మొత్తం షెల్ కంపెనీలకు మళ్లించినట్టు గుర్తించారు. వాటి ద్వారా విదేశాలకు పంపినట్టు తాజాగా విచారణలో తేలింది. ఈ తతంగమంతా ముంబై కేంద్రంగా జరిగినట్టు కనుగొన్నారు. అత్యాధునిక టెక్నాలజీ వినియోగించి కీలక రూటింగ్ గుర్తించారు.

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో జరిగిన మూడున్నర వేల కోట్ల లిక్కర్ స్కామ్‌లో తవ్వే కొద్దీ సంచలన విషయాలు బయపడుతున్నాయి. కమీషన్ల సొమ్మును రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి మళ్లించడం, బంగారం కొనుగోలు చేయడంతో పాటు గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు కొంత ఖర్చు చేసినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో తేలిన సంగతి తెలిసిందే. ముడుపుల సొమ్ములో పెద్ద మొత్తం షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు చేరవేసినట్టు తాజాగా గుర్తించారు. డీఐజీ ర్యాంకు అధికారి నేతృత్వంలో వారం రోజుల క్రితం ముంబైకి వెళ్లిన పది మంది అధికారుల బృందం షెల్ కంపెనీలకు సంబంధించిన అత్యంత కీలక సమాచారాన్ని గుర్తించింది. హైదరాబాద్‌లో మద్యం వ్యాపారుల నుంచి వసూలు చేసిన నగదు ముంబైకు ఎలా చేరింది? అక్కడి నుంచి బంగారం కొన్నదెంత? అంతిమంగా షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు తరలించిన సొమ్ము ఎంత? ఆ సొమ్ము ఎన్ని దశలు దాటి ఎక్కడ నిల్వ అయిందనే సమాచారాన్ని కనుగొన్నట్లు తెలిసింది. వీటికి సంబంధించి కీలక ఆధారాలు సేకరించినట్టు సమాచారం. లిక్కర్ స్కామ్‌లో ఎందరో సూత్రధారులు, పాత్రధారులు ఇప్పటికే వెలుగులోకి వచ్చారు. అయితే అంతిమ లబ్ధిదారు ఎవరో తెలిసినా ఆయనకు

మిగతా 14వ పేజీలో...



రాజధాని అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, కొమ్మినేని దిష్టిబొమ్మలను తుళ్లూరు సెంటర్‌లో తగలబెడుతున్న రైతులు, మహిళలు

అది వేశ్యల రాజధాని

అమరావతిపై మరోసారి జగన్ బ్యాచ్ విషం
సాక్షి డిబేట్‌లో మహిళలకు ఘోర అవమానం
భగ్గుమన్న అమరావతి ప్రాంత మహిళలు
రోత మీడియాలో వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం
జర్నలిస్టులు కేఎస్ఆర్, కృష్ణంరాజుతో పాటు భారతిరెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్
ఆ చానల్ మూయించే వరకూ ఉద్యమిస్తామని వెల్లడి 13
24 గంటల్లో అరెస్టు చేయాలంటూ తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
మహిళల నిరసనకు రైతుల మద్దతు
రాజధానిలో దిష్టి బొమ్మల దహనం



బీజేపీ 'మహా' రిగ్గింగ్

మహారాష్ట్రలో మ్యాచ్ ఫిక్సింగ్‌తో గెలుపు
ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు అది బ్లూప్రింట్
రేపు బిహార్‌లోనూ జరిగేది ఇదే: రాహుల్
కాంగ్రెస్ నేత వ్యాఖ్యలను ఖండించిన ఈసీ 11



రాజీ దిశగా ట్రంప్-మస్క్?

'ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ట్రంప్ పేరు' పోస్టును తొలగించిన మస్క్
శాంతి కుదుర్చుకోవాలని అమెరికన్ ఫండ్ మేనేజర్ అభ్యర్థన
మీరు చెప్పిన దానిలో తప్పు లేదని బదులిచ్చిన టెస్లా సీఈవో
మస్క్ కొత్త రాజకీయ పార్టీ ప్రారంభిస్తారంటూ ఊహాగానాలు 11

స్మార్ట్ షాక్

అదానీ మీటర్లు బిగించాక భారీగా కరెంటు చార్జీలు

పరిశ్రమలు, వాణిజ్య సంస్థలపై బిల్లుల మోత
స్మార్ట్ మీటర్లపై జగన్ ప్రభుత్వంలో కాంట్రాక్టు
సాగుకు షిర్డీసాయి.. పట్టణాలకు అదానీతో
కూటమి వచ్చాక సాగుకు మినహాయింపు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రతిపక్షంలో ఉండగా అదానీ, షిర్డీసాయి విద్యుత్తు స్మార్ట్ మీటర్ల బిగింపు వద్దని చెప్పిన కూటమి.. ఇప్పుడు అవే విధానాలను అమలు చేస్తోంది. స్మార్ట్ మీటర్ల బిగింపు నుంచి వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు మినహాయింపు ఇచ్చినా.. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు బిగిస్తున్నారు. నెలకు 200 యూనిట్లకు పైగా విద్యుత్తు వాడే పట్టణ గృహ వినియోగదారులకు ప్రస్తుతానికి అమలు చేయడం లేదు. పరిశ్రమలకు అదానీ స్మార్ట్ మీటర్లు బిగించాక వస్తున్న కరెంటు బిల్లులు చూసి పారిశ్రామికవేత్తలు హడలిపోతున్నారు. విద్యుత్తు వాడకపోయినా

మిగతా 14వ పేజీలో...

ADITYA UNIVERSITY

nirf Rank Band 201-300 | NBA TIER 1 ACCREDITED | ACCREDITED BY NAAC A++ GRADE

25 Years EXCELLENCE

STEP INTO THE WORLD OF OPPORTUNITIES

EAPCET COUNSELLING CODE

ADTPPU



PLACEMENTS

INTERNSHIP OFFERS

2026

Company	Students	Stipend
Google	1 Student Selected	₹1.32 LAKH PER MONTH
Walmart	16 Students Selected	₹1 LAKH PER MONTH
AUTODESK	29 Students Selected	₹60,000 PER MONTH
AIRBUS	1 Student Selected	30,000 PER MONTH

2027

Company	Students	Stipend
Flipkart	1 Student Selected	₹50,000 PER MONTH

2025 PLACEMENTS

HITACHI Inspire the Next ₹35.36 Lakhs Per Annum	JMC ₹34.95 Lakhs Per Annum	TOYOTA connected ₹34.12 Lakhs Per Annum	Aisan ₹33.51 Lakhs Per Annum
JEMS ₹32.84 Lakhs Per Annum	Daiseki ₹31.70 Lakhs Per Annum	IHARA MFG.CO.,LTD. ₹29.02 Lakhs Per Annum	AD-TEC ₹28.61 Lakhs Per Annum
HITACHI ₹27.29 Lakhs Per Annum	Hitachi Industrial Equipment Systems Co.,Ltd. ₹27.16 Lakhs Per Annum	SANSUI ₹25.08 Lakhs Per Annum	Walmart ₹22.60 Lakhs Per Annum
pennant ₹20 Lakhs Per Annum	UiPath ₹17 Lakhs Per Annum	darwinbox ₹16.3 Lakhs Per Annum	3268+ Offers & Still Counting...

INTRODUCING IN THIS ACADEMIC YEAR

SCHOOL OF BUSINESS

- BBA
- BBA - Digital Marketing
- BBA - Business Analytics
- Master of Business Administration
- Ph.D. in Management Studies

SCHOOL OF PHARMACY

- B.Pharmacy
- Pharma D
- M.Pharmacy

SCHOOL OF SCIENCES

- B.Sc. - Forensic Science
- B.Sc. - Cyber Security & Digital Forensics
- M.Sc. - Forensic Science
- M.Sc. - Cyber Security & Digital Forensics

HOSTELS (AC & NON - AC)



- Apollo dispensary functioning 24/7
- Banking Facility on the Campus
- Free Health Insurance
- 24/7 CCTV Surveillance
- Round the clock Ambulance Facility
- Triple Sharing Room with attached Bath & Balcony
- High importance to cleanliness and hygiene
- Uninterrupted Power Supply

PROGRAMS OFFERED

SCHOOL OF ENGINEERING

BACHELOR OF TECHNOLOGY

- Civil Engineering.
- Electronics and Communication Engg.
- Electrical and Electronics Engineering.
- Mechanical Engineering.
- Computer Science and Engineering.
- Information Technology.
- Artificial Intelligence & Machine Learning.
- Data Science.
- Petroleum Technology.
- Mining Engineering.
- Agricultural Engineering.

MASTER OF TECHNOLOGY

- Structural Engineering.
- Power Electronics & Drives.
- Energy Science & Technology.
- VLSI Design.
- Computer Science & Engineering.
- CSE (AI&ML).

MASTER OF COMPUTER APPLICATIONS

- Ph.D. in All Disciplines

ADMISSIONS OPEN

Start Your Journey
Scan to Apply

₹5 Crore WORTH MERIT SCHOLARSHIPS

Contact us: +91 70360 76661, 70950 76663/4 | : 95536 49666 | www.adityauniversity.in

Aditya Nagar, ADB Road, Surampalem - 533 437, Kakinada Dist., Andhra Pradesh.



కొండ కిటకిట

వెంకన్న సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగుస్తుండటంతో పాటు వారాంతం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ మరింత పెరిగింది. శనివారం శ్రీవారి ఆలయ పరిసరాలతో పాటు తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాల్లో యాత్రికుల సందడి నెలకొంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో బాటగంగమ్మ కూడలి వరకు క్యూలైన్‌ రెండు కిలోమీటర్ల మేర వ్యాపించింది. వీరికి 18 గంటల దర్శన సమయం పడుతోంది. ఇక, స్లాటెడ్‌ సర్వదర్శనం టోకెన్లు, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్న భక్తులకూ దాదాపు మూడు గంటల తర్వాత దర్శనం లభిస్తోంది. కల్యాణకట్టలు, లడ్డూ కేంద్రం, అఖిలాండం, అన్నప్రసాద భవనాలూ రద్దీగా మారాయి. గదులకు డిమాండ్‌ మరింత పెరిగిపోయింది. గదులు పొందేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరాల్సి వచ్చింది. సీఆర్వో ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. అలాగే అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాలు కూడా భక్తులతో కిటకిటలాడుతున్నాయి. స్లాటెడ్‌ సర్వదర్శన టోకెన్లు జారీ చేసే భూదేవి కాంప్లెక్స్‌, శ్రీనివాసం, విష్ణునివాసం కూడా రద్దీగా మారాయి.

వైభవంగా సిద్దేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతి పట్టాభిషేకం


సిద్దేశ్వరానంద భారతి సమక్షంలో ఉత్తర పీఠాధిపతిగా పట్టాభిషిక్తులైన దత్తేశ్వరానంద భారతి

చెన్నై, జూన్ 7: తమిళనాడులోని కుర్తాళంలో ఉన్న సిద్దేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతిగా దత్తేశ్వరానంద భారతి పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. తెలుగు వారైన మౌనస్వామి స్థాపించిన ఈ పీఠంలో ఎందరో రుషులు, మునులు తపస్సు సాధన చేశారని పీఠం మేనేజరు మూర్తిరాజు ఈ సందర్భంగా పేర్కొన్నారు. పీఠ పురోహితులు మాచవోలు రమేశ్‌ శర్మ ఆధ్వర్యంలో ఈ పట్టాభిషేకం నిర్వహించారు. దత్తేశ్వరానంద భారతి స్వామి కుర్తాళ పీఠ వైభవాన్ని ముందుకు తీసుకెళ్తారని సిద్దేశ్వరి పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతి ఆకాంక్షించారు.

ఆప్కోలో అవినీతి ‘ట్యాగ్‌’లు

బిల్లులు లేకుండా ఖరీదైన చీరల విక్రయం

- వాటి ధరల ట్యాగ్‌లు బయట నుంచి తెచ్చిన చవక చీరలకు..
- స్టాకు రికార్డుల్లో తేడా రాకుండా మతలబు
- రికార్డుల ప్రకారం స్టాకు విలువ రూ. 100 కోట్లు
- నిజానికి ఉన్నది రూ. 30 కోట్ల విలువైన స్టాకే
- ఓ అధికారి నేతృత్వంలోనే విచ్చలవిడిగా అవినీతి
- వైసీపీ హయాంలో మొదలై ఇప్పటికీ కొనసాగుతున్న దోపిడీ
- తక్షణమే విజిలెన్స్‌తో ఆడిట్‌ చేయించాలంటున్న చేనేత సంఘాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు వరుస లేఖలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉదర్‌కా మాల్‌ ఇదర్‌.. ఇదర్‌కా మాల్‌ ఉదర్‌.. ఓ సినిమాలో ఈ డైలాగ్‌ ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర చేనేత సహకార సంఘం(ఆప్కో)లో తాజాగా బయటపడ్డ అవినీతికి ‘అతికినట్లే’ సరిపోతుంది. కొత్తపుంతలు తొక్కిన ఈ అవినీతిని చూస్తే ఔరా! అని పించకమానదు. నూలు పోగులు పేర్చి అందమైన వస్త్రాన్ని తీర్చిదిద్దే నేతన్నలకు అండగా నిలవాల్సిన ఆప్కోలో ధరల ట్యాగ్‌ల మాయాజాలం ఒకటి వెలుగు చూసింది. ఖరీదైన చేనేత చీరలను బిల్లులు లేకుండా విక్రయించేసి.. ఆ చీరల స్థానంలో తక్కువ ధర చీరలు తెచ్చిపెట్టి వాటికి అమ్మేసిన చీరల ట్యాగ్‌లు అతికించేసి కోట్లాది రూపాయలు నొక్కేశారు. వైసీపీ హయాంలో మొదలైన ఈ అవినీతి బాగోతం.. ఇప్పటికీ కొనసాగుతోంది. రాష్ట్రంలోని ఆప్కో షోరూమ్‌లు, డిపోల్లో మొత్తం రూ. 100 కోట్ల విలువైన చీరలు ఉన్నట్లు రికార్డుల్లో చూపిస్తుంటే వాటి అసలు ధర రూ. 30 కోట్లకు మించి ఉండదని చేనేత సహకార సంఘాలు ముఖ్యమంత్రికి రాసిన వరుస లేఖల్లో పేర్కొన్నాయి. తక్షణమే విజిలెన్స్‌ను రంగంలోకి దించి ఆడిట్‌ చేయిస్తే వెయ్యి రూపాయల విలువైన చీరపై పదకొండు



వేల రూపాయల ట్యాగ్‌ కనిపిస్తుందని చెబుతున్నాయి. ఆప్కోలో ‘మూర్తీ’భవించిన అవినీతిలా వెలిగే ఓ అధికారి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో సకల శాఖల మంత్రిగా ప్రసిద్ధుడైన నేత అండదండలతో అప్పట్లో రెచ్చిపోయిన ఆ అధికారి ప్రస్తుత ప్రభుత్వంలో తనకు ఓ ప్రజాప్రతినిధి నుంచి సంపూర్ణ మద్దతు ఉందని చెప్పుకుంటున్నారు. తనను అన్నా అని పిలిచే ఒక మంత్రి పేరు చెబుతూ.. ‘అన్నీ మినిస్టరే చూసుకుంటానని చెప్పారు.. నాకేమీ కాదు’ అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

డివిజన్‌కు ఐదు లక్షలు ఇవ్వాల్సిందే..

రాష్ట్రంలో తొమ్మిది చేనేత డివిజన్లు ఉన్నాయి. వాటి నుంచి ప్రతి నెలా ఐదు లక్షల రూపాయలు ఇవ్వాల్సిందే అంటూ ఆ అధికారి ఆప్కోను పీల్చి పిప్పి చేస్తున్నారని, అందుకే ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయని నేతన్నలు చెబుతున్నారు. అంత మొత్తం ఎలా ఇచ్చుకోవాలో తెలియక తలలు పట్టుకొంటున్న వారికి ధరల ట్యాగ్‌ల మార్పు సలహాలిచ్చి మరీ దోచుకొంటున్న ఆ అధికారి గురించి ముఖ్యమంత్రికి రాసిన లేఖల్లో ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలు ఏరికోరి తెచ్చుకున్న ఆయనకు మద్దతుగా నిలుస్తోన్న ప్రజాప్రతినిధులకూ వాటా ఉందని వారు ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి విచారణకు ఆదేశిస్తే మొత్తం వ్యవహారం బయట పడి ఇటు చేనేత వర్గాలకు న్యాయం జరిగి అటు ఆప్కో నిర్వీర్యం కాకుండా నిలబడే అవకాశం ఉందని నేతన్నలు చెబుతున్నారు.

తమిళనాడు చవక చీరలు తెచ్చి..

ఆంధ్రప్రదేశ్‌లో లక్షన్నర వరకూ చేనేత మగ్గాలుంటే సుమారు 952 చేనేత సహకార సంఘాలున్నాయి. అధికారికంగా మూడున్నర లక్షల మంది చేనేత కార్మికులు మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరి నుంచి చీరలు, ఇతర వస్త్రాలు సేకరించి సొసైటీలు ఆప్కోకు సరఫరా చేస్తే అక్కడ విక్రయించి నేతన్నను ఆదుకోవాలి. చేనేత కార్మికులు కష్టపడి నేస్తున్న చీరలు, వస్త్రాలు ఐదేళ్ల క్రితం వరకూ ఆప్కో బాగానే కొనుగోలు చేసింది. కరోనా సమయం(2020) నుంచి కొనుగోళ్లు తగ్గించి అప్పటికే ఉన్న స్టాకు విక్రయిస్తూ వచ్చింది. ఇక్కడే అవినీతికి తెరలేచింది. అదెలాగంటే.. ధర్మవరం, మాధవరం, వెంకటగిరి, చీరాల, మంగళగిరి, ఉప్పాడ తదితర ప్రాంతాల్లోని ఖరీదైన చీరలు బిల్లులు లేకుండా విక్రయించడం మొదలు పెట్టారు. అయితే ఆడిట్‌ జరిగినప్పుడు విషయం బయట పడకుండా ఉండేందుకు విక్రయించిన చీరల రేట్ల ట్యాగ్లు తక్కువ ధర చీరలకు అతికించి షోరూముల్లో స్టాకు ఉన్నట్లే చూపిస్తున్నారు. తమిళనాడులోని కొయంబత్తూరు, ఈరోడ్‌ నుంచి మన చేనేతల రకాలను పోలిన తక్కువ ధర చీరల్ని తీసుకొచ్చి పెట్టి అమ్మేసిన చీరల ధరల ట్యాగులు తగిలించి స్టాకు నిల్వలో ఎక్కడా తేడా రాకుండా జాగ్రత్త పడుతున్నారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తే అసలు గుట్టు రట్టవుతుందని, విజిలెన్స్‌ రంగంలోకి దిగితే ఈ అవినీతి బండారం బయటపడుతుందని చేనేత సంఘాల ప్రతినిధులు నేరుగా ముఖ్యమంత్రికి రాసిన లేఖల్లో వివరించారు.

నారాయణ విద్యార్థులకు సీఎం అభినందనలు

- చంద్రబాబును కలిసిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ర్యాంకర్లు


జేఈఈ ర్యాంకర్లను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో నారాయణ డైరెక్టర్లు సింధూర, శరణి

అమరావతి, జూన్‌ 7 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్‌-2025 ఫలితాల్లో ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విజయవాడ నారాయణ కళాశాల విద్యార్థులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. ఆలిండియా ఓపెన్‌ కేటగిరీలో 10వ ర్యాంకు సాధించిన వడ్లమూడి లోకేశ్‌, 51వ ర్యాంకు సాధించిన భానుచరణ్‌ రెడ్డి, 82వ ర్యాంకు సాధించిన తోరాటి భరద్వాజ్‌, 98వ ర్యాంకు సాధించిన జస్వంత్‌ వెంకట రఘువీర్‌ను, వారి తల్లిదండ్రులను ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఐఐటీ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో ప్రవేశం సాధించడం సామాన్య విషయం కాదని, ఇంతటి ప్రతిభావంతులైన విద్యార్థులు మరిన్ని నూతన శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జన్మభూమితో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నతికి పాటుపడాలని కోరారు. టాప్‌ ర్యాంకుల సాధనకు విజయ సారథ్యం వహించిన నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. మరెందరో విజేతలను ఆవిష్కరించాలని సూచించారు.

లోకేశ్‌ చొరవతో గల్ఫ్‌ నుంచి స్వగ్రామానికి

- మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు మహిళ పాలాభిషేకం



నల్లజర్ల, జూన్‌ 7 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్‌, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తనకు పునర్జన్మ ఇచ్చారని గల్ఫ్‌ బాధితురాలు ఆనందం వ్యక్తం చేసింది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలోని తన నివాసం వద్ద శనివారం మంత్రి లోకేశ్‌, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు చిత్రపటాలకు ఆమె పాలాభిషేకం చేసింది. గ్రామానికి చెందిన చిలకా నిర్మల ఉపాధి నిమిత్తం 16 నెలల కిందట గల్ఫ్‌ వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొంది. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు ద్వారా విషయం తెలుసుకున్న లోకేశ్‌ కువైత్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడి ఆమె స్వదేశానికి రావడానికి ఏర్పాట్లు చేశారు. దీంతో నిర్మల గత నెల 27న ఇంటికి చేరగా, బంధువులు ఆసుపత్రిలో చేర్పించడంతో కోలుకుంది.

పట్టణ కోళ్ల ఫారాలకు మినహాయింపులు

అమరావతి, జూన్‌ 7(ఆంధ్రజ్యోతి):పట్టణ ప్రాంతాల్లో కోళ్ల ఫారాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. డెవలప్‌మెంట్‌ చార్జీలు, బెటర్మెంట్‌ చార్జీల నుంచి పూర్తిగా మినహాయింపు ఇచ్చింది. లైసెన్సు ఫీజులు కూడా గ్రామీణ ప్రాంతాల్లో మాదిరిగానే వర్తింపజేసింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్‌ అధ్యక్షుడు కోమటిపల్లి సుబ్బారావు శనివారం ఓ ప్రకటన చేశారు. పౌల్ట్రీకి మద్దతుగా నిలిచినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు రాజశేఖర్‌, దామోదర్‌నాయుడుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఎన్టీఆర్‌ జీవితం మహోన్నతం: టీడీ జనార్దన్‌

- మెల్‌బోర్న్‌లో నటరత్న సినీ వజ్రోత్సవం

అమరావతి, జూన్‌ 7(ఆంధ్రజ్యోతి): ‘ఎన్టీఆర్‌ జీవితం మహోన్నతమైనది, మహోజ్వలమైనది. ఆయన స్ఫూర్తి, విధానాలు, సిద్ధాంతాలు నేటి తరానికి ఆచరణీయం’ అని ఎన్టీఆర్‌ లిటరేచర్‌ కమిటీ ఛైర్మన్‌ టీడీ జనార్దన్‌ అన్నారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌ నగరంలో ఎన్నారై తెలుగుదేశం, స్థానిక తెలుగు సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌ సినీ వజ్రోత్సవ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో వేలాది మంది తెలుగువారు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బోడె ప్రసాద్‌, ఎన్టీఆర్‌ తనయుడు రామకృష్ణ, నారా రోహిత్‌ తదితరులు పాల్గొన్నారు.

‘కన్నప్ప’లో బ్రాహ్మణులను కించపరిచారు

- గుంటూరులో బ్రాహ్మణ చైతన్య వేదిక నిరసన

గుంటూరు, జూన్‌ 7(ఆంధ్రజ్యోతి): మంచు విష్ణు నటించిన కన్నప్ప సినిమాలో పిలక, గిలక అనే పాత్రలు పెట్టి బ్రాహ్మణ సంప్రదాయాన్ని అవమానించారని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌ శర్మ, అర్చక సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి మండిపడ్డారు. ఇందుకు నిరసనగా శనివారం గుంటూరు శంకర్‌ విలాస్‌ సెంటర్లో ‘శివయ్యకు అపచారం-తిన్నడుకు అన్యాయం’ పేరుతో శివలింగాన్ని ఏర్పాటు చేసి ఏకరుద్రాభిషేకాలు చేశారు. సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ, అర్చక పురోహిత బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ప్రదర్శన చేపట్టారు.

పల్లా శ్రీనివాస్‌కు పితృవియోగం

- మాజీ ఎమ్మెల్యే సింహాచలం కన్నుమూత
- పల్లాకు చంద్రబాబు, పవన్‌, లోకేశ్‌ పరామర్శ


పల్లా సింహాచలం

విశాఖపట్నం/అమరావతి, జూన్‌ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం (86) శనివారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన స్థానిక రాజేంద్రనగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. సింహాచలంకు భార్య మహాలక్ష్మి, కుమారులు శంకరరావు, శ్రీనివాసరావు, కుమార్తె రాజేశ్వరి ఉన్నారు. వీరిలో రెండో కుమారుడైన శ్రీనివాసరావు ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, గాజువాక ఎమ్మెల్యేగా ఉన్నారు. గాజువాకకు చెందిన పల్లా సింహాచలం కార్మిక నాయకుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత 1974లో గాజువాక సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆ పదవిలో చాలా కాలం కొనసాగారు. 1985 ప్రాంతంలో టీడీపీలో చేరారు. 1994 ఎన్నికల్లో విశాఖపట్నం-2 నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. సింహాచలం అంత్యక్రియలు ఆదివారం గాజువాకలో నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

పల్లాకు ఫోన్‌లో పరామర్శ

సింహాచలం మృతి విషయం తెలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌, మంత్రి లోకేశ్‌ పల్లా శ్రీనివాసరావును ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. విశాఖపట్నం-2 నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేగా ఆయన చాలా కృషి చేశారని సీఎం కొనియాడారు. సింహాచలం దశాబ్దాలుగా పార్టీకి సేవలందించారని లోకేశ్‌ పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంతాపం తెలిపారు.

గ్రీన్‌ కో ప్రాజెక్టు అద్భుతం

- తెలంగాణలోనూ ఇలాంటి ప్రాజెక్టు ఏర్పాటు చేస్తాం
- ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ప్రాజెక్టు సందర్శన


ప్రాజెక్టును పరిశీలిస్తున్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఓర్వకల్లు, జూన్‌ 7(ఆంధ్రజ్యోతి): ‘ప్రపంచ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రీన్‌ కో ఇంటిగ్రేటెడ్‌ రెన్యూవబుల్‌ ఎనర్జీ ప్రాజెక్టు ఒక అద్భుతం’ అని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని గుమ్మితం తండా సమీపాన ఉన్న గ్రీన్‌ కో ఇంటిగ్రేటెడ్‌ రెన్యూవబుల్‌ ఎనర్జీ ప్రాజెక్టును ఆయనతో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత సందర్శించారు. తెలంగాణ బృందం అప్పర్‌ ఇన్‌టేక్‌ పాయింట్‌ సోలార్‌ పార్కు, విండ్‌ పవర్‌ ప్రాజెక్టు, రిజర్వాయరు, టన్నెల్‌ను పరిశీలించింది. అనంతరం విలేకరులతో డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడారు. గ్రీన్‌ కో ఇంటిగ్రేటెడ్‌ రెన్యువబుల్‌ ఎనర్జీ స్టోరేజ్‌ ప్రాజెక్టు పురోగతిని ప్రశంసించారు. ప్రపంచంలో మొట్టమొదటి అతి పెద్ద ఇంటిగ్రేటెడ్‌ రెన్యూవబుల్‌ ఎనర్జీ ప్రాజెక్టు మన దేశంలో ఉండటం గర్వకారణమన్నారు. గ్రీన్‌ ఎనర్జీ ప్రాజెక్టును తెలంగాణలోనూ ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నామని, ఆ నేపథ్యంలోనే పరిశీలించడానికి వచ్చామని తెలిపారు. 20 వేల మెగా వాట్ల గ్రీన్‌ ఎనర్జీని ఉత్పత్తి లక్ష్యాన్ని టీఎస్‌ ప్రభుత్వం పెట్టుకుందన్నారు. అనుకున్న సమయంలో ప్రాజెక్టు పూర్తి చేసిన గ్రీన్‌కో సంస్థను అభినందించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

రాష్ట్రంలో ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో తెలుగుదేశం, వైసీపీలకు చెరో 40 శాతం ఓట్లు ఉన్నాయి. 2019కి పూర్వం చంద్రబాబు ప్రభుత్వంపై ఎంతగా విష ప్రచారం చేసినా, ఎన్ని కులాలను దూరం చేసినా తెలుగుదేశం పార్టీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. జగన్‌రెడ్డి పాలన ఎంత అరాచకంగా సాగినా 2024లో ఆయనకు కూడా 40 శాతం ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో కూటమిలో మనస్పర్థలు సృష్టించే ప్రయత్నాలను కూడా జగన్‌రెడ్డి చేస్తున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే పరిస్థితులు ఎంత దారుణంగా ఉంటాయో తెలుసు కనుకే ఎవరు ఎన్ని కుట్రలకు పాల్పడినా కూటమి భాగస్వామ్య పక్షాలు అపోహలకు తావు లేకుండా జాగరూకతతో వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను అభినందించాలి. కింది స్థాయిలో కూటమి కార్యకర్తల మధ్య విభేదాలు ఉన్న మాట వాస్తవం. అయితే అవి రాష్ట్ర స్థాయిలో లేకపోవడం శుభ పరిణామం.

జగన్... నేరం... రాజకీయం!



తన కోపమే తన శత్రువు అని పెద్దలు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయిన జగన్మోహన్‌రెడ్డి ఇటు ప్రజల పైన, అటు రాజకీయ ప్రత్యర్థులపైన పట్టరాని కోపంతో రగిలిపోతున్నారు. ఆగ్రహావేశాలతో తాను ఏమి చేస్తున్నానో కూడా ఆయన మరచిపోతున్నారు. 'జగనన్న ఉండగా నేరస్తులు అందరికీ పండగే' అన్న పథకాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నట్టుగా ఉంది. అలా అని అతడిని తెలివి తక్కువవాడిగా భావించడానికి కూడా లేదు. రాష్ట్రంలో రాజకీయాలను మరో లెవల్‌కు తీసుకువెళ్లే పనిలో జగన్ బిజీగా ఉంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తెనాలిలో పేరు మోసిన ముగ్గురు నేరస్తులను పోలీసులు ఇటీవల నడిరోడ్డుపై చితకబాదారు. ఆ ముగ్గురూ దళితులు కావడంతో దొరకునా ఇటువంటి మహదావకాశం అన్నట్టుగా జగన్‌రెడ్డి ఆ ముగ్గురి కుటుంబాల పరామర్శకు వెళ్లారు. దీనిపై సామాన్య ప్రజల్లో ఆయనపై వ్యతిరేకత ఏర్పడింది. బాధితులు కరుడుగట్టిన నేరస్తులని తెలిసి కూడా పరామర్శకు పూనుకున్నారంటే... అందుకు జగన్‌రెడ్డి ఆలోచనలు, రాజకీయ ఎత్తుగడలు వేరే లెవల్లో ఉండటమే కారణం. సదరు నేరస్తులను పోలీసులు బహిరంగంగానే ప్రజల సమక్షంలో కొట్టడం చట్టరీత్యా నేరమే! ప్రజా కంటకులుగా మారిన నేరస్తులను బహిరంగంగా శిక్షించాలని గతంలో ప్రజలు కోరుకొనేవారు. అలా నేరస్తులను శిక్షించిన అధికారులకు బ్రహ్మరథం పట్టేవారు. ఈ కారణంగానే పలువురు పోలీసు అధికారులు నేరస్తుల పాలిట సింహస్వప్నంగా మారారు. అలాంటి అధికారుల ప్రేరణతో నిర్మించిన సినిమాలను కూడా ప్రజలు ఆదరించేవారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో కొత్త దాస్ అనే రౌడీ ఉండేవాడు. అతని ఆగడాలు మితిమీరడంతో పోలీసులు ఎన్‌కౌంటర్ పేరిట కాల్చి చంపారు. రెండు మూడు కేసులలో ప్రస్తుతం జైల్లో ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును ఒకప్పుడు ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పిలిచేవారు. కరుడుగట్టిన నేరస్తులను కాల్చి చంపిన చరిత్ర ఆయనది. ప్రస్తుతం వైసీపీ ప్రధాన నాయకులలో ఒకరిగా చలామణి అవుతున్న లేళ్ల అప్పిరెడ్డిని గుంటూరు జిల్లా ఎస్పీగా ఉన్నప్పుడు ఆయన జిల్లా బహిష్కరణ చేశారు. ఒకప్పుడు ఇలాంటి అధికారులను హీరోలుగా ప్రజలు అభిమానించేవారు. ఇప్పుడు రోజులు మారాయి. ప్రజల్లో హక్కుల పట్ల చైతన్యం వచ్చింది. ఇది గుర్తించినందునే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంపీ రఘురామ కృష్ణరాజును అర్ధరాత్రి పోలీసు కస్టడీలో అరికాళ్లు పగిలేలా కొట్టారు. ఇప్పుడు కాల క్రమంలో నేరస్తులకు, రాజకీయ నాయకులకు మధ్య తేడా అంతరించిపోతూ వస్తోంది. నేరస్తులకు అధికారం అందడంతో నిజాయితీగా పనిచేసిన పోలీసు అధికారులు కూడా తమ స్వభావాన్ని మార్చుకొని వారితో జత కట్టారు. ఈ మార్పు కారణంగానే పీఎస్ఆర్ ఆంజనేయులు ఇప్పుడు జైలు జీవితం గడపాల్సి వస్తోంది. ఒకప్పుడు నేరస్తుల భుజంపై చేయి వేయాలంటే రాజకీయ నాయకులు భయపడేవారు. ఇప్పుడు వారి చుట్టూ నేరస్తులే ఉంటున్నారు. జగన్‌రెడ్డి తెనాలి పర్యటనను ఈ నేపథ్యంలోనే చూడాలి. తన ఓటు బ్యాంకును స్థిరీకరించుకొనే పనిలో భాగంగా నేరస్తుల కుటుంబాల పరామర్శకు జగన్‌రెడ్డి బయలుదేరారు. అయితే అంతిమంగా అది మంచి చేస్తుందా?, చెడుచేస్తుందా? అంటే ఇప్పుడే చెప్పలేం.

క్రిమినల్ పాలిటిక్స్...

పులివెందుల మార్క్ రాజకీయాలు రాష్ట్రంలోకి ప్రవేశించిన తర్వాత సంఘ విద్రోహ శక్తులకు, నేరస్తులకు రాజకీయాల్లోకి ఎంట్రీ లభించింది. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మొదలైన ఈ సంస్కృతి ఇప్పుడు స్వైర విహారం చేస్తోంది. ఒకప్పుడు వైఎస్ రాజారెడ్డి పులివెందులలో చిన్నా చితకా నేరస్తులను చేరదీసి తన బలం పెంచుకున్నారు. క్రమంగా కడప జిల్లాపై కూడా అంతో ఇంతో పట్టు సాధించారు. ఈ క్రమంలో ఆయన కుమారుడు రాజశేఖరరెడ్డి రాష్ట్ర రాజకీయాలలోకి ప్రవేశించారు. కాంగ్రెస్ పార్టీలో తనకంటూ ఒక బలమైన వర్గాన్ని తయారు చేసుకునేందుకు దౌర్జన్యాలకు పాల్పడే వారిని, హత్యా నేరాలకు పాల్పడే వారిని చేరదీశారు. రాజారెడ్డి ముఠా నాయకుడిగా జిల్లా స్థాయిలో విస్తరించగా, రాజశేఖరరెడ్డి రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ నాయకుడిగా ఎదిగారు. 'కడప పాలెగాళ్లు' పేరిట పౌర హక్కుల సంఘం వాళ్లు ప్రచురించిన పుస్తకంలో వైఎస్ కుటుంబం గురించి వివరించారు. రాజశేఖరరెడ్డి 1984లో పీసీసీ అధ్యక్షుడైన తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో వివిధ జిల్లాలలో రౌడీ నేపథ్యం ఉన్న వారిని చేరదీసి 'కాంగ్రెస్ నాయకుడు' అనే హోదా ఇప్పించారు. అలాంటి వారందరికీ రాజశేఖరరెడ్డి ఆరాధ్య దైవం అయ్యారు. తనను నమ్మిన వాళ్ల కోసం రాజశేఖరరెడ్డి ఎంత దూరమైనా వెళతారు, మాట తప్పరు–మడమ తిప్పరు అని ప్రచారం చేయించుకున్నారు. ఈ ప్రచారం పతాక స్థాయికి చేరడంతో పులివెందుల మార్కు రాజకీయం వల్ల దీర్ఘకాలంలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ప్రజలు గ్రహించలేకపోయారు. రాజశేఖరరెడ్డి పట్ల అభిమానాన్ని పెంచుకున్నారు. రాజశేఖరరెడ్డి పెంచి పోషించిన రౌడీలు, ఫ్యాక్షనిస్టులు ఇప్పుడు వైసీపీలో ప్రముఖులుగా ఎదిగారు. ఒక హత్య కేసులో శిక్ష పడి జైలుకు వెళ్లి వచ్చిన గౌరు వెంకటరెడ్డిని తన పాదయాత్ర సందర్భంగా రాజశేఖరరెడ్డి పరామర్శించారు. అప్పట్లో ఇదొక సంచలనం. ఇప్పుడు నాయకుడంటే అలాగే ఉండాలని అనుకుంటున్నారు. చంద్రబాబు అలా ఉండటం లేదని విమర్శిస్తున్నారు. 2004లో అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డి... గౌరు వెంకటరెడ్డికి శిక్ష తగ్గింపచేసి జైలు నుంచి విడుదల చేయించారు. ఈ మోడల్‌ను ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి మరింత వికృత రూపంలో అమలు చేస్తున్నారు. డాక్టర్ చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో జరిగిన మత ఘర్షణల వెనుక రాజశేఖరరెడ్డి ఉన్నారని అప్పట్లోనే ముఖ్యమంత్రి మద్దతుదారులు ఆరోపించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వంగవీటి రంగా హత్య జరిగింది. దీంతో కోస్తా జిల్లాల రాజకీయాల్లోకి రాజశేఖరరెడ్డి ప్రవేశించారు. రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలను రెండు కులాల మధ్య అంతరం సృష్టించడానికి వాడుకున్నారు. హత్యకు గురైన రంగా విగ్రహాలను అప్పట్లో పలు జిల్లాల్లో ఏర్పాటు చేయించారు. దీంతో ఆ సామాజికవర్గంలో తన పరపతి, పట్టు పెంచుకున్నారు. కాపు, కమ్మ కులాల మధ్య అప్పుడు రగిలించిన విద్వేషపు చిచ్చు ఇప్పటికీ ఆరిపోలేదు. ఈ క్రమంలో రాజకీయాలలో పెద్ద మనుషులుగా చలామణి అయిన వారు తెర మరుగై, నేర నేపథ్యం ఉన్నవాళ్లు ఆ స్థానాల్లోకి చేరుకున్నారు.

విగ్రహ రాజకీయం...

రాజశేఖరరెడ్డి మరణానంతరం జగన్మోహన్‌రెడ్డి కూడా తండ్రి విగ్రహాలను ఊరూ వాడా ఏర్పాటు చేయించారు. రాజశేఖరరెడ్డిని మహానేతగా శ్లాఘింపజేశారు. రాజశేఖరరెడ్డి నాటిన విష బీజాల వల్ల కొన్ని వర్గాలవారు వైసీపీకి అండగా నిలిచారు. తండ్రి వేసిన బాటను తనయుడు జగన్‌రెడ్డి విస్తరించారు. అధికారంలో ఉన్నప్పుడు నేర నేపథ్యం ఉన్న వాళ్లను అందలం ఎక్కించారు. జగన్ మనస్తత్వం గుర్తించిన ఇతరులు కూడా అదే దారి ఎంచుకున్నారు. ఫాక్షన్ గొడవలకు పేరు మోసిన పల్నాడు ప్రాంతంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వంటి వారిని చేరదీశారు. శ్రీకాకుళం లాంటి జిల్లాలో సీదిరి అప్పలరాజు, దువ్వాడ శ్రీనివాస్‌లాంటి వారిని రాజకీయాల్లో ఎప్పుడైనా చూశామా? మండలి వెంకటకృష్ణారావు, కేఎల్ రావు, పిన్నమనేని కోటేశ్వరరావు వంటి వారు ప్రాతినిధ్యం వహించిన కృష్ణా జిల్లాలో వల్లభనేని వంశీ, కొడాలి నాని వంటి వారిని ప్రోత్సహించారు. అమరావతి ప్రాంతంలో నందిగం సురేశ్ వంటి వారు పుట్టుకొచ్చారు. బోరుగడ్డ అనిల్ వంటి వారు గతంలో రాజకీయాల్లో ఉండేవారా? అలాంటి వాళ్లను నాయకులు ఎప్పుడైనా ప్రోత్సహించారా? జగన్‌రెడ్డి మాత్రమే ఆ పని చేయగలిగారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అసాంఘిక శక్తులకు బలం చేకూరిందంటే అందుకు జగన్‌రెడ్డి కారణం. అందరిదీ ఒకటే స్కూల్– ఒకటే సిలబస్! తాము ఆరాధించే నాయకుడి కోసం నేరాలు చేయడం! అవసరమైతే జైలుకు వెళ్లడం తమకు లభించిన అదృష్టంగా ఈ అసాంఘిక శక్తులు భావించే పరిస్థితి ప్రస్తుతం ఉంది. అందుకే ఇప్పుడు జైలుకు వెళ్లిన వారిలో కనీస పశ్చాత్తాపం కనిపించడం లేదు.

> **ఇప్పుడు మళ్లీ రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే కుట్రలకు తెర లేపే అవకాశం లేకపోలేదు. కుల విద్వేషాలను రగిలించడం వల్ల రాష్ట్రం వల్లకాడు అవుతుంది. అయినా రాష్ట్రం గురించి, పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించలేని స్థితికి ప్రజలను తీసుకువెళ్లడమే 'పులివెందుల మోడల్!'**

మారిన రోజులు...

గాంధేయవాదిగా పేరు తెచ్చుకున్న మండలి వెంకట కృష్ణారావు... సొంత సామాజికవర్గానికి చెందిన రంగాను దూరం పెట్టారు. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్న వారిలో పేర్ని కృష్ణమూర్తి ఒకరు. ఆయన తనయుడు పేర్ని నాని ఇలా వ్యవహరిస్తారని, ఇలా మాట్లాడతారని ఎవరైనా ఊహించారా? ఒకప్పుడు రాయలసీమలోని కొన్ని ప్రాంతాలకే పరిమితమైన పాలెగాళ్ల సంస్కృతి ఇప్పుడు రాష్ట్రమంతా విస్తరించింది. బొడ్డెపల్లి రాజగోపాల్ నాయుడు, సర్దార్ గౌతు లచ్చన్న వంటి వాళ్లు ఉండిన శ్రీకాకుళం జిల్లాలో కూడా ఇప్పుడు పాలెగాళ్ల సంస్కృతి ప్రవేశించిందంటే, అందుకు వైఎస్ కుటుంబం కారణం కాదా? సామాజిక సమీకరణాల పేరిట దళితులు, ఇతర బడుగు వర్గాలలోని అసాంఘిక శక్తులను గుర్తించి, ప్రోత్సహించడంలో ఇప్పటికీ జగన్‌రెడ్డిని మించినవారు లేరు. గోరంట్ల మాధవ్ పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నప్పుడు ఒక ప్రభుత్వ ఉద్యోగిని లాఠీతో బహిరంగంగా కొట్టుకుంటూ తీసుకెళ్లారు. అలాంటి వ్యక్తిని గుర్తించిన జగన్ ఎంపీ సీటు ఇచ్చి ప్రోత్సహించడం దేనికి సంకేతం? జగన్ చుట్టూ ఇప్పుడు ఇలాంటి వారే. అందుకే జైలుకు వెళ్లి వచ్చినా వారిలో మార్పు రావడం లేదు, వెరపు ఉండటం లేదు. రాష్ట్రంలో నేర చరిత్ర ఉన్న వారిని గుర్తించి రాజకీయం ముసుగులోనో, నమ్మిన వాళ్లకు అండగా ఉంటాడనే ముసుగులోనో వాళ్లను చేరదీయడం, పెంచి పోషించడం, తన చేతికి మట్టి అంటకుండా వారిని వాడుకోవడం వైఎస్ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య. అధికారం కోల్పోయినప్పుడు శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తారు. కులాల మధ్య కుంపట్లు రగిలిస్తారు. రాజశేఖరరెడ్డికి అధికారం అందే వరకు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు కూడా ఈ కుటుంబం కుతంత్రాలను తట్టుకోలేకపోయారు. ఇప్పుడు జగన్‌రెడ్డి అధికారాన్ని కోల్పోయారు. ఎటువంటి కుతంత్రాలకు తెరలేపుతారో చూడాలి. అధికారంలో ఉన్నప్పుడు డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా వేధించి ఆత్మహత్య చేసుకొనే వరకు వేటాడారు. డ్రైవర్ సుబ్రమణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేశారు. వరప్రసాద్‌కు శిరోముండనం చేశారు. వీరంతా దళితులే. డ్రైవర్ సుబ్రమణ్యాన్ని హత్య చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ అనంతబాబును జగన్‌రెడ్డి దూరం పెట్టకపోవడం గమనార్హం. తెనాలిలో నేర నేపథ్యం ఉన్న వారిని పోలీసులు బహిరంగంగా శిక్షించడంపై గుండెలు బాదుకుంటున్న జగన్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్‌కు ఏ నేర నేపథ్యం ఉందో చెబుతారా? డ్రైవర్ సుబ్రమణ్యం చేసిన పాపం ఏమిటి? వారు కూడా దళితులే కదా? అని అప్పుడెందుకు అనిపించలేదు?

> **కేసులు ఉన్నవారు ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు. అలాగే... రౌడీషీటర్లు, గంజాయి వ్యాపారం చేసేవాళ్లు, ఇతర నేరాలకు పాల్పడినవాళ్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులని కూటమి ప్రభుత్వం ఎందుకు ప్రకటించకూడదు? ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఒక్క రాజకీయ పార్టీ కూడా వ్యతిరేకించలేదు. రాష్ట్రంలో కూడా ఈ విధానాన్ని అమలు చేస్తే జగన్‌రెడ్డి వ్యతిరేకించగలరా? నేరస్తులకు అండగా నిలబడగలరా? ఇలాంటి చర్యల తర్వాత నేర స్వభావం ఉన్న వారి సంఖ్య తగ్గుముఖం పట్టదా? జగన్‌రెడ్డి మోడల్ రాజకీయాల నుంచి రాష్ట్రాన్ని బయట పడెయ్యడంతో పాటు యువతను సన్మార్గం వైపు నడిపించగల విప్లవాత్మక నిర్ణయాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టాలి. కేసులలో ఇరుక్కుంటే తమ పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు లభించవు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవు అన్న భయం కల్పించగలిగితే అందరూ దారిలోకి వస్తారు. లేని పక్షంలో జగన్‌రెడ్డి వంటి వారి అండ చూసుకొని ఇంటికో రౌడీ తయారవుతాడు. అదే జరిగితే రాష్ట్రం ఏమవుతుందో ఊహించగలమా?**

జగన్ తెనాలి పర్యటన వల్ల తటస్థ ఓటర్లలో తన పట్ల వ్యతిరేకత ఏర్పడే అవకాశం ఉందని జగన్‌కు తెలియదని అనుకోగలమా? ఓటు బ్యాంకును భద్రపరుచుకొనే పనిలోనే ఇలాంటి ఎత్తుగడలకు ఆయన పాల్పడుతుంటారు. జగన్ పాలనలో ఎంతో మంది దళితులపై దాడులు జరిగాయి. అయినా మెజారిటీ దళితులు, క్రైస్తవులు ఆయన వెంటే ఎందుకు నిలబడ్డారు? అంటే, జగన్ ఆడుతున్న జగన్నాటకం వల్లనే. తెనాలిలో రౌడీ షీటర్లకు మద్దతుగా అధిక శాతం దళితులు నిలబడ్డారు. డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రమణ్యం వంటి మంచివాళ్ల కోసం అదే దళితులు ఎందుకు నిలబడలేదు? ఈ సైకాలజీని ఒడిసిపట్టుకున్న జగన్‌రెడ్డి వారిని కవచంలా వాడుకుంటున్నారు. జీసస్ తర్వాత తమ దైవం జగన్‌రెడ్డి అని క్రైస్తవులు భావించే పరిస్థితి కల్పించారు. వారిని అలా మార్చడంలో కూడా జగన్‌రెడ్డి వ్యూహం దాగి ఉంది. దళితులు కూడా జగన్ మనవాడు అని భావిస్తున్నారు. అందుకే జగన్ అధ్వానపు పరిపాలనను ఈ రెండు వర్గాల వారు పట్టించుకోలేదు. రెడ్లు, ముస్లింలు వివిధ కారణాల వల్ల జగన్‌కు మద్దతుగా ఉంటున్నారు. ఈ వర్గాల్లో ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది. కుల, మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టగలిగితే అభివృద్ధి, సంక్షేమాలకు అతీతంగా ఎన్నికల ఫలితాలు ఉంటాయని జగన్‌రెడ్డి నమ్ముతున్నారు. అందుకే కొన్ని కులాలను ఇతర కులాలకు శత్రువుగా చిత్రీకరించే పని చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కమ్మ, కాపు కులాలను టార్గెట్ చేసుకున్నారు. తమ రాజకీయ అధికారానికి అడ్డు వచ్చే వాళ్లు దళితులైనా, క్రైస్తవులైనా, రెడ్లైనా, ముస్లింలైనా ఆ కుటుంబం క్షమించదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తోంది. ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. అయినా 'మేం అధికారంలోకి వచ్చాక మీకు ఉంటుందిరా!' అని వైసీపీలోని కింది స్థాయి వాళ్లు కూడా తొడ గొడుతున్నారంటే కేసులు – జైళ్లు అంటే వారికి భయం లేకపోవడమే కారణం.

నేరస్తుల్లో భయం ఉండాలి...

కేసులు ఉన్నవారు ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు. అలాగే... రౌడీషీటర్లు, గంజాయి వ్యాపారం చేసేవాళ్లు, ఇతర నేరాలకు పాల్పడినవాళ్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులని కూటమి ప్రభుత్వం ఎందుకు ప్రకటించకూడదు? ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఒక్క రాజకీయ పార్టీ కూడా వ్యతిరేకించలేదు. రాష్ట్రంలో కూడా ఈ విధానాన్ని అమలు చేస్తే జగన్‌రెడ్డి వ్యతిరేకించగలరా? నేరస్తులకు అండగా నిలబడగలరా? ఇలాంటి చర్యల తర్వాత నేర స్వభావం ఉన్న వారి సంఖ్య తగ్గుముఖం పట్టదా? జగన్‌రెడ్డి పరిస్థితి కుడితిలో పడిన ఎలుకలా తయారవ్వదా? జగన్‌రెడ్డి మోడల్ రాజకీయాల నుంచి రాష్ట్రాన్ని బయటపడెయ్యడంతో పాటు యువతను సన్మార్గం వైపు నడిపించగల విప్లవాత్మక నిర్ణయాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టాలి. కేసులలో ఇరుక్కుంటే తమ పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు లభించవు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవు అన్న భయం కల్పించగలిగితే అందరూ దారిలోకి వస్తారు. లేని పక్షంలో జగన్‌రెడ్డి వంటి వారి అండ చూసుకొని ఇంటికో రౌడీ తయారవుతాడు. అదే జరిగితే రాష్ట్రం ఏమవుతుందో ఊహించగలమా?

అధికారమే ఆయన లక్ష్యం..

రాష్ట్రం పట్ల, సమాజం పట్ల జగన్‌రెడ్డికి ఏ బాధ్యతా ఉండదు. ఆయనకు కావాల్సింది అధికారం మాత్రమే. అధికారం అండతో రాష్ట్ర సంపదను దోచుకొని పొరుగున ఉన్న బెంగళూరు, చెన్నైతో పాటు దుబాయ్‌లో ఆస్తులు సమకూర్చుకోవడమే వారికి కావాల్సింది. ఇందుకోసం ఎంతకైనా తెగిస్తారు. రాష్ట్రంలో ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో తెలుగుదేశం, వైసీపీలకు చెరో 40 శాతం ఓట్లు ఉన్నాయి. 2019కి పూర్వం చంద్రబాబు ప్రభుత్వంపై ఎంతగా విష ప్రచారం చేసినా, ఎన్ని కులాలను దూరం చేసినా తెలుగుదేశం పార్టీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. జగన్‌రెడ్డి పాలన ఎంత అరాచకంగా సాగినా 2024లో ఆయనకు కూడా 40 శాతం ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో కూటమిలో మనస్పర్థలు సృష్టించే ప్రయత్నాలను కూడా జగన్‌రెడ్డి చేస్తున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే పరిస్థితులు ఎంత దారుణంగా ఉంటాయో తెలుసు కనుకే ఎవరు ఎన్ని కుట్రలకు పాల్పడినా కూటమి భాగస్వామ్య పక్షాలు అపోహలకు తావు లేకుండా జాగరూకతతో వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను అభినందించాలి. కింది స్థాయిలో కూటమి కార్యకర్తల మధ్య విభేదాలు ఉన్న మాట వాస్తవం. అయితే అవి రాష్ట్ర స్థాయిలో లేకపోవడం శుభ పరిణామం. మళ్లీ అధికారంలోకి వస్తే తన పరిపాలన ఎలా ఉంటుందో జగన్‌రెడ్డి చెబుతూనే ఉన్నారు. దీంతో సామాన్య ప్రజలతోపాటు కూటమి నాయకులు కూడా వణికిపోతున్నారు. వయసులో ఉన్నప్పుడు తెలిసో తెలియకో తప్పులు చేస్తారని జగన్‌రెడ్డి చెప్పడం ఆయన నైజానికి నిదర్శనం. ఆయన పిల్లలు కూడా చిన్న వయసులోనే ఉన్నారు. అలా అని వారు తప్పు చేస్తే జగన్‌రెడ్డి సహిస్తారా? దళితుల అవసరం తనకు ఉంది కనుక వారు మాత్రమే నేరాలు చేయాలి, శాశ్వతంగా తనపై ఆధారపడాలని జగన్‌రెడ్డి కోరుకుంటున్నారు. అందుకే రాష్ట్రంలో కుల, మతోన్మాదుల సంఖ్య పెరగాలని ఆయన కోరుకుంటున్నారు. ఇందుకోసం ఏం చేయడానికైనా, ఎంతకైనా తెగిస్తారు. జగన్‌రెడ్డి రాజకీయాన్ని విజ్ఞత ఉన్నవాళ్లు సమర్థించరు.

ఓట్ల కోసం...

గత ఎన్నికల్లో కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల తేడా 16 శాతం ఉండింది. కూటమి అధికారంలో ఉన్నందున ఈ తేడా క్రమంగా తగ్గే అవకాశం ఉంది. జగన్‌రెడ్డి నమ్మకం కూడా అదే. ఏడెనిమిది శాతం ఓట్లు పెంచుకోగలిగితే 2029లో అధికారం తమదేనని వైసీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, ఆ తర్వాత కూడా పులివెందుల రాజకీయాల వల్ల పలుమార్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగింది. అందుకు కారణమెవరని తెలుసుకొనే తీరిక, ఓపిక ప్రజలకు ఉండవు. అధికారంలో ఉన్న వారినే నిందిస్తారు. ఇప్పుడు మళ్లీ రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే కుట్రలకు తెర లేపే అవకాశం లేకపోలేదు. కుల విద్వేషాలను రగిలించడం వల్ల రాష్ట్రం వల్లకాడు అవుతుంది. అయినా రాష్ట్రం గురించి, పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించలేని స్థితికి ప్రజలను తీసుకువెళ్లడమే 'పులివెందుల మోడల్!' జగన్ హయాంలో లిక్కర్ అమ్మకాల్లో ఎంత గోల్‌మాల్ జరిగిందో, అందులో భాగస్వాములైన వారికే కాకుండా ప్రజలందరికీ తెలుసు. ఇప్పుడు ఈ కేసులో సిట్ అధికారులు పలువురిని జైలుకు పంపారు. అయినా, జగన్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వడానికి ఎవరికి వారు భయపడుతున్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి నుంచి ప్రాణహాని ఉంటుందని నిందితులు భయపడటం ఎక్కడైనా విన్నామా? కన్నామా? దటీజ్ జగన్‌రెడ్డి! హత్యలు చేయించడం, ఆ హత్యలు చేసిన వారిని ఆ తర్వాత తుదముట్టించడంలో ఆ కుటుంబం ఆరితేరింది. గతంలో ఏం జరిగిందో తెలుసు కనుకే జగన్‌కు వ్యతిరేకంగా ఒక్కరు కూడా నోరు విప్పలేకపోతున్నారు. వైసీపీ నాయకులలో కూడా ఈ భయం ఉంది. అందుకే ఎవరినైనా పక్కనబెట్టినా జగన్‌కు వ్యతిరేకంగా నోరు విప్పి విమర్శలు చేయలేకపోతున్నారు. ఈ వింత పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే సొంతం. గతంలో అనేక మంది తమ నాయకులతో విభేదించేవారు. ఇలా భయపడిన సంఘటనలు మాత్రం లేవు. నిందితులను మాత్రమే కాకుండా సొంత పార్టీ నాయకులను, చివరకు ప్రజలను కూడా భయపెట్టగలుగుతున్న జగన్‌రెడ్డిని ఎలా అర్థం చేసుకోవాలి? నేరస్తులకు రాజకీయాల్లో చోటు ఉండదని ఒకప్పుడు అనేవాళ్లు. ఇప్పుడు నేరస్తులే రాజకీయాలను శాసిస్తున్నారు. ఇదొక విషాదం!



▪ పి. చిదంబరం

ఆపరేషన్ సిందూర్‌లో చైనా పరోక్ష ప్రమేయంతో మౌలికంగా మారిపోయిన పరిస్థితుల్లో ఉగ్రవాదంపై పోరుకు మోదీ నిర్దేశించిన కొత్త సిద్ధాంతం ఉపయుక్తమైనదేనా? ఉగ్రవాదులు, వారికి మద్దతునిస్తున్న ప్రభుత్వాల మధ్య తేడా చూపం అనేది ఆ సిద్ధాంతంలోని ఒక ముఖ్య సూత్రం. దీని ప్రకారం ఉగ్రవాద ఘాతుకాలు చోటుచేసుకున్నప్పుడు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ యుద్ధానికి ఉపక్రమిస్తుంది. అయితే ఇది ఇంకెంత మాత్రం సాధ్యం కాదు. ఒకే ఒక శత్రువుగా ఏకమైన చైనా–పాకిస్థాన్ సంయుక్త సైనిక బలగాలతో తలపడవలసి ఉంటుంది.

చై-పాక్‌పై భారత్ భావి యుద్ధం?!

చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ గత నెల 31న సింగపూర్‌లో బ్లూమ్ బెర్గ్, రాయిటర్ వార్తాసంస్థలకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ సమయం, జరిగిన ప్రదేశం ఆశ్చర్యపరిచినా ఆయనేమీ ప్రమాదకరమైన పొరపాటు చేయలేదు. ఆపరేషన్ సిందూర్ గురించిన సత్యాలు ఏదో ఒక రోజు అధికారికంగా చెప్పవలసిందే కదా. అయితే పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రధానమంత్రి లేదా రక్షణమంత్రి ఆపరేషన్ సిందూర్‌పై ఒక ప్రకటన చేసి, చర్చను ప్రారంభించి ఉంటే మరింత సముచితంగా ఉండేదని నేను భావిస్తున్నాను.

భారత ప్రభుత్వ అత్యున్నతస్థాయి బాధ్యుల ఆదేశాలు, అనుమతి లేకుండా జనరల్ అనిల్ చౌహాన్ ఆ ఇంటర్వ్యూ ఇచ్చి ఉండరు. ఆయన చెప్పింది సూటిగా, స్పష్టంగా, సరళంగా ఉన్నది: భారత సైన్యం తన లక్ష్యాలను సాధించింది. అయితే నష్టాలనూ చవి చూసింది. మే 7న ఆపరేషన్ సిందూర్ ప్రారంభమయినప్పుడు భారత సైన్యం వ్యూహపరంగా చేసిన తప్పులను సీడీఎస్ అంగీకరించారు. అయితే వెన్వెంటనే తన తప్పులు సరిదిద్దుకుందని, మే 9–10 రాత్రి పాకిస్థాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని కొత్త దాడులు ప్రారంభించిందని ఆయన తెలిపారు. భారత్‌కు సంభవించిన నష్టాల గురించి ఆయన విపులీకరించలేదు. అయితే స్వతంత్ర సైనిక నిపుణులు, అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం భారత్ ఐదు యుద్ధ విమానాలను నష్టపోయింది: 3 రాఫెల్, 1 సుఖోయి, 1 మిగ్.

'వ్యూహాత్మక తప్పులు', 'నష్టాల'ను సైనిక నిపుణులు లోతుగా, నిగ్రహంగా విశ్లేషించవలసిన అవసరమున్నది. స్పష్టంగా తెలుస్తున్న, ధ్రువపరిచిన వాస్తవాలను పేర్కొంటాను: మే 7 తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైనప్పుడు భారత్‌కు కొన్ని అనుకూలతలు ఉన్నాయి. భారత యుద్ధ విమానాలు, మిస్సైళ్లు పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేశాయి; పాకిస్థాన్ మే 8న ప్రతిదాడులు ప్రారంభించింది. భారత్‌లోని లక్ష్యాలపై డ్రోన్ దాడులు నిర్వహించింది. గైడెడ్ మిస్సైల్స్‌ను కూడా మోహరించింది. మే 8న భారత వాయుసేన విమానాలు కూలిపోయాయి. జూన్ 4న పూణేలో సీడీఎస్ జనరల్ చౌహాన్ వ్యాఖ్యల ప్రకారం భారతీయ విమానాలకు భారత వాయుతలంలోనే నష్టం వాటిల్లింది. మే 8, 9న ఇతర విమానాలు తమ స్థావరాలకు తిరిగి రాగలిగాయి; వ్యూహాత్మక తప్పులు సరిదిద్దుకున్న తరువాత మే 9, 10 తేదీల్లో యుద్ధ విమానాలు, మిస్సైళ్లు, డ్రోన్‌లను నియోగించారు. భారత్ యుద్ధ విమానాలు భారత్ వాయుతలంలోనే ఉండి బ్రహ్మోస్ మిస్సైల్‌తో సహా పలు మిస్సైళ్లను ప్రయోగించాయి. అవి పాకిస్థాన్‌లోని 11 వాయుసేన స్థావరాలను ధ్వంసం చేశాయి. మే 10న యుద్ధం నిలిచిపోయింది.



ఆపరేషన్ సిందూర్‌తో తాను ఒక కొత్త యుద్ధ పరిస్థితిలో ఉన్నానన్న వాస్తవం భారత్‌కు తెలిసివచ్చింది. ఈ అంశాన్ని మరింత స్పష్టంగా చెప్పడానికే ఈ వ్యాసాన్ని ఉద్దేశించాను. పాకిస్థాన్ రక్షణ –దాడి (డిఫెన్స్–అఫెన్స్) వ్యూహంలో చైనీస్ యుద్ధ విమానాలు (జె–10), చైనీస్ మిస్సైళ్లు (పీఎల్–15), చైనీస్ వాయుతల రక్షణ వ్యవస్థలు పూర్తిస్థాయిలో పాల్గొన్నాయని ఇప్పుడు సందేహాతీతంగా ధ్రువపడింది. చైనీస్ యుద్ధ విమానాలలో పాకిస్థానీ పైలెట్‌లు ఉన్నారు. చైనీస్ మిస్సైళ్లను పాకిస్థానీ సైనికాధికారులు ప్రయోగించారు; చైనీస్ జనరల్స్ రూపొందించిన వ్యూహాత్మక ప్రణాళికలను పాకిస్థానీ సైనికాధికారులు అమలుపరిచారు. అంతేకాదు, చైనీస్ సైనిక ఉపగ్రహాలు, చైనీస్ కృత్రిమ మేధ (ఎఐ) పాటవం పాకిస్థాన్ సైనిక చర్యలకు మార్గదర్శకత్వం వహించాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే చైనా తన ఆయుధ వ్యవస్థల శక్తిసామర్థ్యాలను యుద్ధ రంగంలో పరీక్షించుకునేందుకు భారత్–పాకిస్థాన్ యుద్ధం ద్వారా లభించిన అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకుంది. భారత్‌కు వ్యతిరేకంగా చైనా పరోక్ష యుద్ధం చేసింది.

చైనా పరోక్ష ప్రమేయంతో మౌలికంగా మారిపోయిన పరిస్థితుల్లో ఉగ్రవాదంపై పోరుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన కొత్త సిద్ధాంతం ఉపయుక్తమైనదీ, కార్యసాధకమైనదేనా? ఉగ్రవాదులు, వారికి మద్దతునిస్తున్న ప్రభుత్వాల మధ్య తేడా చూపం అనేది మోదీ సిద్ధాంతంలోని ఒక ముఖ్య సూత్రం. దీని ప్రకారం ఉగ్రవాద ఘాతుకాలు చోటుచేసుకున్నప్పుడు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ యుద్ధానికి ఉపక్రమిస్తుంది. అయితే ఇది ఇంకెంత మాత్రం సాధ్యం కాదు. భారత్‌పై యుద్ధాన్ని బలవంతంగా రుద్దితే, ఒకే ఒక శత్రువుగా ఏకమైన పాకిస్థాన్, చైనాకు వ్యతిరేకంగా యుద్ధం చేయవలసి ఉంటుంది. పాకిస్థాన్–చైనాల సంయుక్త సైనిక బలగాలతో తలపడవలసి ఉంటుంది. ఒక యుద్ధ రంగంలోనో లేక రెండు యుద్ధరంగాలలో ఒకేసారి పోరాడే లక్ష్య ప్రాతిపదికన భారత్ యుద్ధ సన్నద్ధత కొత్త ప్రతికూల పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోగలుగుతుందా? భవిష్యత్తులో భారత్ చేయవలసివచ్చే ఏ యుద్ధమైనా చాలా పెద్ద, శక్తిమంతమైన ఈ సంయుక్త శత్రు సేనతో చేయవలసి వస్తుంది.

ప్రతి ఉగ్రవాద దాడికి దీటైన ప్రతిస్పందన ఉంటుందని మోదీ స్పష్టం చేశారు. ఉరి ఘటనకు ప్రతిస్పందనలో సరిహద్దులకు ఆవల భారత సైనికదళాల రహస్య దాడి, పఠాన్ కోట్ ఘటనకు ప్రతిస్పందనలో భారత వాయుసేన ఏకైక వైమానిక దాడి లాంటి చర్యలు ఇంకెంత మాత్రం ఉగ్రవాదాన్ని నిరోధించలేవు. కనుకనే పహల్గాంకు ప్రతిస్పందనగా నాలుగురోజుల యుద్ధం సంభవించింది. మరి ఇప్పటికీ ఉగ్రవాద దాడులు నిలిచిపోకపోతే? చై-పాక్ (చైనా-పాకిస్థాన్) సంయుక్త సైనిక బలగాలకు వ్యతిరేకంగా సుదీర్ఘ యుద్ధం అనివార్యమవుతుందా?

నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం ఈ కొత్త పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోలేదని రుజువయింది. భారత్ వ్యతిరేకిస్తున్నప్పటికీ ఐఎమ్ఎఫ్ మే 9న పాకిస్థాన్‌కు 100 కోట్ల డాలర్ల రుణం మంజూరు చేసింది. పాక్‌కు 800 మిలియన్ డాలర్ల రుణం ఇచ్చేందుకు ఈ నెల 3న ఏడీబీ ఆమోదించింది. రాబోయే పదేళ్లలో 40బిలియన్ డాలర్ల రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు నిర్ణయించింది. పాకిస్థాన్ ఆర్థిక సత్తువకు దోహదం చేసే ఈ నిర్ణయాల విషయంలో అమెరికా, చైనాల సంయుక్త ప్రోద్బలం ఉన్నది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తాలిబన్ శాంక్షన్స్ కమిటీ చైర్మన్‌గా, భద్రతామండలి కౌంటర్ టెర్రరిజం కమిటీ వైస్ చైర్మన్‌గా పాకిస్థాన్ ఎన్నికయింది! ఈ పరిణామాలన్నీ, ఆపరేషన్ సిందూర్ సమయంలోను, ఆ తరువాత, మన ఎంపీల బృందాలు దేశ దేశాల ప్రభుత్వాధినేతలకు పాక్ దుశ్చర్యలను ఏకరువు పెడుతున్నప్పుడు సంభవించినవే సుమా! నాకు అందిన విశ్వసనీయమైన సమాచారం మేరకు ప్రతి దేశమూ ఉగ్రవాదాన్ని ఖండించింది. అయితే ఏ దేశమూ పాకిస్థాన్‌ను గర్హించలేదు. మన సైనిక వ్యూహమూ, విదేశాంగ విధానంపై పునరాలోచన తప్పనిసరి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)







పారాగ్లైడింగ్ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర





పర్యాటకులకు పండగే

- మసులా బీచ్ ఫెస్టివల్ మూడోరోజూ అదే ఉత్సాహం
- పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్‌కు క్యూ కట్టిన జనం
- అలరించిన కెనోయింగ్, కయాకింగ్ క్రీడలు
- హోరాహోరీగా బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ, బీచ్ ఫుట్‌బాల్
- ఆకాశాన్నంటిన సాంస్కృతిక సంబరాలు

మంగినపూడి సముద్రతీరంలో జనకెరటం

మచిలీపట్నంలోని మంగినపూడి తీరం శనివారం జనసంద్రమైంది. మసులా బీచ్ ఫెస్టివల్ మూడో రోజూ అదే ఉత్సాహంతో సాగింది. పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్ అనుభూతి కోసం పర్యాటకులు క్యూ కట్టారు. మళ్లీ దొరికేనా ఇటువంటి అవకాశం అంటూ కేరింతలు కొడుతూ మైమరచిపోయారు. మంత్రి కొల్లు రవీంద్ర పారాగ్లైడింగ్ చేసి యువతను ఉత్సాహపరిచారు. ఎగసి పడుతున్న అలలపై కెనోయింగ్, కయాకింగ్ పోటీలు అలరించాయి. బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ, బీచ్ ఫుట్‌బాల్‌లో క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా తలపడ్డారు. డప్పు కళాకారుల విన్యాసాలు, శివతాండవం నృత్య రూపకం, కూచిపూడి నాట్య ప్రదర్శన కనులవిందుగా సాగాయి. 6

- మచిలీపట్నం/అవనిగడ్డ, ఆంధ్రజ్యోతి



తీరంలో పర్యాటకుల సందడి



భక్తితో బక్రీద్

బక్రీద్ పండుగను పురస్కరించుకుని శనివారం ముస్లిం ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈదుల్ అజ్ హ నమాజ్ నిర్వహించారు. పలువురు మత పెద్దలు పాల్గొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లింలు ఈ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. - లబ్బీపేట

దశాబ్దాల ప్రతిష్ఠను కూల్చేశారు..!

ఒకరిది స్వార్థం.. మరొకరిది అత్యాశ.. ఇంకొకరిది అవివేకం.. ఇంతమంది ఆడిన డబ్బులాటలో 55 ఏళ్లుగా ఎంతోమంది పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి, వారి ఉన్నతికి బాటలు వేసిన శాతవాహన కళాశాల నేలమట్టమైంది. ఈ కళాశాల స్థలాన్ని ఎలాగైనా కాజేయాలన్న కుతంత్రాలతో ఎంతో పేరున్న విద్యాశిఖరాన్ని నామరూపాల్లేకుండా శిథిలం చేశారు. తాతల నాటి స్థలం కన్నేసి కొట్టేయాలనుకున్నది ఒకరైతే, అసలు మనుగడే లేకుండా చేసేందుకు శ్రీదుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీలోని కొందరు పావులు కదిపారు. వీరంతా కలిసి ఆడిన ఆటలో శాతవాహన కనీసం కంటికి కూడా కనిపించకుండాపోయింది.

'శాతవాహన' కూల్చివేతలో దుష్టగ్రహాలెన్నో..

స్వార్థపు ఆటకు బలైన సరస్వతీ నిలయం

- 'బోయపాటి'ని నడిపిస్తున్న 'కృష్ణ'లీల ఏంటి?
- వివాదం కోర్టులో ఉండగానే 'డెవలప్‌మెంట్' దొంగాట
- కూల్చివేతకు సరేనన్న ప్రిన్సిపాల్, కరస్పాండెంట్
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రమేయమేంటి?
- వివాదాలకు ఆజ్యంపోస్తున్న 'వంకాయలపాటి'
- డి అడ్రస్‌మాల్‌లో డీల్స్.. కిడ్నాప్ డ్రామాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : శాతవాహన కళాశాల భవనాలను బోయపాటి శ్రీనివాస అప్పారావు, ధూళిపూడి శ్రీకాంత్ నేలమట్టం చేయడానికి ముందు విజయవాడ కేంద్రంగా కిడ్నాప్ కథ నడిచింది. కళాశాల ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్ తనను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వ్యక్తిగత సహాయకుడు, మరికొంతమంది కిడ్నాప్ చేశారని హంగామా చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారు తన ఇంటి ముందు రెక్కీ నిర్వహించారని శ్రీనివాస్ కుమారుడు సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడు. ఎంజీ రోడ్డులో ఉన్న డి అడ్రస్‌మాల్‌కు వెళ్లి బయటకు వస్తున్నప్పుడు ఆలపాటి మనుషులు కిడ్నాప్ చేసి గుంటూరుకు తరలించారని, తన సెల్‌ఫోన్ లాక్కుని వారికి కావాల్సిన కాగితాలపై సంతకాలు చేయించుకున్నారని వంకాయలపాటి శ్రీనివాస్ ఆరోపించారు. తనకు మిగతా 6లో..



శాతవాహన కళాశాల శిథిలాలు

'శాతవాహన' వద్ద ఉద్రిక్తత

- ఆందోళనకు దిగిన వామపక్షాలు 6లో



వివాదాలకు ఆజ్యం ఇలా..

శాతవాహన కళాశాల ఉన్న భూమి తమకు అగ్రిమెంట్ చేశారని, రిజిస్ట్రేషన్‌కు బోయపాటి అప్పారావు ముందుకు రావట్లేదని శ్రీదుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ కోర్టును ఆశ్రయించింది. ఈ వివాదం ఏళ్ల తరబడి నడుస్తూనే ఉంది. 2009వ సంవత్సరంలో సొసైటీ కార్యదర్శిగా, కళాశాల కరస్పాండెంట్‌గా తాత్కాలిక బాధ్యతలు చేపట్టిన వంకాయలపాటి కామేశ్వరరావు ఈ వివాదాలకు ఆజ్యం పోశారు. అప్పటి వరకు ఒకటిగా ఉన్న సొసైటీలో చీలికలు తీసుకొచ్చారు. సొసైటీ కార్యదర్శి, కళాశాల కరస్పాండెంట్‌గా ఉన్న గుండవరపు ప్రజాపతిరావు అమెరికా వెళ్తూ ఆ బాధ్యతలు తాత్కాలికంగా కామేశ్వరరావుకు అప్పగించారు. సమాచార శాఖలో ఉద్యోగిగా ఉన్న కామేశ్వరరావుకు ఊహించని పదవులు రావడంతో అత్యాశలకు పోయాడు. ప్రజాపతిరావు లేని సమయం చూసుకుని కళాశాలకు ఏమాత్రం సంబంధం లేని ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు గేట్లు తెరిచారు. ఆయన రంగప్రవేశం చేశాక సొసైటీలో వివాదాలు పెరిగిపోయాయి. కామేశ్వరరావును అడ్డుపెట్టుకుని ఆయన కుమారుడు వంకాయలపాటి శ్రీనివాస్ తెరవెనుక వ్యవహారాలను చక్కబెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి.

అయ్యో ఆంజనేయా..!

వత్సవాయి మండలం భీమవరంలో స్వామి భూమి హాంఫట్

- గుటకాయస్వాహా చేసిన ఆలయ అర్చకులు
- చర్యలు తీసుకోవాలని భక్తుల వేడుకోలు

వన్‌టౌన్/వత్సవాయి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నందిగామ నియోజకవర్గంలోని వత్సవాయి మండలం భీమవరం గ్రామంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన భూములను అర్చకులు గుట్టుచప్పుడు కాకుండా మింగేశారు. వివరాల్లోకి వెళితే.. భీమవరం గ్రామానికి చెందిన భక్తుడు మార లక్ష్మీనరుసు కుమారుడు రామనరుసు 1934, ఆగస్టులో స్థిరాస్తి దానపత్రిక ద్వారా భీమవరంలో దేవదాయ శాఖ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయానికి ఎకరం, తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా కోదాడ మండలం తమ్మర గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి మరో ఎకరం.. నైవేద్య దీపారాధనల నిమిత్తం అందజేశారు. అలాగే, తన, తన వారసుల గోత్రనామాలతో సహస్రనామ పూజ జరిపేందుకు భీమవరం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆర్‌ఎస్ నెంబర్ 362/1లో రెండెకరాల శేరి మెరక భూమిని నాటి అర్చకుడైన వేదాంతం రామానుజాచారి కుమారుడు శేషాచార్యులకు స్వాధీనపరిచారు. కొంతకాలం శేషాచార్యులు దాత ఆశయాలను నిర్వహించారు. కానీ, శేషాచార్యుల సంతానంలో ఒకరు ఆ భూమిపై కన్నేశాడు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా భూమిని విక్రయించటానికి ప్రణాళిక వేశాడు. ప్రస్తుతం వేద్రాద్రి దేవస్థానంలో అర్చకులుగా పనిచేస్తున్న ఆయన బంధువుతో పాటు భూమి ఇచ్చిన దాత బంధువులైన ఒకరు కలిసి రెండు ఎకరాల భూమిని విక్రయించేందుకు లోపాయికారీగా ఒప్పందానికి వచ్చారు. 2011, మే 12వ తేదీన అదే గ్రామానికి చెందిన యలకరాజుల గోపి ఈ భూమిని కొన్నాడు. స్వామివార్ల భూములు అమ్ముకున్నారన్న సమాచారం తెలుసుకున్న మిగతా 6లో..



భీమవరంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయం



ఆగ్రహజ్వాలలు

రాజధాని అమరావతి మహిళలపై జగన్ పత్రికలో చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై జిల్లావ్యాప్తంగా శనివారం నిరసనలు మిన్నంటాయి. పలుచోట్ల టీడీపీ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి. గొల్లపూడి వన్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట శనివారం రాత్రి జగన్ పత్రిక దిష్టిబొమ్మను దహనం చేశారు. 8

పాఠశాలలకు సన్నబియ్యం

మధ్యాహ్న భోజనం పథకం నిమిత్తమే..

- డీలర్లతో సంబంధం లేకుండా నేరుగా స్కూళ్లకు..
- ప్రత్యేక బ్యాగులో క్యూఆర్, బార్ కోడ్‌తో బస్తాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మధ్యాహ్న భోజనం పథకం కోసం నాణ్యమైన సన్నబియ్యం అందుబాటులోకి వచ్చింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పాఠశాలలకు పంపిణీ చేసేందుకు ఈ సన్నబియ్యం బస్తాలు ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరుకున్నాయి. ఈ బియ్యం బ్యాగులకు ఒక ప్లాస్టిక్ ట్యాగ్ కూడా ఉంది. ఈ ట్యాగ్ పైవరసలో క్యూఆర్ కోడ్ ఉంటుంది. కింది వరసలో బార్ కోడ్ ఉంది. గతంలో డీలర్లకు ఇవి నేరుగా పంపిణీ అయ్యేవి. డీలర్ల దగ్గర నుంచి పాఠశాలలకు వెళ్లేవి. ప్రస్తుతం డీలర్ల దగ్గరకు వెళ్లే పరిస్థితి లేకుండా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి నేరుగా స్కూళ్లకు దిగుమతి అవుతాయి. పాఠశాలలకు వెళ్లాక బార్ కోడ్ వివరాలను నోట్ చేసుకుంటారు. ప్రధానోపాధ్యాయుడు బయోమెట్రిక్ వేస్తేనే బియ్యం దిగుమతి చేసినట్టు నిర్ధారణ అవుతుంది. సన్నబియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు వీలుగా ప్యాకింగ్, ట్యాగింగ్, బార్‌కోడింగ్, క్యూఆర్ కోడ్, బయోమెట్రిక్ వంటి విధానాలను ప్రభుత్వం తీసుకొచ్చింది. గొల్లపూడి మార్కెట్ యార్డులోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో దిగుమతి అయిన మధ్యాహ్న భోజన పథకం బ్యాగులను జాయింట్ కలెక్టర్ ఇలక్కియా పరిశీలించారు.



బియ్యం బస్తాలు తనిఖీ చేస్తున్న జేసీ

ఇంటర్ సప్లిమెంటరీలో సగంమంది ఫెయిల్

కృష్ణాజిల్లాలో 60, ఎన్టీఆర్‌లో 48 శాతం ఉత్తీర్ణత

విజయవాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల్లో సగంమంది విద్యార్థులు ఫెయిలయ్యారు. కృష్ణాజిల్లాలో 60, ఎన్టీఆర్ జిల్లాలో 48 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కృష్ణాజిల్లా నుంచి మొదటి సంవత్సర పరీక్షకు 2,968 మంది హాజరుకాగా, 1,477 మంది ఉత్తీర్ణులయ్యారు. 51 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సర పరీక్షకు 1,832 మంది హాజరుకాగా, 1,095 మంది ఉత్తీర్ణలయ్యారు. ఉత్తీర్ణతా శాతం 60గా నమోదైంది. ఎన్టీఆర్ జిల్లాలో మొదటి సంవత్సరం పరీక్షకు 6,617 మంది హాజరుకాగా, 3,044 మంది ఉత్తీర్ణులయ్యారు. 46 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 4,676 మంది హాజరుకాగా, 2,233 మంది ఉత్తీర్ణులయ్యారు. 48 శాతం ఉత్తీర్ణత నమోదైంది.



నల్లూరి కల్యాణమండపం దేవదాయ శాఖ స్వాధీనం

- స్వామి ఆభరణాలు కూడా..
- ఆలయం ఇది వరకే స్వాధీనం
- హైకోర్టు తీర్పు వస్తే ఎస్ఎస్ఎం స్కూల్ కూడా..

8

యోగాభ్యాసంతో మానసిక వికాసం

- కలెక్టర్ జి.లక్ష్మీశ



8

ఎన్టీటీపీఎస్‌ను సందర్శించిన ఏపీఎస్‌పీఎఫ్ డీజీ

8

అమరావతిని కార్పొరేట్ రాజధానిగా మార్చొద్దు

- రాజధానిపై జరిగిన సదస్సులో వక్తలు

మంగినపూడి బీచ్‌లో పర్యాటకుల కేరింతలతో మసులా బీచ్ ఫెస్టివల్ మూడో రోజు శనివారం సందడిగా సాగింది. ఫెస్టివల్‌కు లక్షలాదిగా పర్యాటకులు తరలివచ్చారు. స్టాళ్లను సందర్శిస్తూ, క్రీడలను తిలకిస్తూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



సముద్రంలో బోట్ రైడింగ్ చేస్తున్న పర్యాటకులు



సందడే.. సందడి!

మసులా బీచ్ ఫెస్టివల్‌కు మూడో రోజు లక్షలాదిగా తరలివచ్చిన పర్యాటకులు



గుర్రపుస్వారీ, మోటార్ జీప్ రైడింగ్ చేస్తున్న చిన్నారులు





సీ కయాకింగ్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు



యాంకరింగ్ చేస్తున్న సామ్యూరావు



పర్యాటకులకు దర్శనమిచ్చేలా పాండురంగస్వామి ప్రతిమ

మసూల బీచ్ ఫెస్టివల్‌లో నిలువెత్తు పాండురంగస్వామి ప్రతిమను ఏర్పాటు చేశారు. గేట్ వే ఆఫ్ అమరావతి నమూనాలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, పర్యాటకులు తిరిగి వెళ్లే సమయంలో స్వామి వారికి దర్శనం ఇస్తున్నారు.



కయాకింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, శాప్ చైర్మన్ రవినాయుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

మంగినపూడి బీచ్‌లో రూ.1,500 కోట్లతో రిసార్టులు

- నిర్మించేందుకు ముందుకొస్తున్న కార్పొరేట్ సంస్థలు
- బీచ్‌కు జాతీయస్థాయిలో పేరు, ప్రఖ్యాతులు తెచ్చేందుకు కృషి: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): 'బందరు పోర్టు పూర్తయితే మంగినపూడి బీచ్‌లో రూ.1500 కోట్లతో రిసార్టులు నిర్మిస్తామంటూ కార్పొరేట్ సంస్థలు ముందుకొస్తున్నాయి. జాతీయస్థాయి క్రీడల పోటీల నిర్వహణతో మంగినపూడి బీచ్ అందరి దృష్టిని ఆకర్షించింది. బీచ్‌కు జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు తెచ్చేందుకు కృషి చేస్తా.' అని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగినపూడి బీచ్‌లో శనివారం నిర్వహిస్తున్న సీ కయాగింగ్, నేషనల్ లెవల్ వాలీబాల్, బీచ్ ఫుట్‌బాల్ పోటీలను శాప్ చైర్మన్ రవి నాయుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావులతో కలిసి ఆయన సందర్శించారు. ఫెస్టివల్‌లో మంత్రి కొల్లు రవీంద్ర పారాగ్లైడింగ్ చేశారు. ప్రముఖ క్రీడాకారుడు జయప్రసాద్‌ను అభినందించారు. కయాకింగ్ అసోసియేషన్ ప్రతినిధులు తెచ్చిన చేతి సంచులను, టీషర్టులను ఆవిష్కరించారు. ఉత్సవాలు దేశమంతటా మార్మోగుతున్నాయని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని టూరిజం, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అన్నారు.



చిలకలపూడి రైల్వే స్టేషన్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రులు

మచిలీపట్నం టౌన్, కృత్తివెన్ను: మసులా బీచ్ ఫెస్టివల్స్‌కు శనివారం రాత్రి విచ్చేసిన మంత్రులు నారాయణ, కేపీ సారథి ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ఈ విషయాన్ని మంత్రి నారాయణ విలేకరులకు తెలిపారు. మచిలీపట్నం నుంచి బీచ్ వద్దకు వచ్చేందుకు ఎస్పీ సాయంతో కాన్వాయ్‌తో వచ్చినా రెండు గంటలు పైనే పట్టిందని మంత్రి నారాయణ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా లక్షలాదిగా పర్యాటకులు తరలి రావటంతో నియంత్రణ కష్టమైంది. చిలకలపూడి రైల్వే గేటు నుంచి బీచ్ వరకు వేలాది వాహనాలు గంటల కొలదీ నిలిచిపోయాయి. మూడోరోజున దాదాపు నాలుగు లక్షల మంది యాత్రికులు, పర్యాటకులు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చారు. ఆర్టీసీ బస్సులతో పాటు కార్లు, ఆటోలు, టూరిస్టు బస్సులు వచ్చాయి. పోలీసులు కేటాయించిన రూట్‌మ్యాప్ ద్వారా కాకుండా యాత్రికులు నేరుగా బీచ్‌కు వచ్చి, వెళ్లడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 500 మంది పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం పనిచేసినప్పటికీ నియంత్రణ కష్టతరమైంది. వీఐపీలు, కళాకారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందిపడ్డారు. గట్టి బందోబస్తు నిర్వహించాలని పోలీసులను ఎస్పీ ఆర్. గంగాధరరావు ఆదేశించారు. ఆయన ట్రాఫిక్‌ను పరిశీలించారు.

కయాకింగ్ ఫైనల్స్‌కు చేరుకున్న రాష్ట్ర క్రీడాకారులు వీరే..

మచిలీపట్నం టౌన్: కయాకింగ్ 500 మీటర్ల పురుషుల విభాగంలో జి.భాస్కర్(ఏలూరు జిల్లా), ఎస్.రాజేష్ (కృష్ణాజిల్లా), బి.రాజు(విశాఖ), యు.సతీష్(విశాఖజిల్లా) రాష్ట్రం నుంచి ఫైనల్స్‌కు చేరుకున్నారు. 500 మీటర్ల మాస్టర్ విభాగంలో 12 మంది ఫైనల్స్‌కు చేరుకోగా రాష్ట్రానికి చెందిన డి.దేవదాస్ (నంద్యాల), పి.కనకయ్య (ఎన్టీఆర్), ఎం.రాజేష్(ఏలూరు) ఉన్నారు. అండర్-18 కయాకింగ్ 500 మీటర్ల విభాగంలో 12 మంది చేరుకోగా రాష్ట్రానికి చెందిన అభిలాష్ విఘ్నేష్, జి.గణేష్, టి.జాన్‌వెస్లీ, కె.ఈశ్వర్, కె.రోహిత్ సాయిమనోజ్, ఎల్.దివేశ్వర్, ఎం.ఈశ్వర్‌ఉన్నారు.

పార్కింగ్‌లన్నీ ఫుల్

వాహనాలు భారీ సంఖ్యలో రావటంతో వాటిని పార్క్ చేసేందుకు పార్కింగ్‌లు ఫుల్ అయ్యాయి. మరికొన్ని పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేసి, వాహనాల కోసం కేటాయిస్తున్నారు.

హోటళ్లు కిటకిట

బందరులోని అన్ని హోటల్ గదులు నిండిపోయాయి. కిటకిటలాడుతున్న హోటళ్లలో రూమ్‌లు దొరక్క, పర్యాటకులు విజయవాడ, భీమవరం, గుడివాడ పట్టణాలను ఆశ్రయిస్తున్నారు.

వెలిగిపోతున్న బీచ్

సముద్ర తీరంలో ప్రత్యేక ఎల్ఈడీ బల్బ్‌లతో వివిధ ఆకారాలు, ఆకృతుల్లో విద్యుత్ దీపాలతో బీచ్ వెలిగిపోతోంది.



పర్యాటకులతో కళకళలాడుతున్న బీచ్ పరిసరాలు



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకులు

ఉర్రూతలూగించిన సినీ సంగీత విభావరి

ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాయి కార్తీక్, ప్రవీణ్ సినీ గాయని శ్రుతిగాయత్రి సినిమాపాటలతో యువతను ఉర్రూతలూగించారు. వేదికపై కళాకారుల నృత్యాలకు యువకులు స్టెప్పులు కలిపి కేరింతలు కొట్టారు.

ఆకట్టుకున్న కలంకారీ, పాండురంగడి ద్వారాలు



కలంకారీ ద్వారం నుంచి లోపలికి వెళుతున్న పర్యాటకులు

అవనిగడ్డ: బీచ్ ఫెస్ట్‌కు చేరుకునేందుకు వచ్చే మార్గంలో పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన పాండురంగడిద్వారం(ఐకానిక్ గేట్), కలంకారీ ద్వారాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెడన కలంకారీ వైభవాన్ని ప్రతిబింబించేలా ఐకానిక్ గేటు దగ్గర నుంచి ప్రధాన వేదిక వరకు దారిపొడవునా కలంకారీ వస్త్రాలతో ద్వారాలను, సైడ్ వాల్స్ ఏర్పాటు చేశారు. చిలకలపూడిలోని పాండురంగ స్వామి ఆలయమూర్తి నమూనాను ఐకానిక్ గేటు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేయగా, పలువురు నమూనా స్వామిని దర్శించుకున్నారు. ఐకానిక్ గేటు దగ్గర నుంచి ప్రధాన వీధుల వరకు రహదారి పొడవునా మత్స్యకారుల జీవన పోరాటం విశదీకరించేలా పడవల్లో వారు చేసే సాహసాలతో కూడిన ప్రతిమను తయారు చేసి ప్రదర్శనగా ఉంచారు. వాటి వద్ద సెల్ఫీలు దిగేందుకు చిన్నారులు, యువత పోటీపడ్డారు.



ప్యారా రైడ్ చేస్తున్న మంత్రులు పి.నారాయణ, కేపీ సారథి

బీచ్‌లో మంత్రుల ప్యారారైడ్

మచిలీపట్నం (కృత్తివెన్ను) జూన్ 7(ఆంధ్రజ్యోతి): మసులా బీచ్ ఫెస్టివల్‌కు విచ్చేసిన మంత్రులు పి.నారాయణ, కేపీ సారథి ప్యారారైడ్ చేశారు. వారిని మంత్రి కొల్లు రవీంద్ర దగ్గరుండి ప్యారా రైడ్ ఎక్కించారు. ఒకరి తరువాత ఒకరు గాల్లో చక్కర్లు కొట్టారు. ప్యారా రైడ్ మంచి అనుభూతిని ఇచ్చిందని, మచిలీపట్నంను, బీచ్‌ను కొత్త కోణంలో చూశామని, ప్రేక్షకుల వినోదం కోసం ఏర్పాటు చేసిన అన్ని కార్యక్రమాలు ఎంతో ఆహ్లాదంగా ఉన్నాయని, పర్యాటకులు పాల్గొని, అమితానందాన్ని పొందాలని మంత్రులు సూచించారు.



జస్టిస్ టి.మల్లికార్జునరావుకు వేద ఆశీర్వచనాలు అందజేస్తున్న అలయ అర్చకులు

మంటాడ వేంకటేశ్వరస్వామి సేవలో జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు

పమిడిముక్కల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మంటాడలో అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు శనివారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి దంపతులు, వారితో ఉన్న ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరికి ఆలయ అధికారి మాధవీలత స్వాగతం పలికారు. దర్శనమయ్యాక ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఉయ్యూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపిచంద్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష రేపు

చల్లపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో 6, 7 తరగతుల్లో స్థానిక విద్యార్థుల ప్రవేశానికి సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు 6, 7 తరగతుల్లో డేస్కాలర్‌గా ఉచిత విద్యను అందిస్తామని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఎన్టీఆర్ స్కూల్‌లో ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని ఆమె సూచించారు. ట్రస్ట్ సీఈవో కె.రాజేంద్రకుమార్(విశ్రాంత ఐపీఎస్) పర్యవేక్షణలో పరీక్షకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశారు.

దశాబ్దాల ప్రతిష్ఠను కూల్చేశారు..!

(5వ పేజీ తరువాయి)

ప్రాణహాని ఉందని, ఆలపాటి రాజేంద్రప్రసాద్, అతని అనుచరులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు. ఆ తర్వాత కిడ్నాప్‌పై ఆయన ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఆ తర్వాత మౌనంగా ఉండిపోయారు. వాస్తవానికి సుప్రీంకోర్టులో జరిగే పరిణామాల గురించి ఈ ముఠాకు ముందే సమాచారం ఉంది. దీనికి సంబంధించిన డీల్‌ను సెట్ చేసుకోవడానికి శ్రీనివాస్ కొద్దిరోజుల క్రితం డి అడ్రస్‌మాల్‌లో ఉన్న శ్రీకాంత్ వద్దకు వెళ్లినట్టు తెలుస్తోంది.

'డెవలప్‌మెంట్' మాయ

ఎంజీ రోడ్డులో ఉన్న డి అడ్రస్‌మాల్ అధినేత ధూళిపూడి శ్రీకాంత్ శాతవాహన ప్రాంగణంలోకి అడుగుపెట్టడానికి చాలా తెలివిగా వ్యవహరించాడు. శాతవాహన భూములకు సంబంధించి సుప్రీంకోర్టులో తీర్పు రాకుండానే ఆ భూములు తనవేనని చెప్పుకొంటున్న బోయపాటి శ్రీనివాస అప్పారావుతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ఏ డెవలపర్ అయినా ఎలాంటి వివాదాలు లేని భూములపై ఒప్పందాలు చేసుకుంటారు. అటువంటిది శ్రీకాంత్ కోర్టు వివాదాల్లో నలుగుతున్న శాతవాహన భూములను డెవలప్ చేయడానికి ఎందుకు ఆసక్తితో అడుగులు వేశారన్నది అనుమానమే. శాతవాహన కళాశాలలోకి ఎక్స్‌కవేటర్లను తీసుకెళ్లిన రోజున బోయపాటి శ్రీనివాస అప్పారావుతో పాటు శ్రీకాంత్ కూడా ఉన్నట్టు పోలీసులు నిర్ధారించారు. ఓ థియేటర్‌లో భాగస్వామిగా ఉన్న 'కృష్ణ'లీల ఈ కథంతా నడిపిస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. కాగా, కళాశాలను కూల్చుకోవచ్చని కరస్పాండెంట్ రమాసత్యనారాయణ, ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్ రాతపూర్వకంగా అనుమతి ఇచ్చారని కూడా పోలీసులు నిర్ధారించారు.

ఆలపాటి ప్రమేయమేంటి..?

శాతవాహన కళాశాల, శ్రీదుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీతో అసలు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సంబంధం ఉందా? అనే ప్రశ్న వ్యక్తమవుతోంది. బోయపాటి శ్రీనివాస అప్పారావు, ధూళిపూడి శ్రీకాంత్, వంకాయలపాటి శ్రీనివాస్, ప్రస్తుత కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణపై పోలీసులకు ఆయన ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీకి కార్యదర్శి హోదాలో ఈ ఫిర్యాదు చేశారు. ఆలపాటికి సొసైటీలో కానీ, కళాశాలలో కానీ ఎలాంటి పదవులు లేవని కొంతమంది చెబుతున్నారు. ప్రస్తుతం శాతవాహన కళాశాల కరస్పాండెంట్‌గా నిడుమోలు రమాసత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. కరస్పాండెంట్‌గా ఉన్నవారే సొసైటీ కార్యదర్శిగా వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయి. దాని ప్రకారం తానే కార్యదర్శి, కరస్పాండెంట్ హోదాలో ఉన్నానని రమాసత్యనారాయణ చెబుతున్నారు. ఇదివరకు ఈ కార్యదర్శి పదవి విషయంలో ఆలపాటికి ఎదురుదెబ్బ తగిలినట్టు తెలుస్తోంది. స్థానికత లేనందున ఆలపాటి సొసైటీ కార్యదర్శి, కళాశాల కరస్పాండెంట్ పదవులను చేపట్టడానికి అర్హత లేదని అప్పటి కలెక్టర్ రిజ్వీ ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఇదంతా ఇలా ఉంటే.. శాతవాహన కళాశాల భవనం కూల్చివేత నేపథ్యంలో కార్యదర్శి హోదాలో పోలీసులకు ఫిర్యాదు చేయటం కొసమెరుపు.

ఒకవేళ కార్యదర్శి హోదాలో ఆలపాటి కొనసాగితే కూల్చివేతలు జరిగిన ప్రదేశానికి ఆయన ఎందుకు రాలేదన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. గతంలో శాతవాహన స్థలాన్ని సొసైటీ ముసుగులో చేజిక్కించుకునే ప్రయత్నం చేశారన్న అనేక ఆరోపణలు కూడా ఆలపాటిపై ఉన్నాయి.

అయ్యో ఆంజనేయా..!

(5వ పేజీ తరువాయి)

స్థానికులు దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నాటి ఉమ్మడి కృష్ణాజిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ దుర్గాప్రసాద్ స్పందించి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని సబ్‌రిజిస్ట్రార్‌కు నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసుల ద్వారా దాత బంధువు ఒకరు 2012లో కోర్టులో కేసు వేశారు. కోర్టులో కేసు నడుస్తుండగా 2024లో ఆయన చనిపోయాడు. దేవదాయ శాఖ అధికారులు కౌంటర్ వేయకపోవటంతో కోర్టు కేసును క్లోజ్ చేసింది. దేవదాయ శాఖ అధికారులు మాత్రం భూములు విక్రయించిన అర్చకులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరోపక్క ఈ విషయంపై జగ్గయ్యపేటకు చెందిన ఓ భక్తుడు లోకాయుక్తలో పిటిషన్ దాఖలు చేశాడు. స్పందించిన లోకాయుక్త దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ శాఖ మంత్రి స్పందించి భూములను విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని, తిరిగి ఆ భూములను దేవస్థానాలకు అప్పగించాలని భక్తులు కోరుతున్నారు. కాగా ఈ ఆలయానికి మొదటి నుంచి ఈవో కానీ, మేనేజర్ కానీ లేదు. భూములు విక్రయించిన తరువాత అధికారులే ఈవోను నియమించటం గమనార్హం.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

భీమవరంలోని ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన భూమిని అర్చకులు దాత బంధువుతో కలిసి విక్రయించిన వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

- నటరాజన్ షణ్ముగం, ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అధికారి

శాతవాహన వద్ద ఉద్రిక్తత

- ఆందోళనకు దిగిన వామపక్షాలు
- 'బోయపాటి' పేరును చింపేసిన ఆందోళనకారులు
- గేట్లు దాటి కళాశాల ప్రాంగణంలోకి వెళ్లేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- కళాశాలను పరిశీలించిన ఎమ్మెల్యే బొండా ఉమా
- గేట్లపై రాసిన పేర్లకు పెయింట్ వేసిన కార్యకర్తలు
- కొనసాగుతున్న పోలీసు పహారా



బోర్డులను తొలగిస్తున్న ఆందోళనకారులు

విజయవాడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): విశాలాంధ్ర రోడ్డులో ఉన్న శాతవాహన కళాశాల వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. కళాశాల ప్రాంగణంలోని భవనాలను బోయపాటి శ్రీనివాస అప్పారావు, ధూళిపూడి శ్రీకాంత్‌లు కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని అర్ధరాత్రి అక్రమంగా లోపలికి ప్రవేశించి నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుండడంతో సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కళాశాల వద్దకు సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు శనివారం భారీగా చేరుకున్నారు. గేట్లు ఎక్కి లోపలకు వెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీ సంఖ్యలో శాతవాహన వద్దకు చేరుకున్నారు. కార్యకర్తలు గేట్లు ఎక్కి ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. భవనాలను కూల్చివేసిన తర్వాత బోయపాటి శ్రీనివాస అప్పారావు మొత్తం స్థలం తనకే చెందుతుందని, లోక్‌అదాలత్ నంబరు1890/2011, సుప్రీంకోర్టులో దాఖలైన ఎస్ఎల్పీ నంబర్లను ఫ్లెక్సీ ముద్రించాడు. అక్రమించిన వారు శిక్షార్హులని దానిపై రాయించి పెద్ద బోర్డును ఏర్పాటు చేశారు. దీన్ని సీపీఎం కార్యకర్తలు చింపేశారు. పోలీసులు అడ్డుకున్నప్పటికీ తోసుకుని మరీ ప్రహరీ ఎక్కారు. కళాశాల ఎదుట ధర్నా చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కళాశాల పరిస్థితిని పరిశీలించారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గేట్లపై నీలం రంగుతో ఈ స్థలం బోయపాటి శ్రీనివాస అప్పారావు చెందినదని రాసిన రాతలపై తెలుపు రంగు పూశారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉండడంతో పోలీసులు పికెటింగ్ నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ పెద్దల అండతోనే కబ్జా

విజయవాడలో అర్ధరాత్రి బుల్డోజర్‌లతో వచ్చి కళాశాల భవనాలను కూల్చిన చరిత్ర ఇప్పటి వరకు ఏనాడు చూడలేదు. కాలేజీని కబ్జాదారులు కోర్టు తీర్పుల పేరుతో అడ్డగోలుగా కబ్జా చేస్తుంటే ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చుంది. ప్రభుత్వ పెద్దల అండతోనే కబ్జాకోరులు రెచ్చిపోయారు. రూ.కోట్ల విలువైన శాతవాహన ఆస్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అంతా కలిసి నాటకం ఆడుతున్నారు. టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై ఆరోపణ వస్తే యంత్రాంగం ఏం చేస్తోంది? ఇప్పుడు మరొకరు అర్ధరాత్రి భవనాలను కూల్చేశారు. విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు, విద్యాబోధన చేస్తున్న అధ్యాపకుల భవిష్యత్ ఏమిటి? వాళ్లే కోర్టుల్లో కేసులు వేసి, వాళ్లే ఫిర్యాదులు చేసుకుని కుమ్మక్కైపోయారు. ఇందులో ఎమ్మెల్సీ ఆలపాటి ఒక భాగస్వామి. మంత్రి లోకేశ్ శాతవాహన విషయంలో ఎందుకు స్పందించలేదు?. - సీహెచ్‌బాబూరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

తప్పుడు అఫిడవిట్‌తో కబ్జా చేశారు

శాతవాహన కళాశాలకు 55 ఏళ్ల చరిత్ర ఉంది. 1969 నుంచి కళాశాలకు చెందిన స్థలంపై వివాదం నడుస్తోంది. దీనిలో 1.66 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కళాశాలకు అనుకూలంగా గతంలో హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి నుంచి తప్పుడు అఫిడవిట్ తీసుకుని ధూళిపూడి శ్రీకాంత్ రౌడీలతో వచ్చి వాచ్‌మన్‌పై దాడి చేసి భవనాలను ధ్వంసం చేశాడు. కళాశాలకు సెలవులు ఉన్న రోజుల్లో ఇటువంటి అకృత్యాలు చేయడంతో విద్యార్థులకు అందించాల్సిన టీసీలు, సర్టిఫికెట్లు, ముఖ్యమైన వస్తువులు, పుస్తకాలు పాడుచేశారు. ఇది సరైన చర్య కాదు.

-బొండా ఉమామహేశ్వరరావు, సెంట్రల్ ఎమ్మెల్యే

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

శాతవాహన కళాశాల భవనాలను రాత్రికి రాత్రి కూల్చివేయడంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి భూకబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి. కళాశాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలి. రాత్రికి రాత్రి బుల్డోజర్‌తో కూల్చివేయడం ఎక్కడ సంస్కృతి? కబ్జా చేయడంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కళాశాల యాజమాన్యానికి మధ్య ముందస్తు ప్రణాళిక ఉంది. - కె.రామకృష్ణ, సీపీఐ కార్యదర్శి

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలకు అభ్యర్థుల ఎంపిక

గవర్నర్‌పేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో నిర్వహించిన యోగాంధ్ర పోటీల్లో విజేతలకు శనివారం గోపాలరెడ్డి రోడ్డులోని ఐవీ ప్యాలెస్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. విజేతలను ఎంపిక చేసి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు అర్హులుగా ప్రకటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ పోటీలు యువ యోగాసాధకులకు ప్రోత్సాహకరంగా సాగాయని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్, జోనల్ కమిషనర్లు కె. ప్రభుదాస్, కె. షమ్మీ, రమ్య కీర్తన, సిబ్బంది పాల్గొన్నారు.



బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు

ఘనంగా బక్రీద్ వేడుకలు

పటమట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సౌజన్యంతో 12వ డివిజన్ పప్పుల మిల్ సెంటర్లో కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబా ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ డివిజన్ అధ్యక్షుడు శాయన బుజ్జి మాట్లాడుతూ త్యాగం, అనురాగం, దానగుణంతో నిర్వహించే పండుగ బక్రీద్ అన్నారు. ఈ కార్యక్రమంలో కొండవీటి ప్రసాద్, కరీమ్, ఖాలీబ్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కానరాని కాల్వగట్ల సుందరీకరణ

● ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు ● వ్యర్థాలు వేస్తున్న స్థానికులు ● భరించలేని దుర్గంధంతో వెతలు

పటమట, ఆంధ్రజ్యోతి: నగరంలో కాల్వల సుందరీకరణ పేరుతో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా నగర శివారులో ఉన్న పటమట, అంబేడ్కర్ నగర్ కాల్వగట్టు వంటి ప్రాంతాల్లో సుందరీకరణ పనులు చేపట్టడం లేదు. కొంత కాలం క్రితం ఇక్కడ కాల్వగట్టు పక్క ఐరన్ మెస్ వేసి వదిలేశారు. ఎలాంటి మొక్కలు నాటలేదు. ఫలితంగా యలమనకుదురు చిన్న వంతెన వద్ద నుంచి అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీహాల్ కాల్వగట్టు వరకు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. స్థానికులు వేస్తున్న వ్యర్థాల నుంచి భరించలేని దుర్గంధం వస్తోంది. ఈ ప్రాంతంలో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వారు ఎక్కువగా ఉంటారు. రకరకా లైన మొక్కలు పెంచి కూర్చునేందుకు బెంచీలు వేస్తే ఈప్రాంత వాసులకు ఉపయోగంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. సుందరీకరణ పనులు పూర్తయితే వయో వృద్ధులు సైతం అక్కడికి వచ్చి కొద్ది సేపు సేద తీరేందుకు అవకాశం ఉంటుందంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే కాల్వగట్టు సుందరీకరణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



అంబేడ్కర్‌నగర్ కాల్వ గట్టు పక్కన పెరిగిన పిచ్చిమొక్కలు

సుందరీకరణ చేపట్టాలి



కాల్వ గట్టును సుందరీకరించి మొక్కలు, బెంచీలు ఏర్పాటు చేయాలి. కళావిహీనంగా ఉన్న ప్రాంతాన్ని కళగా మార్చితే బాగుంటుంది.

సత్యనారాయణ (స్థానికుడు)



శ్రీవారి ఆలయంలో ఊంజల్ సేవ, తిరుచ్చి వాహన సేవలను నిర్వహిస్తున్న టీటీడీ అధికారులు

వైభవంగా తిరుచ్చి వాహనసేవ, ఊంజల్ సేవ

లబ్బీపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవారి ఆలయంలో శనివారం తిరుచ్చి వాహనసేవ, ఊంజల్ సేవలను అత్యంత ఘనంగా నిర్వహించారు. గత 15 ఏళ్ల క్రితం ఇదేరోజు శ్రీవారి ఆలయం ప్రారంభమైంది. 16వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా శనివారం ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహిం చారు. ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు, సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తిరుచ్చి వాహనంలో ఆలయ ప్రాంగణంలో వృత్తాకారంలో శోభాయ మానంగా, పూల అలంకరణతో ఊరేగింపు కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొని స్వామి వారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని టీటీడీ అధికారులు పర్యవేక్షించారు.

గోల్డెన్ ఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలి



కళాశాల యాజమాన్యాన్ని మందలిస్తున్న ఎస్ఐ రేవతి, చిత్రంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు

బెంజిసర్కిల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గోల్డెన్ ఐ పేరుతో అక్రమంగా తరగతులను నిర్వహిస్తున్న గోల్డెన్ ఐ కళాశాలను వెంటనే సీజ్ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు డిమాండ్ చేశారు. శనివారం బెంజిసర్కిల్ సమీపంలోని కళాశాల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన పోలీసులకు వారు వివరాలు తెలిపారు. విద్యాశాఖ నుంచి ఎలాంటి గుర్తింపు, అనుమతి లేకుండా కళాశాల ఎలా నిర్వహిస్తున్నారని పటమట ఎస్ఐ జి.రేవతి ప్రశ్నించారు. కళాశాల యాజమాన్యాన్ని మందలించారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ గోల్డెన్ ఐ కళాశాలకు ఇంటర్మీడియట్ బోర్డు సూచించిన అనుమతుల్లో ఒక్కటీ కూడా లేవని ఆరోపించారు. కోచింగ్ సెంటర్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధిక్ బాబు, జిల్లా కార్యదర్శి, నగర అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ జగదీష్, కోశాధికారి సురేష్, నాయకులు సిద్దు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.అజయ్ కుమార్ పిలుపు

రాణిగారితోట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం రాణిగారితోటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికవర్గ హక్కులను కాలరాసేందుకే లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని, కార్మికులకి సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, సమష్టి బేరసారాలు అడిగే హక్కు ఉండదని తెలిపారు. ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో కార్మికులకు రక్షణ లేని ఉద్యోగాల్ని నియమించి, శ్రమ దోపిడీ చేసేందుకు కార్పొరేట్లకు అవకాశం ఇచ్చేందుకు ఈ పద్ధతి తీసుకువచ్చారని తెలిపారు. కార్మిక సంస్కరణలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం కోసం జిల్లాలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకటేశ్వర, ప్రధాన కార్యదర్శి ఎన్.సి.హెచ్ శ్రీనివాస్, పిల్లి నరసింహరావు, డి.కాశీనాథ్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.అజయ్ కుమార్

వెలగని వీధిదీపం

అంధకారంలో నిర్మాణ్ భవనం రోడ్డు



భారతీనగర్, ఆంధ్రజ్యోతి: ఏపీఐఐసీ కాలనీలోని నిర్మాణ్ భవనం రోడ్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల వీధి లైట్లు సరిగాపని చేయకపోవడంతో రోడ్డంతా అంధకారంగా ఉంది.. దీంతో ఈ ప్రాంతంలోని ప్రజలు రాత్రి సమయంలో బయటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి స్థానికులు కోరుతున్నారు.

విజయవాడ జీజీహెచ్‌లో విజయవంతంగా శస్త్రచికిత్సలు

● ఒకరికి స్వరం రప్పించారు, మరొకరికి గురక లేకుండా చేశారు



శస్త్రచికిత్స అనంతరం రోగితో వైద్యులు

ప్రభుత్వాసుపత్రి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఈఎన్‌టీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ కొణిదె రవి ఆధ్వర్యంలో స్వర పక్షవాతంతో బాధపడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన కనకదుర్గ (45) అనే మహిళకు థైరోప్లాస్టీ అనే అధునాతన ఆపరేషన్ చేసి స్వరం పొందేలా చేయడంతో ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈఆపరేషన్‌కు మత్తు విభాగం శాఖాధిపతి డాక్టర్ వినయ్, డాక్టర్ కిరణ్, డాక్టర్ భారతి, ఈఎన్‌టీ వైద్యులు లీలా ప్రసాద్, డాక్టర్ రత్నబాబు, సిబ్బంది సహకరించారు. వారందరికీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వి రావుకు కనకదుర్గ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు వైద్యశాలలో రెండు లక్షలు అవుతుందని చెప్పారని, ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా శస్త్ర చికిత్స చేయడం, స్వరాన్ని రప్పించడం సంతోషంగా ఉందని బాధితురాలు హర్షం వ్యక్తం చేశారు.

●గురక వ్యాధితో బాధపడుతున్న విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన జ్యోతి (40) అనే మహిళకు యూనిలో పలాటో ఫరెన్గో ఫైస్టీ - యూపీ 3 ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో ఆమె గురక పూర్తిగా పోయింది. హాయిగా నిద్రపోతుందని వైద్యులు తెలిపారు. ప్రైవేటు వైద్యశాలలో రూ. లక్ష అయ్యే ఆపరేషన్ ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా పొందానని ఆమె తెలిపారు. ఈ మేరకు వైద్యులకు, ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నగర మార్కెట్లో టాటా ఆల్ న్యూ ఆల్ట్రోజ్ కారు



మార్కెట్లోకి కారు విడుదల చేస్తున్న జాస్పర్ డైరెక్టర్ ఆఫ్ సీనియర్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్

భారతీనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని డీలర్ జాస్పర్ షోరూంలో టాటా మోటార్స్‌లో అత్యధిక టెక్నాలజీ కలిగిన ఆల్ న్యూ ఆల్ట్రోజ్ కారును జాస్పర్ డైరెక్టర్ ఆఫ్ సీనియర్ ఉపాధ్యక్షుడు పీవీ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.సురేష్ ఆధ్వర్యంలో శనివారం మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో షోరూం జీఎం సయ్యద్ ఇబ్రహీం మాట్లాడుతూ ఆల్‌న్యూ ఆల్ట్రోజ్ కారులో నూతన టెక్నాలజీ కలిగిన అత్యధిక సదుపాయాలు, 360 డిగ్రీ కెమెరా సదుపాయం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పెద్దలు, వినియోగదారులు, పాల్గొన్నారు



దుర్గగుడిలో జరిగిన యోగాలో పాల్గొన్న ఈవో శీనానాయక్

యోగాతో జీవనశైలిలో మార్పు

● ఇంద్రకీలాద్రిపై ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): యోగాపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు దుర్గగుడిలో నిర్వహిస్తున్నట్టు ఈవో శీనానాయక్ తెలిపారు. యోగా పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. రమేష్ హాస్పటల్స్ యోగా థెరపిస్టు ఎన్.లక్ష్మి మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక స్థిరత్వం, అంతర్గత శాంతి లభిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ కార్యక్రమంలో యోగా భాగమవ్వాలన్నారు. యోగా నిపుణురాలు డాక్టర్ ప్రియదర్శిని సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం, ఇతర ఆసనాలను వేసి చూపించారు. వృక్షాసనంలో సుమారు 200మంది చక్కని శైలిలో చేయటం ఆకర్షించింది. పిల్లలు, మహిళలు, వృద్ధులకు అనుకూలమైన యోగాసనాలను ఈ సందర్భంగా నేర్పించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి.ఎస్.ఆర్. కోటేశ్వరరావు, ఏఈవోలు పి.చంద్రశేఖర్, జె.శ్రీనివాస, పీఆర్వో డాక్టర్ కె.గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

మిన్నంటిన ఆగ్రహావేశాలు

జగన్ పత్రిక కార్యాలయ ఆవరణలో తెలుగు మహిళల ఆందోళన ● వేశ్యల రాజధానిగా అభివర్ణించటంపై జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ● పత్రిక ప్రతులను దగ్ధం చేసిన ఎన్డీఏ కూటమి మహిళా నేతలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అమరావతిని వేశ్యల రాజధానిగా సాక్షి చానెల్‌లో అభివర్ణించిన జర్నలిస్ట్ కృష్ణంరాజు వ్యాఖ్యలను నిరశిస్తూ తెలుగు మహిళలు సాక్షి కార్యాలయాన్ని శనివారం ముట్టడించారు. ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి నేతృత్వంలో మహిళలు సాక్షి కార్యాలయ ఆవరణలోకి ప్రవేశించి అక్కడే బైఠాయించి ధర్నా చేపట్టారు. దేవతల రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా చిత్రీకరించే ప్రయత్నం చేయటం దుర్మార్గమని మండిపడ్డారు. రాజధాని అమరావతి ప్రాంతంలో భారతీ రెడ్డి ఉంటున్నారన్న సంగతి మరిచి వేశ్యల రాజధానిగా ఎలా అంటారని ప్రశ్నించారు. నీలి మీడియాలో రాజధాని మహిళలను వేశ్యలుగా చిత్రీకరించే ప్రయత్నంలో కుట్ర కోణం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతిని దేవతల రాజధానిగా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణిస్తూ మహిళల గౌరవాన్ని పెంచితే వేశ్యల రాజధానిగా అభివర్ణిస్తూ మహిళల గౌరవాన్ని వైసీపీకి చెందిన సాక్షి మీడియా దెబ్బతీసిందన్నారు. భారతీరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ లోపు వర్షం పడుతుండటంతో తప్పనిసరి పరిస్థితులో ఆందోళన విరమించారు. ఆశ, మాదాల రాజ్యలక్ష్మి, నాగమణి, సుకాసి సరిత, చెరుకూరి మాధవి, వీరపనేని అరుణ, లక్ష్మీ సౌజన్య పాల్గొన్నారు.




విజయవాడలో జగన్ పత్రిక కార్యాలయ ఆవరణలో ఆందోళన చేస్తున్న తెలుగు మహిళలు, గన్నవరం టీడీపీ కార్యాలయం వద్ద సాక్షి పత్రికను దగ్ధం చేస్తున్న ఎన్డీఏ కూటమి మహిళా నేతలు

కృష్ణంరాజు క్షమాపణ చెప్పాలి: ఏపీయూడబ్ల్యూజే అర్బన్ యూనిట్

గాంధీనగర్: అమరావతి ప్రాంత మహిళలను కించపరుస్తూ అసభ్యకరంగా జర్నలిస్టు, మ్యాగజైన్ ఎడిటర్ వీవీఆర్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) విజయవాడ అర్బన్ యూనిట్ తీవ్రంగా ఖండించింది. ఒక పత్రిక ఎడిటర్‌గా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. తక్షణమే అమరావతి ప్రాంత మహిళలతో పాటు రాష్ట్ర ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచల జయరాజ్, దాసరి నాగరాజు, సామ్నా నేత రమణారెడ్డి, ఐజేయూ నేత ఎస్‌కే. బాబు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు జి.రఘురాం, నాగ మల్లేశ్వరరావు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఏపీఎంపీఏ ఖండన

విజయవాడ: అమరావతి వేశ్యల రాజధాని అంటూ ఆ ప్రాంత మహిళలను అవమానిస్తూ జర్నలిస్టు వీవీఆర్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఒక ప్రకటనలో ఖండించింది. ఆయన వ్యాఖ్యలు గుజుప్సాకరంగా ఉన్నాయని ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రాజధాని ప్రాంత మహిళలకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేమినేని వెంకట రమణ, రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పసుపులేటి చైతన్య, నేతలు రాజా, గుర్రం శ్రీనివాసరావు, వేల్పుల ప్రశాంత్, కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

దేవతల రాజధానిపై దుర్భాషలా?: బీజేపీ మహిళా మోర్చా

రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన జరిగి, ప్రధాని మోదీ రాజధానిని కొనియాడిన కొన్ని రోజులకే దేవతల రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అనడాన్ని దానిని సాక్షి టీవీలో సమర్థించడాన్ని బీజేపీ మహిళా మోర్చా వ్యతిరేకించింది. వైసీపీ ఇంకా తన వైఖరి మార్చుకోకుండా మహిళల గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేసినవారిని ప్రోత్సహించడం దుర్మార్గమని బీజేపీ మహిళా మోర్చా ఓ ప్రకటనలో ఖండించింది. ఇదే విషయంపై సీపీఎం నేత వై.నేతాజీ అమరావతిని అసభ్యకరంగా దూషించడాన్ని ఓ ప్రకటన ద్వారా ఖండించారు. ఈ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు.

కాంగ్రెస్ సీనియర్ మహిళా నేత పద్మశ్రీ ఫైర్

ఉంగుటూరు: రాజధాని అమరావతిపై జగన్ ద్వేషంతో రగిలిపోతూ విషం చిమ్ముతున్నారని, రాష్ట్ర అభివృద్ధికి రాజధాని ప్రాంతంలో భూములను త్యాగం చేసిన రైతులు, మహిళలను కించపరిచేలా సాక్షి బ్లూ మీడియాలో పేటీఎం జర్నలిస్ట్ చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలను పార్టీలకతీతంగా ఖండించాలని ఏపీ కాంగ్రెస్ సీనియర్ మహిళానేత సుంకర పద్మశ్రీ అన్నారు. బ్లూమీడియా సాక్షిగా అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజును అరెస్ట్ చేయాలని, సాక్షి అధినేత భారతీరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని పద్మశ్రీ డిమాండ్ చేశారు.

గొల్లపూడి వన్ సెంటర్లో జగన్ పత్రిక, దిష్టిబొమ్మ దహనం

గొల్లపూడి: అమరావతి రాజధాని మహిళలపై సాక్షి డిబెట్‌లో కృష్ణంరాజు అనే వ్యక్తి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై గొల్లపూడిలో టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. ప్రజా రాజధాని అమరావతిపై సాక్షి పత్రిక, సాక్షి చానెల్ పని గట్టుకొని విష ప్రచారాన్ని చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ టీడీపీ శ్రేణులు గొల్లపూడి వన్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట శనివారం రాత్రి సాక్షి పత్రిక, సాక్షి దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన హోరెత్తించారు. గొల్లపూడి ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు, టీడీపీ గ్రామాధ్యక్షుడు నూతలపాటి వెంకటేశ్వరరావు (నారద) మాట్లాడుతూ సాక్షి డిబెట్‌లో జర్నలిస్టు ముసుగులో ఉన్న కృష్ణంరాజు అనే వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు ప్రేరేపించి మాట్లాడించిన కొమ్మినేని శ్రీనివాసరావు తక్షణం క్షమాపణలు చెప్పాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు మాట్లాడుతూ రాజధానిపై తప్పుడు ప్రచారాలు చేసి శునకానందం పొందుతున్న వైసీపీ పార్టీవారిని నడిరోడ్డుపై తన్నాలని అప్పుడే ఆ పార్టీ నేతలకు, కార్యకర్తలకు బుద్ధి వస్తుందన్నారు. డౌన్ డౌన్ సాక్షి చానెల్, డౌన్ డౌన్ కొమ్మినేని శ్రీనివాసరావు, డౌన్ డౌన్ కృష్ణంరాజు అని పెద పెట్టున నినాదాలు చేశారు. టీడీపీ నేతలు బొర్రా తిరుపతిరావు, చిట్టినేని క్రాంతి, చిట్టినేని క్రాంతి, బొర్రా చిన్నా, పొన్నం బీముడు పాల్గొన్నారు.

సాక్షి అధినేత కూడా అక్కడే ఉన్నారు: ఎమ్మెల్యే సౌమ్య



నందిగామ: అమరావతిని వైశ్యల రాజధాని అంటూ ప్రకటనలు చేసిన సాక్షి మీడియా ఆ సంస్థ అధినేత భారతీరెడ్డి కూడా అమరావతి పరిధిలోనే ఉందన్న విషయం గుర్తుంచుకోవాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాజధాని అమరావతి పనులు శరవేగంగా సాగుతుంటే చూడలేని జగన్ మీడియా అవమానకర వ్యాక్యలు చేస్తుందన్నారు. రాజధాని మహిళలను అవమానకరంగా మాట్లాడిన ఘటనపై భారతీరెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశా రు. ఎన్ని కుట్రలు చేసినా అమరావతి నిర్మాణం ఆగదన్నారు. ప్రజల చీత్కారానికి గురై ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయిన జగన్ ఇటువంటి చర్యలు కొనసాగిస్తే రాష్ట్రం నుండి సాగనంపుతారని అన్నారు.

భారతీ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి: చెన్నుపాటి

వన్‌టౌన్: రాజధాని అమరావతిపై ఆ ప్రాం త మహిళలను అవమానపరిచేలా ప్రచారం చేసిన సాక్షి మీడియా అధినేత్రి భారతిరెడ్డి మ హిళాలోకానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి డిమాండ్ చేశారు. సాక్షి చానల్‌లో కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహించిన డిబేట్‌లో ఎనలిస్టు వీవీఆర్ కృష్ణంరాజు రాజధాని మహిళలపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో చెన్నుపాటి ఉషారాణి పలువురు మహిళా నేలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అధికారం కోల్పోయి ప్రతిపక్ష హోదా కూడా దక్కని జగన్ అక్కసుతో, ద్వేషంతో తన బ్లూ మీడియాతో కలిసి రాజధాని అమరావతిపై విషం చిమ్మించే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత, ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ స్పందించి సుమోటుగా స్వీకరించి న్యాయం జరిగేలా తగిన చర్యలు తీ సుకోవాలని కోరారు. తెలుగు రాష్ట్ర మహిళా ఉ పాధ్యక్షురాలు షేక్ ఆషా, రాష్ట్ర తెలుగు మహి ళా కార్యదర్శి ఎం.రాజ్యలక్ష్మి, మహిళా నాయకురాళ్లు నాగమణి, సుకాసి సరిత, సి.హెచ్.మాధవి, వి.అరుణ, లక్ష్మీ, సౌజన్య పాల్గొన్నారు.

కొమ్మినేని, కృష్ణంరాజుపై ఫిర్యాదు

గన్నవరం: రాజధాని అమరావతి ప్రాంత మహిళలను వేశ్యలుగా, సెక్స్ వర్కర్లుగా పేర్కొంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ శనివారం ఎన్డీఏ కూటమి మహిళా నేతలు మండి పడ్డారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. అమరావతి పరిరక్షణ సమితి నేత, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష మాట్లాడుతూ సాక్షి అనే బోగస్ చానల్‌లో కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజు అనే వ్యక్తులు అమరావతి మహిళలపై జుగుప్సాకరంగా లైవ్ డిబేట్లో మాట్లాడారని, గత వైసీపీ పాలనలోనూ అమరావతిని నాశనం చేసేందుకు అభాండాలు మోపారని, ప్రజలు నమ్మకుండా బుద్ధి చెప్పారన్నారు. ఇందులో కుట్ర దాగి ఉందని, వెంటనే అమరావతి మహిళలకు భారతి రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి మాట్లాడుతూ అమరావతి ప్రాంత మహిళలను ఘోరంగా అవమానిస్తూ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడనే ఆరోపణలపై టీడీపీ కార్యకర్త కిరణ్ అనే వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి పోలీస్ కేసు పెట్టి, జైల్లో పెట్టామని పార్టీకి మహిళలపై ఉన్న గౌరవం అలాంటిదన్నారు. అనంతరం సాక్షి దినపత్రిక ప్రతులను దగ్ధం చేస్తూ, సాక్షి మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మేడేపల్లి రమా, కానూరు శేష మాధవి, మేకల స్వాతి, నెక్కంటి శ్రీదేవి, బొమ్మసాని అరుణ కుమారి, స్వర్ణ కుమారి, తుపాకుల శివలీల, బడుగు ఝాన్సీ, రమ్య, నాగమణి, యశోద, లావణ్య, చేబత్తిన సుజాత, లక్ష్మీ, బి.సుకన్య పాల్గొన్నారు.

మాజీ ఎంపీ అంకినీడుకు ప్రముఖుల నివాళి

● ప్రజల సందర్శనార్థం చల్లపల్లి పురవీధుల్లో ఊరేగింపు ● కడసారి వీక్షించేందుకు రోడ్ల వెంబడి బారులుతీరిన ప్రజలుల

చల్లపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లి రాజా తనయుడు, బందరు మాజీ ఎంపీ శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడుప్రసాద్ బహద్దూర్‌కు ప్రముఖులు, ప్రజలు ఘన నివాళులర్పించారు. కోయంబత్తూరులో కన్నుమూసిన అంకినీడుప్రసాద్ భౌతికకాయాన్ని శనివారం సాయంత్రానికి స్వగ్రామమైన చల్లపల్లి తీసుకువచ్చారు. భౌతికకాయాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ప్రజల సందర్శనార్థం చల్లపల్లి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆటోనగర్ వద్ద తరిగోపుల ప్రాంగణం నుంచీ ప్రారంభమైన ఊరేగింపు ప్రధాన సెంటరు మీదుగా పడమరవీధి, చల్లపల్లి రాజా కోట, బ్రహ్మంగారి దేవాలయం వరకు సాగి తిరిగి ప్రధాన సెంటరు మీదుగా చల్లపల్లి రాజా హైస్కూల్‌కు చేరింది. ప్రజలు నివాళులర్పించేందుకు వీలుగా భౌతికకాయాన్ని హైస్కూల్ ప్రాంగణంలో ఉంచారు. అంకినీడు ప్రసాద్ కుమారులు రామేశ్వరప్రసాద్, హరీశ్వరప్రసాద్‌ను పరామర్శించారు.



మాజీ ఎంపీ యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, టీడీపీ రాష్ట్రనేత కొనకళ్ల బుల్లయ్య, యువనేత మండలి వెంకట్రామ్, ఆయుష్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్, డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, మోర్ల రాంబాబు, ముమ్మనేని నాని, ప్రముకులు సజ్జా చలపతిరావు, యార్లగడ్డ లంకబాబు, యార్లగడ్డ శ్రీనివారావు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, నూకల లక్ష్మయ్య, యార్లగడ్డ శివప్రసాద్, నాగళ్ల బీమారావు, మూల్పూరి లక్ష్మణస్వామి, వేమూరి రమేష్ బాబు, రావి చిట్టి, మోర్ల ప్రసాద్, తాతినేని పూర్ణ, పరుచూరి అంజయ్య, మిక్కిలినేని మధు, మోపిదేవి ద్వారకానాథ్, బొండలపాటి వీర బాబు, ఆది రామ్మోహనరావు, మీర్ రిజ్వాన్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. చల్లపల్లి రాజా కుమారుడిని కడసారి చూసేందుకు ప్రజలు రోడ్డవెంబడి బారులుతీరారు. అంకినీడు ప్రసాద్ మృతికి సంతాప సూచకంగా కోట గోడ వెంబడి దుకాణదారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. సీఐ కే ఈశ్వరరావు, ఎస్ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

మాజీ ఎంపీ యార్లగడ్డ అంకినీడుప్రసాద్ బహద్దూర్ అంత్యక్రియలు ప్రభుత్వ అధికార లాంఛనాలతో జరుగుతాయని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావ్ తెలిపారు. చల్లపల్లి రాజా హైస్కూల్‌లో అంకినీడుప్రసాద్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అంత్యక్రియల విషయమై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో మాట్లాడినట్టు తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించేందుకు ఆదేశాలిచ్చారన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం శివగంగలో అంకినీడుప్రసాద్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అంకినీడుప్రసాద్ మృతితో అవనిగడ్డ నియోజకవర్గం పెద్దదిక్కును కోల్పోయినట్లయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అభివృద్ధికీ, రాజా హైస్కూల్ ద్వారా పేదల విద్యాభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని ఎంపీ వల్లభనేని బాలసౌరి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

యోగాభ్యాసంతో మానసిక వికాసం: కలెక్టర్



సత్యనారాయణపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): యోగాభ్యాసంతో మానసిక వికాసం కలుగుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్‌రోడ్డు యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికారులు, వీఎంసీ, శనివారం థీమ్ యోగా జరిగింది. కలెక్టర్ వలంటీర్లు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నిషియన్స్‌తో కలిసి యోగాసనాలు వేశారు. భారత వారసత్వ సంపదయిన యోగాను అన్ని వర్గాల వారికి చేరువ చేసుకొనేందుకు కృషి చేస్తున్నామన్నారు వీఎంసీ అదనపు కమిషనర్ డీ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, వైద్యసేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ జే సుమన్, ఆయుష్ అధికారులు డాక్టర్ వీ రాణి, రామత్లెహి, డాక్టర్ కొల్టేఇ రమేష్, డాక్టర్ రత్న ప్రియదర్శిని లాయర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌ను సందర్శించిన ఏపీఎస్పీఎఫ్ డీజీ



గౌరవవందనం స్వీకరిస్తున్న ఏపీఎస్‌పీఎఫ్ డీజీ సీఎం త్రివిక్రమ వర్మ

ఇబ్రహీంపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రివిక్రమ వర్మ (ఐపీఎస్) శనివారం డాక్టర్ ఎన్టీటీపీఎస్‌ను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. తొలుత ఆయన ఏపీఎస్‌పీఎఫ్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్లాంట్‌లోని స్టేజ్-1 నుంచి స్టేజ్-4 కోల్డ్ ప్లాంట్, వ్యాగస్ త్రీ ఫ్లోర్ గురించి ఆయనకు ఏడీఈ హేమానంద్ వివరించారు. ఏపీ జెన్కో ఫ్యాక్టరీ మేనేజర్ శేషాద్రిశేఖర్, డీఎఫ్‌వో బీఎల్‌పీ శాస్త్రి కోల్ అన్‌లోడింగ్ అయ్యే బెల్ట్ మీదకు వెళ్లే విధానం, బోయిలర్ మెయింటెనెన్స్ గురించి వివరించారు. ఎస్ఈ అనురాధ కోల్ ద్వారా విద్యుత్ ఎలా తయారవుతుందో యూనిట్ కంట్రోల్ బోర్డులో వివరించారు. ఏపీఎస్‌పీఎఫ్ విజయవాడ జోన్ కమాండెంట్ ముద్దాడ శంకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ టి.కృష్ణమాచారి పాల్గొన్నారు.

అమరావతిని కార్పొరేట్ రాజధానిగా మార్చొద్దు

● రాజధానిపై జరిగిన సదస్సులో వక్తలు



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ రామచంద్రయ్య

గవర్నర్‌పేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం ప్రజా రాజధానిగా, పేద ప్రజలు నివసించే ఒక నగరంగా అభివృద్ధి చేయాలని కార్పొరేట్ రాజధానిగా మార్చడం సరైందని కాదని వక్తలు పేర్కొన్నారు. ఎంబీటీకే ఆధ్వర్యంలో శనివారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో అమరావతి రాజధాని నిధులు-నిర్మాణం విధానాలు అనే అంశంపై సదస్సు జరిగింది. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం బాధ్యుడు బీ గంగారావు అధ్యక్షత వహించారు. సెస్సు మాజీ ప్రొఫెసర్ డాక్టర్ సీ రామచంద్రయ్య మాట్లాడుతూ అమరావతిని మార్కెట్‌పై ఆధారపడే కార్పొరేట్ రాజధానిగా మార్చారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ సేవలను కార్పొరేట్ కంపెనీల ద్వారా చేస్తారన్నారు. రాష్ట్రానికి కావాల్సింది ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమ అని దానిపై దృష్టి పెట్టకుండా ఎయిర్‌పోర్టులు, రైల్వేస్టేషన్లు, క్రీడా ప్రాంగణాలకు వేలాది ఎకరాలు కార్పొరేట్ కంపెనీలకు ఉచితంగా కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నమ్మి ఏ ఒక్క రైతు భూములిచ్చి మోసపోవద్దన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎంబీవీకే ట్రస్ట్ చైర్మన్ పి.మధు, న్యూడెమోక్రసీ నేత కే పోలారి. ఎంబీవీకే బాధ్యుడు టీ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

పర్యాటక శాఖ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

మంత్రులు కొల్లు, నారాయణ, సారథి



మాట్లాడుతున్న మంత్రులు, కొల్లు, నారాయణ, సారథి తదితరులు



మచిలీపట్నం టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం బీచ్‌కు జాతీయ స్థాయిలో అన్ని హంగులతో ఆర్థికంగా బలపడేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మంగినపూడి బీచ్‌లో జరుగుతున్న బీచ్ ఫెస్టివల్ వేదికపై మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ అభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకు వస్తున్నారన్నారు. కనివినీ ఎరుగని జాతీయ స్థాయిలో జలక్రీడలు, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించడం ఒక రికార్డు స్థాపించామన్నారు. భవిష్యత్తులో మచిలీపట్నంలో సైనిక్ స్కూల్ స్థాపిస్తామన్నారు. బీచ్‌లో ఏవిధమైన ప్రమాదాలు జరగకుండా డ్రోన్ కెమెరాలతో అలారం సిస్టం ఏర్పాటు చేస్తామన్నారు. మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు ప్రతి సమావేశంలోనూ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని సూచిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రూ.10లక్షల కోట్లు అప్పులు చేసి వెళ్లారని, ఆ ఆర్థిక మాంద్యాన్ని నెట్టుకొచ్చేందుకు పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ జీడీపీలో ముందుకు వెళ్లే అవకాశాలున్నాయన్నారు. హౌసింగ్, సమాచార శాఖ మంత్రి కేపీ సారథి మాట్లాడుతూ, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికి ఆరు పోర్టుల అభివృద్ధి జరుగుతుందని, మరో 6 పోర్టుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో పోర్టుల అభివృద్ధిని ఒక యజ్ఞంలా తీసుకుంటున్నామన్నారు. 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, సినీదర్శకుడు మారుతి, మరో సినీదర్శకుడు నాగరమేష్, బెంగుళూరు స్వామిజీ బాలకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు గోపు సత్యనారాయణ, లోగిశెట్టి వెంకటస్వామి, రామధాని వేణు, తలారి సోమశేఖర్ పాల్గొన్నారు. చివరిగా మంత్రులు కొల్లు, నారాయణ, సారథి పారా గ్లైడింగ్ చేశారు.

నల్లూరి కల్యాణమండపం దేవదాయ శాఖ స్వాధీనం

● స్వామి ఆభరణాలు కూడా.. ● ఆలయం ఇది వరకే స్వాధీనం
● హైకోర్టు తీర్పు వస్తే ఎన్ఎస్ఎం స్కూల్ కూడా..



స్వామి బంగారు ఆభరణాలను లెక్కిస్తున్న దేవదాయ సిబ్బంది

ఆంధ్రజ్యోతి, విజయవాడ: నల్లూరి ట్రస్ట్ ఆధీనంలోని పటమటలోని కల్యాణమండపాన్ని దేవదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు తీర్పు దేవదాయశాఖకు అనుకూలంగా రావటంతో చట్టబద్ధమైన చర్యలతో కల్యాణమండపాన్ని స్వాధీనంలోకి తీసుకున్నారు. దీంతో దాదాపుగా వందేళ్లుగా నల్లూరి వంశీకుల ఆధీనంలోని భూములు, భవనాలను దేవదాయ శాఖ స్వాధీనం చేసుకున్నట్టయింది. స్వామి వారి దేవస్థానాన్ని గతంలోనే స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న వాటిని పర్యవేక్షించేందుకు వన్‌టౌన్‌లోని విజయేశ్వరస్వామి ఆలయ ఈవోగా పనిచేస్తున్న కందుల వెంకటరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో దేవస్థాన ఆస్తులను మదింపు చేపట్టారు. స్వామి బంగారు, వెండి ఆభరణాలను లెక్కించి రికార్డుల్లో నమోదు చేసి స్వాధీనం చేసకున్నారు. అలాగడే హుండీలకు కూడా తాళాలు వేశారు. కల్యాణమండపంతో పాటు గుడికి చెందిన ఆస్తులు, భూములన్నీ దేవదాయశాఖ పరమయ్యాయి.

స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన ముక్త్యాల బృందం

చల్లపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ చల్లపల్లిలో స్ఫూర్తిమంతంగా సాగుతున్న స్వచ్ఛ ఉద్యమాన్ని పరిశీలించేందుకు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ముక్త్యాల గ్రామానికి చెం దిన ప్రజాప్రతినిధులు, పెద్దల బృందం 35 మంది శనివారం చల్లపల్లి వచ్చారు. కేసీపీ సీఎస్ఆర్ మేనేజర్ రాఘవేంద్రరావు ద్వారా స్వచ్ఛ చల్లపల్లి ఖ్యాతిని తెలుసుకున్న బృందం మేనేజర్‌తో కలిసి చల్లపల్లి సందర్శించారు. 3495వ రోజు స్వచ్ఛ సేవలో పాల్గొని కార్యకర్తలతో కలిసి శ్రమదానం చేశారు. ఈ ఉద్యమ ప్రస్థానాన్ని డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి తెలిపారు. అనంతరం బృంద సభ్యులు మాట్లాడుతూ ముక్త్యాలను స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకుని స్వచ్ఛ చల్లపల్లి బృందాన్ని ఆహ్వానిస్తామన్నారు. ముక్త్యాల సర్పంచ్ షేక్ ఉమర్, కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. స్వచ్ఛ చల్లపల్లిలో భాగంగా పనులు చేస్తున్న మన కోసం మనం ట్రస్ట్‌కు ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాళం శివన్నారాయణ, విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రాతూరి ఉదయశంకర శాస్త్రి రూ.5వేలు చొప్పున విరాళాన్ని ట్రస్టీ డీఆర్‌కే ప్రసాద్‌కు అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

విజయవాడ: జిల్లాలో తుఫాను, ఈదురుగాలులతో వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముందుస్తు ప్రణాళికతో ఎలాంటి ప్రాణ, పశు, పంట నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పరిస్థితిని సాధారణ స్థితికి తెచ్చేందుకు అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తేవాలని, 91549 70454తో కంట్రోల్ రూం పనిచేస్తుందని తెలిపారు.



ముఖం మెరిపిద్దామిలా

అందం కనిపించాలని అందరూ కోరుకుంటారు. అయితే రసాయనాలు ఉండే సౌందర్యసాధనాలు వాడకుండా, ఇంట్లో ఉండే వాటితోనే సహజంగా ఫేస్ ప్యాక్ తయారు చేసుకుని ముఖం అందంగా మార్చుకోవచ్చు.

- ఒక గిన్నెలో నాలుగు చెంచాల శనగ పిండి, కొంచెం పసుపు, రోజ్ వాటర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ అంతా ప్యాక్‌లా వేయాలి. అరగంట తరువాత నీళ్లతో కడిగేయాలి. ఈ ప్యాక్ చర్మం తేమను కోల్పోకుండా చేస్తుంది.
- పావు కప్పు బొప్పాయి గుజ్జులో ఒక చెంచా తేనే వేసి కలిపి ముఖంపై రాయాలి. 20 నిమిషాల తరువాత నీటితో కడగాలి. దీని వల్ల ముఖంపై మొటిమలు తగ్గుతాయి.
- అరకప్పు దోస ముక్కలను పేస్టులా చేసి అందులో చెంచా పెరుగు కలిపి ముఖం, మెడకు పట్టించి ఆరిపోయాక కడిగేసుకోవాలి. ఈ ప్యాక్‌తో చర్మం తేమను కోల్పోకుండా ఉంటుంది.
- ఒక పండిన అరటిపండును గుజ్జుల చేసి, అందులో ఒక చెంచా పాలు, చెంచా తేనె వేసి కలపాలి. దీనిని ముఖంపై రాస్తూ సున్నితంగా మర్దన చేయాలి. ఇరవై నిమిషాల తరువాత చల్లని నీళ్లతో కడిగేయాలి. దీని వల్ల చర్మంపై మురికి పోయి మెరుస్తుంది.
- రెండు టేబుల్ స్పూన్ల బార్లీ గింజల పొడిని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో కొంచెం వేడి నీళ్లు పోసి ముద్దలా చేయాలి. దీనిని ముఖంపై రాసి పావు గంట తరువాత కడిగేయాలి. ఈ ప్యాక్ వల్ల చర్మంపై మృతకణాలు తొలగి ముఖం అందంగా మారుతుంది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
రానా నాయుడు 2	తెలుగు సిరీస్	జూన్ 13
అమెజాన్ ప్రైమ్		
ది ట్రైటర్స్	హిందీ సిరీస్	జూన్ 12
జియో హాట్‌స్టార్		
శుభం	తెలుగు చిత్రం	జూన్ 14
ఆపిల్ టీవీ ప్లస్		
ఎకో వ్యాలీ	హాలీవుడ్ మూవీ	జూన్ 13
ఈటీవి విన్		
ఆ ఒక్కటీ అడక్కు	తెలుగు చిత్రం	జూన్ 12

పిల్లలకు మార్కులు రాకపోతే...



కొంతమంది పిల్లలు బాగా చదువుతున్నట్లే ఉంటారు. కానీ మార్కులు మాత్రం తక్కువగా వస్తూ ఉంటాయి. ఇలాంటప్పుడు తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- మార్కుల పత్రం చూడగానే కోపం వచ్చినప్పటికీ మామూలుగా ఉండే ప్రయత్నం చేయాలి. వెంటనే అరిచేస్తే పిల్లలు భయపడి అసలు సమస్య చెప్పరు. కొద్దిసేపు మౌనంగా ఉండి తరవాత మెల్లగా మాట్లాడడం మొదలు పెట్టాలి.
- పిల్లలను దగ్గర కూర్చోబెట్టుకుని ఏ సబ్జెక్టులో తక్కువ మార్కులు వచ్చాయో అడిగి తెలుసుకోవాలి. బడిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు అర్థమవుతున్నదీ లేనిదీ అడగాలి. మార్కులు తక్కువగా రావడానికి గల కారణాలు తెలుసుకోవాలి.
- మిగిలిన పిల్లలతో పోల్చి నిందించవద్దు. దీనివల్ల పిల్లల ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది.
- ఏ సబ్జెక్టులోనైనా మార్కులు ఎక్కువగా వస్తే ఆ అంశాన్ని ప్రస్తావిస్తూ పిల్లల ప్రతిభను, సామర్థ్యాన్ని మనస్ఫూర్తిగా ప్రశంసించాలి. దీనితో పిల్లలకు కష్టపడి సాధించాలనే ఆలోచన వస్తుంది.
- బడిలో ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సూచనలు పాటించాలి. అవసరమైతే పిల్లలకు ట్యూటర్‌ను పెట్టవచ్చు.
- పిల్లలు చదువుకునేటప్పుడు వాళ్ల దగ్గర కూర్చుని ఎలా చదువుతున్నారో పరిశీలించాలి. ఏవైనా సందేహాలు అడిగితే తీర్చాలి. ఏ సబ్జెక్టును ఎప్పుడు, ఎంతసేపు చదవాలో చర్చిస్తూ ఒక టైమ్ టేబుల్‌ను తయారు చేయాలి.
- పిల్లలు ఏకాగ్రతతో శ్రద్ధగా చదివేలా చూడాలి. చదివిన అంశాలను తేలికగా గుర్తుపెట్టుకునే విధానాన్ని తెలియజేయాలి. సమయానుసారం పోషకాహారం అందించాలి. రాత్రిపూట త్వరగా పడుకునే అలవాటు చేయాలి.
- మార్కులు ఎక్కువగా రావాలి అనేదాని కంటే పిల్లలు సబ్జెక్టును అర్థం చేసుకుంటూ చదువుకునేలా ప్రోత్సహించాలి.

ఏడవడం మంచిదే..!



మనకు బాధ కలిగినప్పుడు ఒక్కోసారి ఏడుపు వస్తుంది. ఇలా ఏడవడం కూడా మంచిదే అంటున్నారు నిపుణులు.

- ఏడవడంవల్ల శరీరంలో కార్టిసాల్ హార్మోన్ ప్రభావం తగ్గుతుంది. వెంటనే మనసులో బాధ తీవ్రత తగ్గి ఒత్తిడి మాయమవుతుంది. కళ్లు, మెదడు అలసిపోవడంతో నిద్ర ముంచుకువస్తుంది. మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది
- ఏడ్చిన తరవాత శరీరంలో ఆక్సిటోసిన్, ఎండార్ఫిన్ లాంటి సంతోషకరమైన హార్మోన్లు విడుదలవుతాయి. వీటివల్ల శరీరానికి స్వాంతన లభిస్తుంది. ఆందోళన తగ్గుతుంది.
- ఏడిస్తే శరీరానికి విశ్రాంతిగా అనిపిస్తుంది. మనసులో భారం తగ్గుతుంది. మెదడు ప్రశాంతంగా ఆలోచిస్తుంది. రక్తపోటు నియంత్రణలోకి వస్తుంది.
- ఏడ్చేటప్పుడు వేగంగా శ్వాస పీల్చడం, వదలడం జరుగుతుంది కాబట్టి ఊపిరితిత్తులు శుభ్రపడతాయి. శరీరమంతటికీ చక్కగా ఆక్సిజన్ అందుతుంది.
- భావోద్వేగాలను అణచుకోకుండా వెంటనే ఏడ్వడం వల్ల మనసు సమతుల్య స్థితిలోకి వస్తుంది. గుండె కొట్టుకునే వేగం నియంత్రణలో ఉంటుంది.
- ఏడ్చేటప్పుడు కన్నీళ్లు రావడం వల్ల కళ్లలో పేరుకున్న వ్యర్థపదార్థాలు, హానికారక బ్యాక్టీరియాలు బయటికి వచ్చేస్తాయి. కళ్లు పూర్తిగా శుభ్రపడి తేమతో నిండుతాయి. మొదట ఎరుపెక్కినప్పటికీ కొంత సమయం తరవాత కళ్లు ప్రకాశవంతంగా మారతాయి.
- శరీరంలోని పారాసింపథిటిక్ నెర్వస్ సిస్టమ్ పనితీరు మెరుగుపడి, శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఏడ్చేటప్పుడు ముఖంలో ఏర్పడే కదలికలవల్ల రక్తప్రసరణ వేగం పెరుగుతుంది. దీంతో ముఖం ప్రకాశవంతంగా ఛాయగా కనిపిస్తుంది.

నాతో నేనే పోటీపడతా

తెలంగాణ జానపద గీతాలకు ఇప్పుడు మంచి ఆదరణ లభిస్తోంది. పెద్ద హీరోలు కూడా ఫోక్ సాంగ్స్ అంటే ఆసక్తి చూపిస్తున్నారు. తెలంగాణ యాస, భాషలో పాటలు రాయడంలో ఇటీవలి కాలంలో బాగా వినిపిస్తున్న పేరు కాసర్ల శ్యామ్. ఇప్పటివరకూ 800కి పైగా పాటలు రాసిన శ్యామ్‌తో 'నవ్య' ముచ్చట్లు.



మీ పాటల ప్రయాణం ఎలా మొదలైంది?

మాది హన్మకొండ ప్రాంతం. నాన్న కాసర్ల మధుసూదనరావు రంగస్థల, సినీ నటులు. 'తల్లిదీవెన', 'చలిచీమలు', 'మంచికి స్థానం లేదు' వంటి దాదాపు 30 చిత్రాల్లో ఆయన నటించారు. నటుడు కావాలనే కోరిక నాకు కూడా చిన్నతనంలో ఉండేది. అయితే నటుడిగా నిలదొక్కుకోవాలంటే ప్రతిభతో పాటు గాడ్‌ఫాదర్ కూడా ఉండాలి. అలా కాకుండా క్రియేటివ్ సైడ్ వెళితే బాగుంటుందనిపించింది. నాన్న కూడా నాకు అదే మాట చెప్పారు. సుభాన్ అని పెద్ద వంశీ దగ్గర కో డైరెక్టర్‌గా చేసేవారు. ఆయన మా నాన్న స్నేహితుడు. ఆయన ద్వారా దర్శకత్వ శాఖలో చేరితే బాగుంటుందని కూడా అనుకొనేవాణ్ణి. కృష్ణవంశీగారు 'సిందూరం' తీస్తున్నప్పుడు ఆయనవద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాలని, అవకాశం కల్పించమని చంద్రబోస్ గారిని అడిగాను. కుదరలేదు. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి జానపదంలో ఎంఏ, ఎంఫిల్ చేశా. అప్పుడప్పుడు ప్రైవేట్ సాంగ్స్ రాసిన అనుభవం ఉండడంతో సినిమారంగంలో మిత్రులవల్ల అవకాశాలు వచ్చాయి.

కెరీర్‌పరంగా కష్టాలు, కన్నీళ్లు ఉన్నాయా?

హైదరాబాద్ వచ్చిన తర్వాత ఏడేళ్ల వరకూ సినిమా గురించి ఆలోచించలేదు. చదువు మీద దృష్టి పెట్టా. తర్వాత కొంత కాలం ఆకాశవాణిలో క్యాజువల్ అనౌన్సర్‌గా పని చేశా. అడపాదడపా కొన్ని సినిమా పాటలు రాశాను కానీ గీత రచయితగా కెరీర్ ప్రారంభించాలని సీరియస్‌గా అనుకోలేదు. అయితే 'మహాత్మా' చిత్రంలో నా చేత 'నీలపురి గాజులు' పాటను కృష్ణవంశీగారు రాయించడం, అది పాపులర్ కావడంతో రచయితగా ప్రయత్నాలు ముమ్మరం చేశాను.

ఆ పాట మిమ్మల్ని రచయితగా నిలబెట్టిందా?

నిజం చెప్పాలంటే అంత హిట్ పాట రాసినా ఏడాది వరకూ నాకు అవకాశాలు లేవంటే నమ్మండి. ఆ పాట రాసింది నేనే అన్న విషయం చాలా మందికి తెలిసేది కాదు. అయినా ఒక మంచి పాట రాశాను అనే ధైర్యంతో పరిశ్రమలో అందరినీ కలిసేవాణ్ణి. ఆ క్రమంలో మారుతిగారు పరిచయమయ్యారు. ఆయన అప్పటికి పరిశ్రమలోకి రాలేదు. యాడ్స్ చేస్తుండేవారు. వాటికి నేను పాటలు రాసేవాణ్ణి. ఒకసారి మాటల మధ్యలో 'నాకు నీలపురి గాజులు పాట అంటే ఇష్టం. అలాంటి పాటలు కావాలి' అన్నారు. ఆ పాట రాసింది నేనే అని చెప్పగానే ఆశ్చర్యపోయారు. అప్పుడు తను తీస్తున్న 'ఈరోజుల్లో' చిత్రంలో నాతో పాటలు రాయించారు. వరుసగా 15 సినిమాల్లో నాతో పాటలు రాయించి ప్రోత్సహించారు. అప్పటి నుంచి నా ఎదుగుదల మొదలైంది.

తెలంగాణ యాసలో పాట రాయాలంటే ఇప్పుడు మీ పేరే చెబుతారు. అది మీకు ప్లస్సా, మైనస్సా?

'నీ మీద ఒక ముద్ర పడకుండా చూసుకో..' అని తోటి రచయితలు, సీనియర్స్ మొదట్లో సలహా ఇచ్చారు. అన్ని పాటలూ రాయగల సత్తా నీకు ఉంది కనుక జానపద రచయితగా ముద్ర పడకుండా చూసుకో అని కూడా చెప్పారు. ఏదో లేదు అని ప్రయత్నాలు చేసే బదులు నా కంటూ ఒక ముద్ర వేసుకుని, ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న తర్వాత అప్పుడు రకరకాల జానర్స్‌లో పాటలు రాస్తే బాగుంటుందని నాకు అనిపించింది. ముద్ర పడినా పర్వాలేదు అనే మొండి నమ్మకంతో ముందడుగు వేశాను.

మీ కెరీర్‌లో బాగా కష్టపెట్టిన పాట ఏమన్నా ఉందా?

ఆ సినిమాలు ఆడలేదు, పాటలకు అంత గుర్తింపు లేదు కానీ నన్ను నేను కష్టపెట్టుకున్న పాటలు రెండు ఉన్నాయి. శ్రీహరిగారి చివరి చిత్రం 'రియల్ స్టార్' వాటిల్లో ఒకటి. దానికి అంతకుముందు 'ఛాయ్ సమోసా బిస్కెట్' అనే టైటిల్ ఉండేది. అందులో ఇరానీ ఛాయ్ గురించి, హోటల్ గురించి ఓ పాట రాశాను. ఇకపై ఇరానీ ఛాయ్ గురించి ఎవరైనా పాట రాయాలంటే నా పాటను రిఫరెన్స్‌గా తీసుకోక తప్పదనే కసితో ఆ పాట రాశాను. అలాగే 'పేపర్ బాయ్' చిత్రంలో. ఇంతవరకూ ఏ రచయిత టచ్ చేయని పేపర్ బాయ్ లైఫ్ గురించి పాట రాశాను. ఇవి రెండూ నన్ను నేను బాగా కష్టపెట్టుకుని, రీసెర్చ్ చేసి రాసిన పాటలు. నాకు ఇష్టమైన పాటలు కూడా.

> **మీ ఫ్యామిలీ గురించి చెప్పండి**
>
> 
>
> నా భార్య పేరు రాధిక. తను ఆర్కిటెక్ట్. నాకు ఇద్దరు పిల్లలు. పెద్దబ్బాయి అమెరికాలో ఎం.ఎస్. చేస్తున్నాడు. చిన్నబ్బాయి సెవెన్త్ క్లాస్. వాడు పాడతాడు. నాన్నగారి నట వారసత్వం వచ్చింది.. భోళా శంకర్, ఫ్యామిలీ స్టార్, డాకూ మహారాజ్ తదితర చిత్రాల్లో నటించాడు. ఇప్పుడు 'ప్యారడైజ్'లో చేస్తున్నాడు.

గీత రచయితల్లో మిమ్మల్ని విరాట్ కోహ్లితో పోలుస్తుంటారట. నిజమేనా?

(నవ్వు) 'భీష్మ' సమయంలో దర్శకుడు వెంకీ కుడుముల చివరి క్షణాల్లో పాట రాసి ఇవ్వాల్సిందే అని చెప్పారు. ముందు పల్లవి ఇస్తే దాన్ని షూట్ చేసుకుంటాం. తర్వాత చరణాలు ఇవ్వవచ్చు అన్నారు. 'ఇంత హడావుడి పెడితే పాట బాగా రాయలేను సార్.. అన్నా. 'మిమ్మల్ని ఎంత హడావుడి చేస్తే అంత బాగా రాస్తారు. మీరు విరాట్ కోహ్లీలాంటి వారు' అని ఆయన అన్నారు. అవునా అని నాలో నేనే మురిసిపోయి ఆ పాట రాశా. నిజంగానే ఆ పాట బాగా వచ్చింది. వెంకీ గారు నాకు ఇచ్చిన ముద్దు పేరు అది.

గీత రచయితల్లో మీరు అభిమానించేది ఎవరిని?

పాత తరం రచయితల్లో చాలా వైవిధ్యంగా కనిపించే ఆరుద్ర నాకు చాలా ఇష్టం. రచయిత అంటే ఇలాగే ఉండాలా అనిపించే ఆయన గెటప్ నన్ను ఆకర్షించింది. ఆ తర్వాత నేను అభిమానించే రచయిత చంద్రబోస్‌గారు. మా వరంగల్ జిల్లా నుంచి చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి, చిన్న వయసులోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న గీత రచయిత ఆయన. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చి సామాన్యులకు ఎలా చేరువ అయ్యారో, అలాగే సినిమా పాటను సామాన్యుల దగ్గరకు తీసుకువెళ్లిన రచయిత చంద్రబోస్. ఆయన పాటలు వింటుంటే పాట రాయడం ఇంత ఈజీనా అనిపించేది. కానీ రాయడం ఎంత కష్టమో నేను రచయితనయ్యాక తెలిసింది.

మీకు పోటీ ఎవరు?

కొత్తగా ఎలా ఆవిష్కరించుకోవాలా అని నాతో నేనే పోటీ పడుతుంటాను. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ రాసిన పాటలు నా శైలికి చాలా దగ్గరగా ఉంటాయి. అవి వింటుంటే 'అరే ఇవి కదా నేను రాయాల్సినవి' అనుకుంటుంటాను. అందుకే ఆయన పాటల్ని పోటీగా తీసుకునేవాణ్ణి. మా గీత రచయితలందరి మధ్య మంచి స్నేహ సంబంధం ఉంది. నాకు ఏమన్నా సందేహం వస్తే చంద్రబోస్‌కు ఫోన్ చేసి అడుగుతుంటాను. సీతారామశాస్త్రిగారి చివరి రోజుల్లో ఆయనతో చాలా సన్నిహితంగా మెలిగేవాణ్ణి. 'రాములో రాముల' పాట విని ఆయన నన్ను ఎంతో అభినందించారు. 'ఇది నిజంగా శ్యామనామ సంవత్సరం రా' అని దీవించారు.

జీవితంలో మీరు మరచిపోలేని సంఘటన?

సీతారామశాస్త్రిగారితో నాది రుణానుబంధం అనుకుంటాను. 'పక్కా కమర్షియల్' సినిమాలో టైటిల్ సాంగ్ మొదట నాతో రాయించారు. అది ఓకే అయినా కూడా శాస్త్రిగారి పాట ఉంటే బాగుంటుందని నేను రాసిన పాట పక్కన పెట్టి ఆయనతో రాయించారు దర్శకనిర్మాతలు. పాట మిస్ అయిందే అనే భావన కలిగినా నా బదులు గురువుగారే కదా రాసింది అని సరిపెట్టుకున్నాను. ఆయన చివరి రోజుల్లో 'భీమ్లా నాయక్'లో గురువుగారు రాయాల్సిన పాట నేను రాయాల్సి వచ్చింది. ఆయన రుణం ఉంచుకోలేదు. తీర్చుకుని వెళ్లిపోయారు అనుకున్నా. ఇది నా జీవితంలో మరచిపోలేని సంఘటన.

హీరోల పరంగా మీకు వచ్చిన ప్రశంసలు ఏమిటి?

'రాజా ది గ్రేట్'లో 'ఎన్నియలో ఎన్నియలో' పాట రాశాను. అది విని రవితేజ నన్ను అభినందించారు. 'రాములో రాముల'ను అల్లు అర్జున్ గారు మెచ్చుకున్నారు. కల్యాణ్‌రామ్‌గారికి నేను రాసిన 'బంబాట్'పాట చాలా ఇష్టం. 'నా జీవిత కాలంలో సరిపోయే హిట్స్ అన్నీ 'దసరా'లో ఇచ్చాడు'.. అని నాని అన్న అభినందించారు. నిర్మాతల్లో స్రవంతి రవికిశోర్‌గారు, హారిక హాసిని చినబాబు గారు.. నాకు రెగ్యులర్‌గా ఫోన్ చేసి నా పాటలను అభినందిస్తుంటారు.

- వినాయకరావు

విడుదలకు గ్రాఫిక్స్ గండం

వీఎఫ్ఎక్స్.. వీటి వల్ల చాలామంది టాలీవుడ్ అగ్రహీరోల సినిమాల విడుదల పదే పదే వాయిదా పడుతున్నాయి. ప్రతి హీరో తమ సినిమాలో వీఎఫ్ఎక్స్ తప్పనిసరిగా ఉండాలని భావిస్తూ ఉండటం వల్ల బడ్జెట్ పెరగటంతో పాటుగా వీఎఫ్ఎక్స్ అనుకున్న సమయానికి అందకపోతే విడుదలే వాయిదా పడిపోతోంది. దీని వల్ల నిర్మాతలు తీవ్రమైన నష్టాలు ఎదుర్కొంటున్నారు.



ఒకప్పుడు ప్రేమకథలు బాక్సాఫీసు దగ్గర సత్తా చాటేవి. కానీ ఇప్పుడు అదే తరహా చిత్రాలు ప్రేక్షకులను థియేటర్లకు రప్పించలేకపోతున్నాయి. కథ ఎలా ఉన్నా.. దాని నేపథ్యం భారీగా ఉండకపోతే ప్రేక్షకులు థియేటర్లకు రావటం లేదు. దీనితో ఎక్కువ మంది దర్శకులు ఈ నేపథ్యాలను సృష్టించటానికి వీఎఫ్ఎక్స్‌పై ఆధారపడుతున్నారు. చారిత్రక, పౌరాణిక చిత్రాలకే కాదు రొటీన్ సన్నివేశాలకు కూడా వీఎఫ్ఎక్స్‌ను అద్దాలని ప్రయత్నిస్తున్నారు. అగ్రహీరోలు మాత్రమే కాకుండా మీడియం రేంజ్ ఉన్న హీరోలు కూడా కథగమనానికి వీటిపై ఆధారపడుతున్నారు. ఒక వేళ వీఎఫ్ఎక్స్ సరైన సమయంలో అందుబాటులోకి రాకపోతే మొత్తానికే మోసం వచ్చే పరిస్థితి ఏర్పడింది. ఉదాహరణకు చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న 'విశ్వంభర' ఈ ఏడాది సంక్రాంతి బరిలో దిగాల్సింది. సంక్రాంతికి మిస్సయినా సమ్మర్‌కు వస్తుందనుకున్నారు. వీఎఫ్ఎక్స్‌లో జాప్యం జరగటం వల్ల ఈ చిత్రం విడుదల ఆలస్యమవుతూ వస్తోంది. ప్రభాస్ నటించిన 'రాజా సాబ్', తేజా సజ్జ నటించిన 'సరాయ్' చిత్రాల విడుదల కూడా వీఎఫ్ఎక్స్ పనులు అనుకున్నట్లు జరగకపోవటం వల్లే జాప్యం జరుగుతోందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

> చాలామంది వీఎఫ్ఎక్స్ (విజువల్ ఎఫెక్ట్స్), సీజీఐ (కంప్యూటర్- జనరేటెడ్ ఇమేజరి) ఒక్కటే అనుకుంటారు. కానీ ఈ రెండింటికీ చాలా తేడా ఉంది. సీజీఐ అనేది వీఎఫ్ఎక్స్‌లో ఒక భాగం మాత్రమే. సీజీఐలో మనం రియల్‌లైఫ్‌లో చూడలేనివి, షూట్ చేయలేనివి కంప్యూటర్ ద్వారా సృష్టిస్తారు. వాటికి మూమెంట్స్ ఇవ్వడాన్ని యానిమేషన్ అంటారు. సీజీఐలో పనులు ఒక క్రమపద్ధతిలో జరుగుతాయి. మోడలింగ్, టెక్చరింగ్, రిగ్గింగ్, యానిమేషన్, లైటింగ్, ఎఫ్ఎక్స్ లాంటి పలు విభాగాలు ఇందులో ఉంటాయి.

> హాలీవుడ్‌లో స్టోరీ బోర్డ్, యానిమేషన్ ప్రాసెస్‌ను అనుసరిస్తారు. దాన్నిబట్టి మూవీ అవుట్‌పుట్ అనుకున్న విధంగా రాబడతారు. సినిమా షూటింగ్ ప్రారంభించడానికి ముందే ముఖ్యమైన సీజీ షాట్స్‌ను యానిమేట్ చేయించి పెట్టుకుంటారు. దీనివల్ల యానిమేటర్స్‌కు ఆ సీన్‌లో ఎలాంటి ఎఫెక్ట్స్ పెట్టాలనేది ముందే తెలుస్తుంది. దానివల్ల మంచి అవుట్‌పుట్ వస్తుంది. మనదగ్గర ఇంకా ఈ విధానం అంతగా వాడుకలోకి రాలేదు.

> వీఎఫ్ఎక్స్‌లో గ్రీన్‌మ్యాట్, బ్లూమ్యాట్‌ను ఉపయోగించి కావలసిన సన్నివేశాన్ని షూట్ చేస్తారు. అందులో నుంచి బ్యాగ్రౌండ్‌ను తొలగిస్తారు. కొన్ని ఫిల్టర్‌లు ఉపయోగించి, దాని స్థానంలో తమకు కావలసిన విజువల్‌ను వచ్చేలా చేస్తారు. సన్నివేశాన్ని బట్టి సెన్సార్లు, మోషన్ క్యాప్చర్స్ సూట్స్, ట్రాకింగ్, త్రీడీ మోడల్స్ లాంటి అధునాతన పరిజ్ఞానాన్ని ఇందులో ఉపయోగిస్తారు. ఈ మధ్యకాలంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) పద్ధతులను సినీ నిర్మాణానికి వాడటం మొదలయింది. కథా రచన నుంచి సంగీతం, పాటలు, లొకేషన్లు, పాత్రధారుల రూపకల్పన, గొంతు ఇలా ప్రతి దానికి ఏఐ టూల్స్‌ను వాడుతున్నారు.

సగం బడ్జెట్ గ్రాఫిక్స్‌కే

దర్శకుడు విఠలాచార్య తన సినిమాల్లో కొన్ని టెక్నిక్స్ వాడి గ్రాఫిక్స్‌ను తలదన్నే సన్నివేశాలను అప్పట్లోనే తెరకెక్కించారు. అయితే కథ డిమాండ్ చేస్తే తప్ప దర్శక నిర్మాతలు గ్రాఫిక్స్ గురించి ఆలోచించేవారు కాదు. ఇప్పుడు హాలీవుడ్ నుంచి టాలీవుడ్ దాకా సినిమాల్లో గ్రాఫిక్స్ ప్రాధాన్యం బాగా పెరిగింది. వీఎఫ్ఎక్స్ వర్క్ కోసం భారీగా ఖర్చుపెట్టి తీస్తున్న సినిమాల సంఖ్య చాలా ఎక్కువైంది. కోడి రామకృష్ణ దర్శకత్వం వహించిన 'దేవి, అమ్మోరు' చిత్రాలు గ్రాఫిక్స్ పరంగా ఆనాటి ప్రేక్షకులను అబ్బురపరిచాయి. ఇక దర్శకుడు రాజమౌళి తెరకెక్కించిన బాహుబలి' చిత్రాలు వీఎఫ్ఎక్స్ పరంగా ఓ ట్రెండ్‌ను సెట్ చేశాయి. ఆ సినిమా నుంచే వీఎఫ్ఎక్స్‌తో రూపొందే చిత్రాల సంఖ్య విపరీతంగా పెరిగింది. క్వాలిటీ పేరుతో సుదీర్ఘంగా సాగుతున్న వీఎఫ్ఎక్స్ పనులతో సినిమా బడ్జెట్ అమాంతం పెరుగుతూ నిర్మాతలను ఇబ్బందులకు గురిచేస్తోంది. సగం బడ్జెట్‌ను విజువల్ ఎఫెక్ట్స్‌కు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు.

కుంకుడుతో ఇలా కూడా..!

ఒకప్పుడు కుంకుడుకాయలను నీళ్లలో నానబెట్టి రసం తీసి తలస్నానానికి ఉపయోగించేవారు. ప్రస్తుతం ఇలాచేసేవారు తగ్గినప్పటికీ ఇతరత్రా పనులకు కుంకుళ్ల వినియోగంపెరిగింది.కుంకుడుకాయలను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో తెలుసుకుందాం...

- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి అయిదు కుంకుడు కాయలు వేసి పావుగంటసేపు మరగనివ్వాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. కుంకుడుకాయలను బాగా పిసికి రసాన్ని వడబోయాలి. ఇందులో ఏదైనా అరోమా నూనె చుక్కలు వేసి కలపాలి. తరవాత ఒక గాజు బాటిల్‌లో పోసి ఫ్రిజ్‌లో భద్రపరచుకోవాలి. దీనిని స్నానం చేసేటప్పుడు లిక్విడ్ సోప్‌లా ఉపయోగించుకోవచ్చు. జిడ్డు చర్మం ఉన్నవారికి మొటిమలు ఎక్కువగా వచ్చినప్పుడు.... ముఖాన్ని సబ్బుకు బదులు ఈ కుంకుడు రసంతో తోముకుని శుభ్రం చేసుకుంటే ప్రయోజనం కనిపిస్తుంది.



- ఒక గిన్నెలో అర కప్పు నీళ్లు, రెండు చెంచాల కుంకుడు రసం, రెండు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి ఉంచుకోవాలి. కిటికీల అద్దాలు, డ్రెస్సింగ్ మిర్రర్, ఇతర గాజు సామాన్ల మీద దీన్ని కొద్దిగా స్ప్రే చేసి పలుచని గుడ్డ లేదా కాగితంతో తుడవాలి. దీంతో దుమ్ము పూర్తిగా తొలగిపోయి అద్దాలు, సామాన్లు చక్కగా మెరుస్తాయి. అలాగే గ్యాస్ స్టవ్, వాష్‌బేసిన్ తదితరాలను కూడా శుభ్రం చేసుకోవచ్చు.
- ఒక బకెట్ నీళ్లలో గుప్పెడు కుంకుడుకాయలు వేసి అరగంటసేపు నాననివ్వాలి. తరవాత కుంకుళ్లను గట్టిగా పిసికి పిప్పిని తీసివేయాలి. ఈ నీళ్లలో జరీ వస్త్రాలు, నాజూకైన దుస్తులు, ఎంబ్రాయిడరీ లేదా జర్దోసి వర్క్ చేసిన జాకెట్లు-చీరలు, క్రషడ్ సిల్క్ దుస్తులను కొంచెం సేపు నానబెట్టాలి. తరవాత మంచి నీళ్లలో ముంచి తీస్తే అవి పూర్తిగా శుభ్రపడతాయి.
- ఒక గ్లాసు కుంకుడు రసంలో బంగారు, వెండి ఆభరణాలు వేసి అరగంటసేపు ఉంచాలి. తరవాత మెత్తని బ్రష్‌తో రుద్ది కడిగితే మురికి వదిలిపోయి కొత్తవాటిలా మెరుస్తాయి.

జ్యోతికి పసిడి

- రిలేలో నిత్య బృందానికి స్వర్ణం
- తైవాన్ అథ్లెటిక్స్





తైపీ సిటీ: తైవాన్ ఓపెన్ అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో భారత క్రీడాకారులు సత్తా చాటారు. ఏకంగా ఆరు స్వర్ణాలు కొల్లగొట్టారు. వీరిలో తెలుగమ్మాయిలు ఉండడం విశేషం. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజి 100 మీటర్ల హర్డిల్స్‌లో 12.99 సెకన్ల టైవింగ్‌తో పసిడి పతకం అందుకొంది. మహిళల 110 మీటర్ల హర్డిల్స్‌లో తేజాస్ షిర్సే 13.52 సెకన్లతో స్వర్ణం సాధించగా.. మహిళల 1500 మీటర్ల రేసులో పూజ (4 నిమిషాల 11.63 సెకన్లు), పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబాకర్ (16.21 మీటర్లు) విజేతలుగా నిలిచారు. ఇక, 4×100 మీటర్ల రిలే ఈవెంట్లలో తెలంగాణకు చెందిన నిత్య గంధె, సుదీక్ష వడ్లూరి, స్నేహ సత్యనారాయణ షనువల్లి, అబినయ రాజరాజన్‌లతో కూడిన మహిళల జట్టు (44.06 సెకన్లు).. గుర్విందర్, అనిమేశ్, మనికంఠ, అమ్లాన్‌లతో కూడిన పురుషుల బృందం (38.75 సె) పసిడి పతకాలు దక్కించుకొన్నారు.

హాకీలో ఓటమితో షురూ

ఆమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్): ఎఫ్ఐహెచ్ హాకీ ప్రొ లీగ్ యూరప్ లెగ్‌ను భారత పురుషుల జట్టు ఓటమితో ప్రారంభించింది. శనివారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 1-2తో ఆతిథ్య నెదర్లాండ్స్ చేతిలో పరాజయం పాలైంది.

నల్లకలువదే ఎర్రకోట

ఫ్రెంచ్ ఓపెన్ విజేత కొకొ గాఫ్
ఫైనల్లో సబలెంకకు నిరాశ

ఇద్దరూ ఇద్దరే.. ఒకరు వరల్డ్ నెంబర్ వన్ సబలెంక, మరొకరు వరల్డ్ నెంబర్ టూ కొకొ గాఫ్. బరిలోకి దిగిన పదిసార్లు కూడా సమాన విజయాలే. గ్రాండ్‌స్లామ్స్‌లోనే కాదు.. క్లే కోర్టుల్లోనూ తలపడిన రెండేసిసార్లూ పైచేయి. అలాంటి వీళ్లు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో బరిలోకి దిగితే ఎలా ఉంటుంది? అంచనాలకు తగ్గట్టుగానే ఇద్దరూ నువ్వా.. నేనా? అనే రీతిలో ఆడి అభిమానులను ఉర్రూతలూగించారు. అయితే ఆఖరి పోరాటంలో చివరకు నల్ల కలువ గాఫ్‌కే ఫ్రెంచ్ కిరీటం దక్కింది. గెలుపు అవకాశాలను చేజార్చుకున్న సబలెంక రన్నరప్‌తో సరిపెట్టుకుంది.


కొకొ గాఫ్


సబలెంక



ప్రైజ్‌మనీ
కొకొ గాఫ్‌కు రూ.24.87 కోట్లు
సబలెంకకు రూ.12.43 కోట్లు

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో కొత్త చాంపియన్‌గా కొకో గాఫ్ నిలిచింది. శనివారం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో 21 ఏళ్ల ఈ అమెరికన్.. 6-7 (5-7), 6-2, 6-4తో వరల్డ్ నెంబర్ 1 ఎరీనా సబలెంక (బెలారస్)ను ఓడించి ఎర్రకోటలో పాగా వేసింది. గాఫ్ కెరీర్‌లో ఇదే తొలి ఫ్రెంచ్ ఓపెన్ కాగా.. ఆమెకిది రెండో గ్రాండ్‌స్లామ్. 2023లో యూఎస్ ఓపెన్ గెలిచింది. అలాగే 2015లో సెరెనా తర్వాత మరో యూఎస్ క్రీడాకారిణి ఇక్కడ నెగ్గడం ఇదే మొదటిసారి. అంతేకాకుండా సెరెనా (2002లో) తర్వాత ఫ్రెంచ్ ఓపెన్‌ను గెలిచిన యంగెస్ట్ అమెరికన్‌గానూ గాఫ్ నిలిచింది. ఇక సబలెంక కెరీర్‌లో ఆస్ట్రేలియన్, యూఎస్ ఓపెన్ గెలిచినా ఇప్పటిదాకా ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గలేకపోయింది. ఈ పోరులో సబలెంక 70 అనవసర తప్పిదాలకు పాల్పడి మూల్యం చెల్లించుకుంది. గాఫ్ 9 బ్రేక్ పాయింట్లు, 3 ఏస్‌లతో చెలరేగింది.

హోరాహోరీగా..: తొలి సెట్‌లో సబలెంక శక్తివంతమైన బేస్‌లైన్ ఆటతీరుతో పాటు గాఫ్ పదునైన సర్వీస్ రిటర్న్‌లతో పోరు రంజుగా సాగింది. సుదీర్ఘ ర్యాలీలు, డ్యూస్‌ల కారణంగా ఈ సెట్ గంటా 18 నిమిషాలు సాగింది. తొలి పాయింట్ గాఫ్‌దే అయినా సబలెంక ప్రత్యర్థి సర్వీస్‌లను బ్రేక్ చేస్తూ ఓ దశలో 4-1తో స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. కానీ తర్వాత పుంజుకున్న గాఫ్ వరుసగా 3 పాయింట్లతో స్కోరును సమం చేసింది. ఇక్కడి నుంచి కోర్టులో చిరుతల్లా ఇద్దరూ తలపడ్డారు. ఫలితంగా సెట్ 6-6తో టైబ్రేక్‌కు వెళ్లింది. ఇందులో సబలెంక ఆరంభంలో వెనుకబడినా పట్టు వదలకుండా ఆడి సెట్‌ను 7-6తో ముగించింది. అయితే కీలక రెండో సెట్‌లో చెలరేగిన గాఫ్ 35 నిమిషాల్లోనే 6-2తో గెలిచి పోటీలో నిలిచింది. ఇక నిర్ణాయక సెట్ తిరిగి రసవత్తరంగా మారింది. మొదట గాఫ్ బ్రేక్ పాయింట్లతో 3-1తో హవా చూపింది. ఈ దశలో సబలెంక ఒత్తిడిని అధిగమిస్తూ గాఫ్ సర్వీస్‌ను బ్రేక్ చేస్తూ 3-3తో సవాల్ విసిరింది. కానీ సబలెంక అనవసర తప్పిదాలను సొమ్ము చేసుకుంటూ గాఫ్ రెండు వరుస పాయింట్లు ఖాతాలో వేసుకుంది. అయితే తొమ్మిదో గేమ్‌ను సబలెంక దక్కించుకున్నా.. 5-4 ఆధిక్యంతో గాఫ్ చాంపియన్‌షిప్ సర్వీస్‌కు దిగింది. ఇందులో సబలెంక పోరాడినా తన బ్యాక్ హ్యాండ్ విన్నర్‌ను బయటకు కొట్టడంతో.. గాఫ్ విజేతగా నిలిచింది.



సెమీస్‌లో జొకోవిచ్ ఓటమి

ఫైనల్లో సినర్
అల్కారజ్‌తో అమీతుమీ నేడు
సా.6.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..





రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన ఆరో సీడ్ జొకోవిచ్‌కు చుక్కెదురైంది. శుక్రవారం రాత్రి హోరాహోరీగా జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో వరల్డ్ నెంబర్‌వన్ జానిక్ సినర్ చేతిలో జొకో 4-6, 5-7, 6-7 (3-7) తేడాతో వరుస సెట్లలో ఓడిపోయాడు. ఆద్యంతం దూకుడు కనబర్చిన సినర్.. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరడం ఇదే తొలిసారి. అలాగే ఓపెన్ ఎరాలో ఎడ్రియానో పనట్టా తర్వాత ఈ మెగా టోర్నీ తుదిపోరుకు చేరిన రెండో ఇటాలియన్‌గా సినర్ నిలిచాడు. మరోవైపు ఈ సీజన్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ 39 ఏళ్ల జొకోపై సినర్‌దే ఆధిపత్యం. ఇక 3 గంటల 16 నిమిషాలపాటు సాగిన సెమీస్‌లో సినర్ 10 ఏస్‌లతో చెలరేగాడు. అటు జొకో నాలుగు ఏస్‌లకే పరిమితమయ్యాడు. అయితే తొలి సెట్‌లో తేలిపోయినా చివరి రెండు సెట్లలో జొకో గట్టిగానే పోరాడాడు. కానీ తనకన్నా 15 ఏళ్ల చిన్నవాడైన సినర్ పదునైన సర్వీస్‌ల ముందు నిలబడలేక చేతులెత్తేశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్‌తో సినర్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

జొకోకు ఇక్కడ ఇదే ఆఖరు!

తనకు ఇదే చివరి ఫ్రెంచ్ ఓపెన్ అంటూ జొకోవిచ్ సంకేతాలిచ్చాడు. 'ఇక్కడ నేను ఆడిన చివరి మ్యాచ్ ఇదే కావచ్చేమో. నాకైతే తెలీదు. మరో ఏడాది తర్వాత రోలాండ్ గారోస్‌లో ఆడేందుకు శరీరం సహకరిస్తుందో లేదో?. అందుకే ఆట పూర్తయ్యాక భావోద్వేగానికి లోనయ్యా' అని మ్యాచ్ అనంతరం 38 ఏళ్ల జొకో అన్నాడు. అయితే, ఈ నెలాఖరులో మొదలయ్యే వింబుల్డన్, ఆగస్టులో జరిగే యూఎస్ ఓపెన్‌లో మాత్రం ఆడతానని స్పష్టం చేశాడు.

గుకేష్, హంపికి మూడో స్థానం

నార్వే చెస్ విజేతలు కార్ల్‌సన్, ముజిచుక్





స్టావంజర్ (నార్వే): ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నీ పురుషులు, మహిళల విభాగాలలో భారత గ్రాండ్‌మాస్టర్లు గుకేష్, హంపి మూడో స్థానంలో నిలిచారు. ఫాబియానో కరువానా (అమెరికా)తో చివరి రౌండ్‌లో తీవ్రమైన తప్పిదంతో గుకేష్ ఓటమి పాలయ్యాడు. ఇక..ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ రికార్డు స్థాయిలో ఏడోసారి 'నార్వే' విజేతగా నిలిచాడు. కరువానాతో పదో రౌండ్‌లో సింహభాగం గుకేష్ వెనుకంజలోనే నిలిచాడు. అయితే చివరి దశలో పుంజుకొనే ప్రయత్నం చేశాడు. కానీ సమయాభావంతో ఒత్తిడిలో పడిన భారత గ్రాండ్‌మాస్టర్ ఎత్తు వేయడంలో చేసిన పెద్ద తప్పిదం అతడి ఓటమికి బాటలు వేసింది. దాంతో పది రౌండ్ల ద్వారా మొత్తం 14.5 పాయింట్లు సాధించిన గుకేష్ మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. చివరి రౌండ్‌లో మరో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసితో గేమ్‌ను డ్రా చేసుకున్న డిఫెండింగ్ చాంపియన్ కార్ల్‌సన్ టైబ్రేకర్‌లో గెలిచాడు. ఫలితంగా మొత్తం 16 పాయింట్లతో మాగ్నస్ టైటిల్ నిలబెట్టుకున్నాడు. కరువానా (15.5) రెండో స్థానం చేజిక్కించుకున్నాడు. ఆరుగురు గ్రాండ్‌మాస్టర్లు తలపడిన ఈ టోర్నీలో అర్జున్ (13) ఐదో స్థానంలో నిలిచాడు.

చివరి రౌండ్‌లో గెలిచినా..: మహిళల విభాగం పదో రౌండ్‌లో ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)ను టైబ్రేకర్‌లో హంపి చిత్తు చేసింది. అయితే మొత్తం 15 పాయింట్లతో హంపి మూడో స్థానానికే పరిమితమైంది. అనా ముజిచుక్ (ఉక్రెయిన్- 16.5) టైటిల్ కైవసం చేసుకుంది. లీ టింగ్ జీ (చైనా, 16) రెండో స్థానం దక్కించుకుంది. చివరి రౌండ్‌లో ముజిచుక్‌ను టైబ్రేకర్‌లో ఓడించిన వైశాలీ (11) ఐదో స్థానంలో నిలిచింది.

బట్లర్ సెంచరీ మిస్

తొలి టీ20లో విండీస్‌పై ఇంగ్లండ్ గెలుపు



చెస్టర్ లీ స్ట్రీట్: కీపర్ బట్లర్ (59 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 96) బ్యాటింగ్‌లో, స్పిన్నర్ లియామ్ డాసన్ (4/20) బౌలింగ్‌లో అదరగొట్టడంతో వెస్టిండీస్‌తో తొలి టీ20లో ఇంగ్లండ్ 21 పరుగులతో నెగ్గింది. తొలుత ఇంగ్లండ్ 20 ఓవర్లలో 188/6 స్కోరు చేసింది. జెమీ స్మిత్ (38), బెథెల్ (23 నాటౌట్) సత్తా చాటారు. రొమారియో షెఫర్డ్ (2/33) రెండు వికెట్లు తీశాడు. ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 167/9 స్కోరుకే పరిమితమై ఓడింది. ఎవిన్ లూయిస్ (39), చేజ్ (24) మాత్రమే రాణించారు. పాట్స్, బెథెల్ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

ఇంగ్లండ్ చేరిన టీమిండియా

లండన్: కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత జట్టు సుదీర్ఘ పర్యటనకోసం ఇంగ్లండ్ గడ్డపై కాలు మోపింది. 2025-27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఈ సిరీస్‌లో ఆతిథ్య జట్టుతో టీమిండియా ఐదు టెస్టులలో తలపడనుంది. శుక్రవారం రాత్రి ముంబై నుంచి బయలుదేరిన భారత్ శనివారం ఇక్కడకు చేరుకుంది. గిల్‌తోపాటు వైస్-కెప్టెన్ రిషభ్ పంత్, ఓపెనర్ సాయి సుదర్శన్, పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆల్‌రౌండర్ జడేజా తదితరులు ఈ బృందంలో ఉన్నారు. టెస్ట్ జట్టులోని ఇతర క్రికెటర్లు ఇండియా 'ఎ' పర్యటనలో భాగంగా ఇప్పటికే యూకేలో ఉన్న సంగతి తెలిసిందే.

ఇంగ్లండ్ లయన్స్ 192/3

నార్తాంప్టన్: ఎమీలియో గే (71), టామ్ హెయిన్స్ (54) అర్ధ శతకాలతో రాణించడంతో భారత్ 'ఎ'తో నాలుగు రోజుల అనధికార టెస్ట్‌లో ఇంగ్లండ్ లయన్స్ దీటైన బదులిస్తోంది. శనివారం ఆట ఆఖరికి లయన్స్ మొదటి ఇన్నింగ్స్‌లో 192/3 స్కోరు చేసింది. జోర్డాన్ కాక్స్ (31), జేమ్స్ ర్యూ (0) క్రీజులో ఉన్నారు. అన్షుల్, తుషార్, తనుష్ తలా ఒక్కో వికెట్ పడగొట్టారు. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 319/7తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఎ' 348 పరుగులకు ఆలౌటైంది.

పాత కారు అమ్ముతుంటే!

ఇదీ GST


రాంబాబు గొండాల

ప్రస్తుత ఆధునిక కాలంలో ప్రజల అభిరుచులు, అవసరాలు రోజురోజుకు మారిపోతున్నాయి. ఒకప్పుడు విలాస వస్తువు అనేది ఈ రోజు నిత్యావసరంగా మారుతోంది. అలాంటి వాటి జాబితాలో కారు ఒకటి. ఒకప్పుడు సంపన్నులకు మాత్రమే పరిమితమైన కారు ఈ రోజు మధ్య తరగతి ప్రజలకు కూడా అవసరంగా మారింది. కొత్త కార్లతో పాటుగా పాత కార్లను అమ్మటానికి ప్రముఖ కార్ల కంపెనీలన్నీ ప్రత్యేక షోరూమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. అంతేకాకుండా పాత కార్లకు కూడా బ్యాంకులు లోన్ ఇవ్వటం మొదలు పెట్టడంతో పాత కార్ల మార్కెట్ క్రమేపీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఒక డీలర్ లేదా ఏదైనా కంపెనీ షోరూమ్ పాత కారు అమ్మేటప్పుడు జీఎస్‌టీ చెల్లించాల్సి ఉందా? ఉంటే ఎంత జీఎస్‌టీ కట్టాలో చూద్దాం. కొత్త కార్లకు సంబంధించి జీఎస్‌టీ అనేది గరిష్ఠ స్లాబ్ అంటే 28 శాతంగా ఉంది. అంతేకాకుండా కేటగిరీని బట్టి గరిష్ఠంగా 15 శాతం వరకు సెస్ కూడా ఉంది. జీఎస్‌టీ వచ్చిన కొత్తలో పాత కార్లకు కూడా ఇదే విధంగా పన్ను శాతం నిర్ణయించటంతో పాత కార్ల అమ్మకందారుల్లో ఆందోళన నెలకొంది. ఆ తర్వాత రేట్లను 2018లో సవరించారు. దీని ప్రకారం పాత కార్ల మీద పన్ను శాతం కారు కెపాసిటీ, పొడవును బట్టి 12 నుంచి 18 శాతంగా నిర్ణయించటం జరిగింది.

ఇకపోతే ఈ ఏడాది జనవరిలో మళ్లీ దీనికి సవరణ చేయటం జరిగింది. కొత్త సవరణ ప్రకారం అన్ని రకాల సెకండ్ హ్యాండ్ కార్లకు పన్ను 18 శాతంగా నిర్ణయించటం జరిగింది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే ఈ విధంగా అమ్మే పాత కార్లకు ఎలాంటి సెస్ లేదు. మరి ఈ పన్ను ఎంత విలువ మీద చెల్లించాలనే దాని మీద కూడా వివరణ ఇచ్చారు. ఇది కేవలం 'మార్జిన్' మీద చెల్లిస్తే సరిపోతుంది. మరి మార్జిన్ అంటే ఏమిటి? అమ్మకపు ధర.. కొన్న ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మార్జిన్‌గా భావించాలి. ఈ వ్యత్యాసం మీద పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఒకవేళ ఆదాయ పన్ను చట్టం ప్రకారం కారు మీద డిప్రిషియేషన్ (తరుగుదల) చూపించి ఉంటే.. అమ్మకం విలువ, ఆదాయ పన్ను అకౌంట్స్ ప్రకారం అమ్మకం నాటికి కారు విలువ (డిప్రిషియేషన్ పోగా మిగిలిన విలువ) మధ్య వ్యత్యాసాన్ని కారు విలువ కింద చూపి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అదే పాత కార్ల క్రయవిక్రయాలు జరిపే డీలర్ ఒక పాత కారును ఒక వ్యక్తికి విక్రయిస్తే ఆ కారు కొన్నప్పటి విలువ, అమ్మకం విలువ మధ్య వ్యత్యాసాన్ని కారు విలువగా చూపించి దాని మీద పైన సూచించిన విధంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ వ్యత్యాసం నెగటివ్‌గా ఉంటే.. అంటే కొనుగోలు ధర కంటే అమ్మకపు విలువ తక్కువగా ఉంటే ఎలాంటి పన్ను చెల్లించనవసరం లేదు. ఒకవేళ, అమ్మకందారుడు కారు కొన్నప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకుని ఉంటే పైన చెప్పిన పన్ను ప్రయోజనం అతనికి వర్తించదు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బిజినెస్ ప్లస్



ఎఫ్‌డీ.. ఏం చేద్దాం..?

ఆర్‌బీఐ రెపో రేటు కోతలతో డిపాజిట్లపై వడ్డీ ఆదాయం తగ్గుముఖం

ఈసారి ద్రవ్య పరపతి సమీక్షలో ఆర్‌బీఐ రెపో రేటును ఏకంగా 0.50 శాతం తగ్గించింది. రుణగ్రహీతలకు ఇది శుభవార్తే. రెపో తగ్గింపుతో రుణాలు మరింత చౌకగా లభించనున్నాయి. ఇప్పటికే రుణాలు తీసుకున్న వారికి ఈఎంఐల భారం కూడా తగ్గనుంది. కానీ, డబ్బు పొదుపు చేయాలనుకునే వారికి మాత్రం ఇది ప్రతికూల పరిణామమే. ఎందుకంటే, రెపో కోతతో రుణ రేట్లతో పాటు డిపాజిట్ రేట్లూ తగ్గుముఖం పట్టనున్నాయి. అంటే, ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై లభించే వడ్డీ ఆదాయం మరింత తగ్గనుంది. ఆర్‌బీఐ ఈ ఫిబ్రవరి, ఏప్రిల్‌లోనూ రెపో రేటులో 0.25 శాతం చొప్పున మొత్తం అర శాతం కోత పెట్టింది. దీంతో ఎఫ్‌డీ రేట్లు ఈ ఫిబ్రవరి నుంచి 0.30 శాతం నుంచి 0.70 శాతం స్థాయిలో తగ్గాయి. కొన్ని బ్యాంకులు ఎఫ్‌డీ రేట్లతో పాటు పొదుపు ఖాతా (సేవింగ్స్ అకౌంట్) రేట్లనూ తగ్గించేశాయి. తాజాగా రెపో కోతతో డిపాజిట్లపై వడ్డీ ప్రతిఫలం మరింత తగ్గనుంది. ముఖ్యంగా స్వల్ప, మధ్యకాలిక డిపాజిట్లపై వడ్డీ రేటును గణనీయంగా తగ్గించే అవకాశాలున్నాయని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇన్వెస్టర్లు ఏం చేయాలి..?

వడ్డీ రేట్లు తగ్గుతున్న తరుణంలో ఎఫ్‌డీ ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉండే ఆప్షన్లు చాలా పరిమితమే. వడ్డీ రాబడి భారీగా తగ్గకుండా చర్యలు చేపట్టడమే ఉత్తమ వ్యూహం.

త్వరపడండి..

ఆర్‌బీఐ రెపో తగ్గించినప్పటికీ, బ్యాంకులు డిపాజిట్లు రేట్లను తగ్గించేందుకు మరికొంత సమయం పట్టవచ్చు. కాబట్టి, కొత్తగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలనుకునేవారు త్వరపడటం మేలు. ఇప్పటికీ చాలా బ్యాంకులు ఎఫ్‌డీలపై ఆకర్షణీయ వడ్డీ ఆఫర్ చేస్తున్నాయి. 7 శాతం అంతకు పైగా వార్షిక వడ్డీ చెల్లిస్తున్నాయి.

దీర్ఘకాలిక డిపాజిట్లు

మీరు పొదుపు చేయబోయే సొమ్ము లేదా రెన్యువల్ చేయబోయే ఎఫ్‌డీ ఖాతాలోని సొమ్ముతో ఇప్పట్లో అవసరం లేదనుకుంటే.. దీర్ఘకాలానికి డిపాజిట్ చేయడం మేలు. దాంతో అధిక వడ్డీ ఆదాయం పొందే వీలుంటుంది.

స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు

పెద్ద బ్యాంకులతో పోలిస్తే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు మరింత ఆకర్షణీయ వడ్డీని ఆఫర్ చేస్తుంటాయి. అయితే, వీటిల్లో డిపాజిట్ కూడా కొంత రిస్క్‌తో కూడుకున్నదే. స్వల్పకాలానికి తక్కువ మొత్తంలో డిపాజిట్ చేయవచ్చని, దీర్ఘకాలిక ఎఫ్‌డీలకు మాత్రం బడా బ్యాంకులు లేదా పోస్టాఫీస్ పథకాలే మేలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

కార్పొరేట్ ఎఫ్‌డీలు

రిస్క్ తీసుకోగలిగే కార్పొరేట్ కంపెనీల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్లో సొమ్ము జమ చేయడం ద్వారా అధిక వడ్డీ పొందవచ్చు. మీ పొదుపు సొమ్ములో కొంత మొత్తాన్ని 2-3 ఏళ్ల కాలపరిమితితో కూడిన కార్పొరేట్ బాండ్లలో ఇన్వెస్ట్ చేయవచ్చు. అయితే, ఉత్తమ రేటింగ్ కలిగిన ప్రముఖ కంపెనీల బాండ్లను మాత్రమే ఎంచుకోవాలి.

డెట్ ఫండ్లు

డెట్ మ్యూచువల్ ఫండ్లు, కార్పొరేట్, గవర్నమెంట్ సెక్యూరిటీలు కూడా మంచి ప్రత్యామ్నాయాలు. స్వల్పకాలిక ఎఫ్‌డీ పథకాల కంటే అధిక రిటర్నులు అందుకునే అవకాశం ఉంటుంది. అయితే, ఇవన్నీ ఎంతో కొంత రిస్క్‌తో కూడినవే.

ఐటీఆర్-1, ఐటీఆర్-2 ఎంచుకోవడం ఎలా!

ఐటీ రిటర్నుల ఫైలింగ్‌కు రంగం సిద్ధమైంది. ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ఇప్పటికే అన్ని ఐటీఆర్ ఫారాలను విడుదల చేసింది. ఏటా జూలై నెలాఖరు వరకు ఉండే రిటర్నుల ఫైలింగ్ గడువును ప్రభుత్వం ఈ సంవత్సరం సెప్టెంబరు 15 వరకు పొడిగించింది. అయితే చాలా మంది ఉద్యోగుల్లో తాము ఐటీఆర్-1 ఫైల్ చేయాలా? లేక ఐటీఆర్-2 ఫైల్ చేయాలా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



ఈ నెల 15లోగా ఉద్యోగులకు ఫారమ్-16, ఫారమ్-16ఏ అందుబాటులోకి వస్తాయి. అప్పటి నుంచి వారు తమ ఐటీ రిటర్నుల ఫైలింగ్ ప్రారంభించవచ్చు. 2025-26 అసెస్‌మెంట్ ఇయర్ (ఈవై)కు సంబంధించిన ఐటీ రిటర్న్ ఫారాల్లో ప్రభుత్వం కొన్ని మార్పులు చేర్పులు చేసింది. గత ఏడాది వరకు జీతం/పెన్షన్ ఆదాయం, లేదా ఒక ఇంటిపై వచ్చే అద్దె ఆదాయం, సేవింగ్/ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ), డివిడెండ్లు, వార్షిక వ్యవసాయ ఆదాయం రూ.5,000 కంటే తక్కువ ఉంటే ఐటీఆర్-1 (సహజ్) రిటర్న్ ఫైల్ చేస్తే సరిపోయేది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లిస్టెడ్ కంపెనీల ఈక్విటీ షేర్లు లేదా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల అమ్మకంపై వచ్చిన వార్షిక దీర్ఘకాలిక మూలధన లాభాలు (ఎల్‌టీసీజీ) రూ.1.25 లక్షల వరకు ఉన్న వ్యక్తులు కూడా ఐటీఆర్-1 ఫారమ్ ద్వారా తమ రిటర్నులు ఫైల్ చేయాల్సి ఉంటుంది.

ఐటీఆర్-1

జీతం/పెన్షన్ తప్ప క్లిష్టమైన ఆర్థిక లావాదేవీలు లేని వ్యక్తులు ఐటీఆర్-1 (సహజ్) ద్వారా తమ రిటర్న్ ఫైల్ చేయడం మంచిది. ఈ ఫారమ్‌లో ఆయా వ్యక్తుల వ్యక్తిగత సమాచారం, ఆదాయ వివరాలు, గత ఆర్థిక సంవత్సరంలో వారు జరిపిన ఆర్థిక లావాదేవీల వివరాలు ముందుగానే పూర్తి చేసి ఉంటాయి. కాకపోతే పన్ను చెల్లింపుదారులు ఈ వివరాలను తమ ఫారమ్-16, బ్యాంకు స్టేట్‌మెంట్లు, ఫారమ్-26ఏ, వార్షిక సమాచార స్టేట్‌మెంట్ (ఏఐఎస్)లోని వివరాలతో సరిచూసుకోవాలి.

ఐటీఆర్-1కు అర్హత

- స్వదేశంలో నివసించే వ్యక్తులై ఉండాలి
- వార్షిక ఆదాయం రూ.50 లక్షలకు మించకూడదు
- వార్షిక ఎల్‌టీసీజీ రూ..1.25 లక్షలు మించరాదు
- ఐటీఆర్-1 ఫైల్ చేసే వ్యక్తి ఏ కంపెనీలోనూ డైరెక్టర్ పదవిలో ఉండకూడదు
- లిస్ట్‌కాని ఏ కంపెనీలోనూ షేర్లు కలిగి ఉండరాదు
- ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి విదేశీ ఆదాయం కలిగి ఉండకూడదు
- విదేశాల్లో ఎలాంటి ఆస్తులుగానీ, బ్యాంకు ఖాతాలు గానీ కలిగి ఉండరాదు
- ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్ (ఈ- సాప్స్)పై చెల్లించాల్సిన చెల్లింపులు, డిడక్షన్లు వాయిదా పడి ఉండరాదు
- ఏ రకమైన ఆదాయాన్నీ క్యారీ ఫార్వర్డ్ లేదా బ్రాట్ ఫార్వర్డ్ చేసి ఉండకూడదు.

పైన పేర్కొన్న విషయాల పరిధిలోకి రాని వ్యక్తులు ఐటీఆర్-2 ద్వారా తమ ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేసుకోవచ్చు. వ్యాపారాలు, వృత్తి ద్వారా ఎటువంటి లాభాలు, రాబడులు లేని వ్యక్తులకు ఈ ఫారమ్ చక్కగా సరిపోతుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	540
వరంగల్	537	గోదావరి	520
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	107
కర్నూలు	110	నెల్లూరు	112
విశాఖపట్నం	101	అనంతపురం	112
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,970 ▼	89,800 ▼	1,18,000 ▲
విజయవాడ	99,000 ▼	93,000 ▼	1,08,000 ▲
విశాఖపట్నం	99,600 ▼	89,800 ▼	1,18,000 ▲
రాజమండ్రి	97,960 ▼	89,800 ▼	1,08,300 ▼
ప్రొద్దుటూరు	96,300 ▼	88,640 ▼	1,03,000 ▲
ముంబై	97,145 ▼	88,985 ▼	1,05,285 ▲

నక్సలైట్ల ఏరివేతలో పాల్గొన్న పోలీస్ అధికారులతో షా సమావేశం

న్యూఢిల్లీ, జూన్ 7: ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్ల ఏరివేత ఆపరేషన్‌లో చురుగ్గా వ్యవహరించిన పోలీస్ అధికారులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయ్, డిప్యూటీ సీఎం విజయ్ శర్మ, హోం మంత్రిత్వశాఖ సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించిన పోలీస్ అధికారులను అభినందించినట్లు అమిత్ షా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఆపరేషన్లు విజయవంతం కావడంలో పాలుపంచుకున్న పోలీసులను కూడా తాను కలుసుకోవాలనుకుంటున్నానని, త్వరలో ఛత్తీస్‌గఢ్‌లో పర్యటిస్తానని చెప్పారు.

ఈ నెల 15 నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టులో రోజుకు 114 విమాన సర్వీసుల రద్దు

న్యూఢిల్లీ, జూన్ 7: ఢిల్లీ విమానాశ్రయంలో ఈ నెల 15 నుంచి సెప్టెంబరు 15 వరకు మూడు నెలల పాటు రోజుకు 114 విమాన సర్వీసులను రద్దు చేయనున్నట్టు ఆ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డీఐఏఎల్) శుక్రవారం వెల్లడించింది. ఒక రన్‌వేను ఆధునికీకరణ పనుల నిమిత్తం మూసివేస్తున్నందు వల్ల విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్టు పేర్కొంది. దేశంలో అతిపెద్దదేకాకుండా రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో నాలుగు రన్‌వేలు ఉండగా.. ప్రతి రోజు 1,450 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రద్దు చేయనున్న 114 విమాన సర్వీసులు ఇందులో దాదాపు 7.5 శాతానికి సమానం. మరో 86 విమాన సర్వీసులను రీషెడ్యూల్ చేయనున్నారు.

సోనియాగాంధీకి అస్వస్థత

సిమ్లా, జూన్ 7: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ శనివారం అస్వస్థతకు గురికావడంతో స్థానిక ఇందిరాగాంధీ వైద్య కళాశాల, ఆస్పత్రికి తరలించారు. ఎమ్మారైతో సహా పలు పరీక్షలు నిర్వహించాక ఆమె ఆస్పత్రి నుంచి తిరిగి వెళ్లిపోయారు. అధిక రక్తపోటుతో ఆస్పత్రికి వెళ్లిన ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కాగా కుమార్తె ప్రియాంక గాంధీతో కలిసి సోనియా వ్యక్తిగత పర్యటనకు సిమ్లా వచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో కూడా ఆమె అస్వస్థతతో ఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో చేరారు. అయితే అప్పుడు వైద్యులు పెద్దగా సమస్య ఏమీ లేదని తెలిపారు.

ఐసీయూలో రోగిపై అత్యాచారం

జైపూర్, జూన్ 7: రాజస్థాన్‌లో దారుణం జరిగింది. ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్న 32 ఏళ్ల మహిళపై అక్కడి నర్సింగ్ సిబ్బందిలో ఒకడు అత్యాచారానికి ఒడిగట్టాడు. జూన్ 4వ తేదీన అల్వార్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ఈ ఘోరం జరిగింది. అత్యాచారానికి ముందు.. బాధితురాలికి నిందితుడు మత్తు ఇంజెక్షన్ ఇచ్చాడు. ఆమెపై దారుణం జరుగుతుండగా కుటుంబసభ్యులు వార్డు బయటే ఉన్నారు. ఘోరాన్ని పసిగట్టి తీవ్రంగా ప్రతిఘటించిన బాధితురాలు తన కుటుంబ సభ్యులను పిలుస్తూ కేకలు పెట్టింది. ఆమె భర్త కంగారుపడుతూ లోపలికి వెళ్లాడు. తనపై జరిగిన ఘోరం గురించి భర్తకు చెబుతూనే బాధితురాలు పూర్తిగా మత్తులోకి జారుకుంది.

లాస్ ఏంజెలెస్‌లో అక్రమ వలసదారుల అరెస్టు

» ఫెడరల్ ఏజెంట్ల ఆకస్మిక తనిఖీలతో ఉద్రిక్తతలు

న్యూఢిల్లీ, జూన్ 7: అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నగరంలో అక్రమ వలసదారులను గుర్తించేందుకు ఫెడరల్ అధికారులు శుక్రవారం చేపట్టిన ఆకస్మిక తనిఖీలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ సందర్భంగా నిరసనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్, పెప్పర్ స్ప్రే ప్రయోగించారు. 44 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో ఫెడరల్ ఏజెంట్లు నగరంలోని ఫ్యాషన్ డిస్ట్రిక్ట్‌లో అక్రమ వలసదారుడనే కారణంగా ఒక దుస్తుల వ్యాపారిపై దాడి చేసి, పలువురు ఉద్యోగస్తులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో అధికారుల చర్యలకు వ్యతిరేకంగా భారీ సంఖ్యలో ప్రజలు ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'ఫాసిస్టులు' అని ఒక వ్యక్తి నినదించాడు. 'కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తూ రాత్రి పూట ఎలా నిద్రపోతావు?' అంటూ ఓ మహిళ అధికారిని నిలదీసింది. ఈ క్రమంలో అక్రమ వలసదారులను వ్యానుల్లో తరలించేందుకు పోలీసులు టియర్‌గ్యాస్, పెప్పర్ స్ప్రే ప్రయోగించారు.

బీజేపీ 'మహా' రిగ్గింగ్

మహారాష్ట్రలో విజయం కోసం మ్యాచ్ ఫిక్సింగ్

- » ఐదు పద్ధతుల్లో పక్కాగా అక్రమాలు
- » సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీం సీజే తొలగింపూ ఇందులో భాగమే
- » రేపు బిహార్‌లోనూ జరిగేది ఇదే
- » రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు



రాహుల్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

న్యూఢిల్లీ, జూన్ 7: మహారాష్ట్ర ఎన్నికల్లో విజయం కోసం బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్ చేసిందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ఎన్నికలు ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు బ్లూప్రింట్ వంటివని విమర్శించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో అనుసరించిన ఈ విధానాలనే బిహార్ శాసనసభ ఎన్నికల్లోనూ పునరావృతం చేయనుందని, ఎక్కడైతే తమకు పరాజయం తప్పదనుకుంటుందో ఆ రాష్ట్రాలన్నింటిలోనూ అమలు చేయనున్నదంటూ బీజేపీపై ధ్వజమెత్తారు. రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ నాయకులతోపాటు ఈసీ వర్గాలు కూడా ఖండించింది. ఆయనవి నిరాధార వ్యాఖ్యలని తేల్చాయి. దీంతో ఈసీపైనా రాహుల్ విరుచుకుపడ్డారు. "సాకులు కాదు.. మీరు పలికే సత్యమే మీ విశ్వసనీయతను నిలుపుతుంది" అని కాంగ్రెస్ నేత ఘాటుగా సూచించారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో మహారాష్ట్ర అసెంబ్లీలోని 288 సీట్లలో బీజేపీ 132, దాని మిత్రపక్షాలు మరో 103 చోట్ల గెలిచి, ఆ రాష్ట్ర చరిత్రలోనే అత్యద్భుత విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అయితే, అక్కడ విజయం కోసం బీజేపీ ప్రజాస్వామ్య ప్రక్రియను మృగ్యం చేసిందని తాజాగా రాసిన ఓ వ్యాసంలో రాహుల్ విమర్శించారు. ఎన్నికల కమిషనర్ నియామకం కోసం ప్యానెల్ రిగ్గింగ్‌కు పాల్పడటం, నకిలీ ఓటర్ల నమోదు, ఓటింగ్ శాతాన్ని పెంచేయడం, గెలవాలనుకున్న చోట బోగస్ ఓటింగ్ జరపించడం, ఆధారాలను దాచిపెట్టడం.. అనే ఐదు పద్ధతులను ఈ ఎన్నికల్లో బీజేపీ అనుసరించిందన్నారు. ఇదేదో చిన్నాచితక మోసం కాదని, వ్యవస్థలను గుప్పెట్లో ఉంచుకుని రిగ్గింగ్‌కు భారీఎత్తున పాడిగట్టారన్నారు. భారత ఎన్నికల ప్రధానాధికారిని ఎంపికచేసే కమిటీనుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించి, ఆ స్థానంలో కేంద్రమంత్రికి చోటు కల్పిస్తూ మహారాష్ట్ర ఎన్నికలకు ముందు(2023) తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రభుత్వంలో ఉన్నవారికి అనుకూలంగా ఎన్నికల వ్యవస్థ మొగ్గేందుకు ఈ చర్య దోహదం చేసిందని రాహుల్ విమర్శించారు. మోసంచేసి ఆట గెలవవచ్చుగానీ, దానివల్ల ప్రజా విశ్వాసానికి విఘాతం కలుగుతుందని, వ్యవస్థలు దెబ్బతింటాయన్నారు.

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మహారాష్ట్ర ఎన్నికలపై చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు ఖండించారు. వ్యవస్థలను ఘోరంగా అవమానించే పనిని తిరిగి రాహుల్ మొదలుపెట్టారని మండిపడ్డారు. వ్యవస్థలపై ఆయన వ్యాఖ్యలు సిగ్గుచేటు అని ఆక్షేపించారు. మహారాష్ట్ర ఎన్నికల విషయమై ఈసీ ఇప్పటికే అనేకసార్లు వివరణ ఇచ్చిందని బీజేపీ నేత తుహిన్ సిన్హా అన్నారు. తప్పుడు కథనాలకు బ్లూప్రింట్ రాహుల్ వ్యాసం అని కేంద్ర మంత్రి జేపీ నడ్డా విమర్శించారు.

ఈసీ వర్సెస్ రాహుల్

రాహుల్ వ్యాఖ్యలను ఈసీ వర్గాలు తప్పుబట్టి, డాక్యుమెంట్లను విడుదల చేశాయి. ఆయనవి నిరాధార వ్యాఖ్యలని తేల్చాయి. దీనిపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. "నేను వేసిన ప్రశ్నలకు సూటిగా స్పందించకుండా సంతకం లేని పత్రాలు విడుదల చేయడం ఒక రాజ్యాంగ సంస్థగా మీకు తగదు. దాచటానికి ఏమీ లేదు అనుకుంటే నా వ్యాసంలో విసిరిన ప్రశ్నలకు బదులివ్వండి. సార్వత్రిక ఎన్నికలు, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాలకు జరిగిన శాసనసభ ఎన్నికలకు సంబంధించిన.. డిజిటల్, మిషన్ రీడింగ్ ఓటర్ రోల్స్‌ను బయటపెట్టింది. సాయంత్రం 5 తర్వాత మహారాష్ట్రలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తీసిన సీసీ కెమెరా ఫుటేజీని విడుదల చేయండి." అని డిమాండ్ చేశారు.

లోకం తీరు



భారీగా తగ్గిన 'తీవ్ర పేదరికం'

(మొదటి పేజీ తరువాయి)

నుంచి 2.8 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 10.7 శాతం నుంచి 1.1 శాతానికి 11 ఏళ్ల సమయంలో తగ్గిందని చెప్పింది. ఇక 2017 నాటి పేదరిక రేఖ ఆధారంగా రోజుకు 2.15 డాలర్లు ఖర్చు చేయగలిగే విషయంలో జనాభాలో 2.3 శాతం మంది మాత్రమే అత్యంత పేదరికంలో ఉన్నారని, 2011-12లో 16.2 శాతంతో పోలిస్తే ఇది భారీ తగ్గుదల అని తెలిపింది. 2022లో 2.15 డాలర్ల అంచనా విషయంలో పేదల సంఖ్య 3.36 కోట్లకు తగ్గగా, అది 2011లో 20.5 కోట్లుగా ఉండేదని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక బహుముఖీయ పేదరిక సూచీ (ఎంపీఐ)లో దేశం గణనీయంగా పురోగతి సాధించింది. 2005-06లో 53.4 శాతంగా ఉన్న ఆ సూచీ.. 2019-21కి 16.4 శాతానికి, 2022-23కు 15.5 శాతానికి తగ్గింది. ఇక దిగువ మధ్య ఆదాయం విభాగంలో కూడా పేదరికం పెద్దఎత్తున తగ్గింది. ఈ విభాగంలో రోజు వారీ ఖర్చును 3.65 డాలర్ల నుంచి 4.20 డాలర్లకు పెంచి లెక్కించింది. ఈ సవరణ తర్వాత 2011-12లో ఈ విభాగంలో 57.7 శాతంగా ఉన్న పేదరికం, 2022-23 నాటికి 23.9 శాతానికి తగ్గింది. కాగా, ఎన్డీఏ పాలనకు 11 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా ప్రధాని మోదీ కూడా పేదరికం తగ్గుదలపై ఇటీవల స్పందించారు. డీబీటీ, డిజిటల్ పాలన, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు.

రాజీ దిశగా ట్రంప్-మస్క్?

» 'ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ట్రంప్ పేరు' పోస్టును తొలగించిన మస్క్

వాషింగ్టన్, జూన్ 7: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, బిలియనీర్ ఎలాన్ మస్క్ మధ్య రాజీ దిశగా అడుగులు పడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. లైంగిక వేధింపుల కుంభకోణంలో నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌నకు సంబంధాలు ఉన్నాయని ఇంతకుముందు ఆరోపించిన టెస్లా సీఈవో... తాజాగా ఆ పోస్టును తొలగించారు. మరోవైపు, ట్రంప్‌తో శాంతి కుదుర్చుకోవాలని మస్క్‌ను అమెరికన్ ఫండ్ మేనేజర్ బిల్ ఆక్‌మన్ కోరారు. వారిద్దరికీ తన మద్దతు ఉంటుందని, విడిపోవడం కంటే కలిసుంటేనే మనం బలంగా ఉంటామని ట్వీట్ చేశారు. దీనికి మస్క్ స్పందిస్తూ.. మీరు చెప్పిన దాంట్లో తప్పేమీ లేదని బదులిచ్చారు. కాగా, మస్క్‌పై అధ్యక్షుడు బహిరంగ విమర్శలు చేయకుండా వైట్‌హౌస్ వర్గాలు కృషి చేస్తున్నాయని మీడియా సంస్థ 'పొలిటికో' కథనం పేర్కొంది. ట్రంప్, మస్క్ మధ్య శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించడానికి రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వదేవ్ ముందుకొచ్చారు. అయితే దీనికి కొద్దిగా ఖర్చు అవుతుందన్నారు. 'డి (డొనాల్డ్ ట్రంప్), ఈ (ఎలాన్ మస్క్) మధ్య శాంతి ఒప్పందం కుదర్చడానికి సిద్ధంగా ఉన్నాం. దీనికి ఫీజుగా స్టార్‌లింక్ షేర్లు ఇవ్వాల్సి ఉంటుంది. మీరిద్దరూ ఘర్షణ పడకండి' అంటూ ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇదిలా ఉండగా, ట్రంప్‌తో విభేదాల నేపథ్యంలో తన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మస్క్ ఓటింగ్ నిర్వహించారు. 80 శాతం మంది అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించే విధంగా కొత్త పార్టీ స్థాపనకు సమయం ఆసన్నమైందా అని ఆయన ప్రశ్నించారు. ఈ పోల్‌లో 80శాతం మంది తన నిర్ణయానికి మద్దతు ప్రకటించారని మస్క్ పేర్కొన్నారు. అనంతరం 'ది అమెరికా పార్టీ' అంటూ మరో పోస్టును ఆయన షేర్ చేశారు. దీంతో మస్క్ కొత్త పార్టీ పెట్టబోతున్నారని ఊహాగానాలు ఊపందుకున్నాయి.





చార్‌ధామ్ యాత్ర కోసమని కెస్ట్రల్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన హెలికాప్టర్ శనివారం ఐదుగురు ప్రయాణికులతో రుద్రప్రయాగ్ నుంచి కేదార్‌నాథ్‌కు బయల్దేరింది. టేకాఫ్ అయిన కాసేపటికే హెలికాప్టర్‌లో సాంకేతిక అవరోధాలు ఏర్పడడంతో పైలట్ వెంటనే పక్కనే ఉన్న రహదారిపై అత్యవసరంగా ల్యాండింగ్ చేశాడు. ఈ ఘటనలో రోడ్డుపై వెళ్తున్న ఓ కారు దెబ్బతినగా, పైలట్‌కు స్వల్ప గాయాలయ్యాయని అధికారులు తెలిపారు.

డ్యూటీ టైం ముగిసింది.. విమానం నడపను

» మహారాష్ట్ర డిప్యూటీ సీఎం షిండేకు వింత అనుభవం



ముంబయి, జూన్ 7: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు వింత అనుభవం ఎదురయింది. డ్యూటీ సమయం ముగిసిపోయింది, తాను విమానం నడపబోనంటూ పైలట్ నిరాకరించడంతో ఆయన విమానాశ్రయంలో గంట సేపు ఉండిపోవాల్సి వచ్చింది. చివరకు విమాన కంపెనీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవడంతో ఆ పైలట్ తన పట్టువీడాడు. ముక్తాయినగర్‌లోని సంత్ ముక్తాయి పల్లకీ సేవలో పాల్గొనేందుకు శుక్రవారం షిండే వ్యక్తిగత విమానంలో ముంబయి నుంచి జలగావ్ బయలుదేరారు. విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో బయలుదేరడమే రెండున్నర గంటలు ఆలస్యమయింది. నిర్ణీత సమయం కన్నా మూడున్నర గంటలు ఆలస్యంగా జలగావ్ చేరుకున్నారు. అక్కడి నుంచి ముక్తాయినగర్‌కు రోడ్డు మార్గంలో చేరుకున్నారు. ఆయన వెంట మంత్రులు గిరీష్ మహాజన్, గులాబ్‌రావ్ పాటిల్, ఇతర అధికారులు ఉన్నారు. అక్కడ పూజల్లో పాల్గొని రాత్రి 9.15 సమయంలో తిరిగి జలగావ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడే వారికి అనూహ్య సంఘటన ఎదురయింది. తన డ్యూటీ సమయం ముగిసిందని, విమానం నడపబోనంటూ వారికి పైలట్ తేల్చి చెప్పాడు. దాంతో షిండే వెంట ఉన్న ఇద్దరు మంత్రులు, అధికారులు 45 నిమిషాలపాటు నచ్చజెప్పడంతో మెత్తపడి చివరకు విమానం నడపడానికి అంగీకరించాడు.




విష సర్పాల కలకలం

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం జర్జుల పంచాయతీ బలడ గ్రామంలో లో పాములు కలకలం సృష్టించాయి. గ్రామానికి చెందిన గొల్లోరి మెద్దు నూతన ఇంటి నిర్మాణం కోసం శనివారం గోతులు తవ్వుతుండగా పెద్ద బండరాయి అడ్డు వచ్చింది. ఆ రాయిని తీస్తుండగా.. పది అడుగుల నాగుపాము బయటకు రావడంతో స్థానికులు దానిని హతమార్చారు. ఆతర్వాత బండరాయిని తొలగించగా... దాని కింద పాము పిల్లల గుంపు కనిపించింది. వాటిని కూడా గ్రామస్థులు చంపేసి, దహన కార్యక్రమం నిర్వహించారు. కాగా, రంగబయలు పంచాయతీ వలజంగి సమీపంలో శుక్రవారం భారీ కొండచిలువ మేకను మింగేస్తుండగా స్థానికులు గమనించి, కొండచిలువను చంపేశారు.

- ముంచంగిపుట్టు, ఆంధ్రజ్యోతి

బిడ్లు పిలవండి.. ఖరారు చేయొద్దు!

- **ఏసీఏ, ఆంధ్ర ప్రీమియర్ లీగ్ గవర్నింగ్ కౌన్సిల్‌కు హైకోర్టు ఆదేశం**

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో ఫ్రాంచైజీని సొంతం చేసుకొనేందుకు ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానిస్తూ ఈ ఏడాది జూన్ 2న ఏసీఏ, ఆంధ్ర ప్రీమియర్ లీగ్ గవర్నింగ్ కౌన్సిల్ ప్రకటన జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ వైజాగ్ వారియర్స్, కోస్టల్ రైడర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఉత్తరాంధ్ర లయన్స్, బెజవాడ టైగర్స్ యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. ఇప్పటికే ఉన్న ఒప్పందాలను పట్టించుకోకుండా కొత్త ఫ్రాంచైజీల కోసం టెండర్ పిలవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నాయి. ఈ వ్యాజ్యంపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి ఇటీవల విచారణ జరిపారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. వ్యాజ్యంపై లోతైన విచారణ అవసరమని అభిప్రాయడ్డారు. కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర క్రీడాశాఖ ముఖ్యకార్యదర్శి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, ఆంధ్ర ప్రీమియర్ లీగ్ గవర్నింగ్ కౌన్సిల్, బీసీసీఐ కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు. విచారణను ఈనెల 19కి వాయిదా వేశారు. ఫ్రాంచైజీల కోసం ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించి, వాటిని తెరవచ్చని, అయితేవాటిని ఖరారు చేయవద్దని ఏసీఏ, ఆంధ్ర ప్రీమియర్ లీగ్ గవర్నింగ్ కౌన్సిల్‌ను ఆదేశించారు.

ఎక్సైజ్‌లో ఫొటోల డ్యూటీ!

ఉదయం 7 నుంచి మద్యం షాపులు, బార్ల ఫొటోలు తీయాలి. ఆ పని ముగిసిన తర్వాత స్టేషన్‌లో విధులకు హాజరు కావాలి. మళ్లీ రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు షాపులు, బార్ల ఫొటోలు తీయాలి. గత కొద్దిరోజులుగా ఎక్సైజ్ కానిస్టేబుళ్ల ఉద్యోగం ఇలా మారింది!.

- **వైన్స్, బార్ల సమయ ఉల్లంఘునలపై ఉన్నతాధికారుల ప్రత్యేక చర్యలు**
- **ఉదయం 7-10, రాత్రి 10-12 వరకు ఫొటోలు తీయాలని సిబ్బందికి ఆదేశం**
- **కానిస్టేబుళ్లకు 'ఎక్సైజ్-ఐ' చిక్కులు**
- **యాప్‌పై సిబ్బందిలో తీవ్ర వ్యతిరేకత**
- **మహిళా కానిస్టేబుళ్లకూ ఇదే బాధ్యత**
- **కేసుల నమోదుకు మాత్రం దూరం**

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వైన్స్, బార్ల యజమానులు సమయ పాలన పాటించడం లేదు. నగరాలు, పట్టణాల పరిధిలో ఉదయం 5 గంటలకే బార్లను, 8-9 గంటలకే వైన్స్ దుకాణాలను తెరుస్తున్నారు. దీనిపై సాధారణ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎక్సైజ్ శాఖ.. 'ఎక్సైజ్-ఐ' పేరిట ఓ యాప్‌ను తీసుకు వచ్చింది. ఈ యాప్ ద్వారా దుకాణాల ఫొటోలను తీయాలని నిర్దేశించింది. ఈ బాధ్యతను ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు అప్పగించారు. అయితే.. ఫొటోలు తీసేందుకు ఉదయం త్వరగా వెళ్లాలన్నా పర్వాలేదు కానీ అర్ధరాత్రి వరకు తీయించడంపై కానిస్టేబుళ్లలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 'ఈ ఉద్యోగం ఎలా చేయగలం?' అంటూ క్షేత్రస్థాయిలో కానిస్టేబుళ్లు ప్రశ్నిస్తున్నారు. కొందరు రాష్ట్ర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

నిబంధనలు ఏమిటి?

నిబంధనల ప్రకారం వైన్స్ షాపులను ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు, బార్లను ఉదయం 11 నుంచి రాత్రి 11గంటల వరకు తెరిచి ఉంచాలి. బార్లలో మద్యం అమ్మకాలు రాత్రి 11గంటలతో ముగించినా, ఆ తర్వాత గంటసేపు బార్‌లో ఉన్నవారికి ఆహారం సరఫరా చేయొచ్చు. అయితే ఈ పనివేళల అమలులో ఉల్లంఘనలు జరుగుతున్నాయి. వీటిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ 'ఎక్సైజ్-ఐ' అనే యాప్‌ను రూపొందించింది. గత 2 వారాలుగా దాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రతి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉదయం, రాత్రి సమయాల్లో పనివేళలకు ముందు, ముగిసిన తర్వాత ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ పనిని ప్రతి స్టేషన్‌లో 60 నుంచి 70శాతం మంది కానిస్టేబుళ్లకు అప్పగిస్తున్నారు. ఆ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని షాపులు, బార్ల ఫొటోలను ఉదయం, రాత్రి వేళ్లలో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. రాష్ట్రంలో 208 ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో స్టేషన్ పరిధిలో రెండు.. మూడు రెవెన్యూ మండలాలు ఉన్నాయి. ఆ పరిధిలో ఎక్కడ మద్యం షాపు, బార్ ఉన్నా కానిస్టేబుల్ వెళ్లి ఫొటో తీయాలి. పట్టణాలు, నగరాల్లో పరిధి తక్కువ ఉన్నా షాపులు, బార్ల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అదే గ్రామీణ ప్రాంతాల్లో అయితే బార్లు ఉండవు. వైన్స్ దుకాణాల సంఖ్య కూడా తక్కువగానే ఉంటుంది. అయినా.. స్టేషన్ పరిధి విస్తృతంగా ఉంటుంది. ఒక్కో స్టేషన్ పరిధిలో 50 నుంచి 70 కిలోమీటర్ల దూరంలో షాపులు ఉంటాయి. అక్కడకు వెళ్లి ఫొటోలు తీయడం కానిస్టేబుళ్లకు సవాలుగా మారుతోంది. పలు స్టేషన్ల పరిధిలో మహిళా కానిస్టేబుళ్లకు కూడా ఫొటోల బాధ్యత అప్పగించారు. మందుబాబులు గుమిగూడే ప్రదేశానికి వెళ్లి ఫొటోలు తీయడం, దూర ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై తిరగడం వారికి ఇంకా కష్టంగా మారింది. మరోవైపు.. ఈ ఫొటోల పనితో ఎక్సైజ్ స్టేషన్లలో సాధారణ పని వాతావరణం దెబ్బతింటోంది. సగటున ఒక్కో స్టేషన్‌లో ఏడుగురు కానిస్టేబుళ్లు ఉంటే ఐదుగురికి ఫొటోల డ్యూటీలు అప్పగిస్తున్నారు. ఫొటోలు తీసిన తర్వాత స్టేషన్‌కు వచ్చే కానిస్టేబుళ్లు ఉత్సాహంగా పని చేయలేకపోతున్నామని చెబుతున్నారు.

లైసెన్సీలతో వివాదాలు

రాత్రి 10 గంటలకు షాపు మూసే సమయానికి కానిస్టేబుళ్లు అక్కడకు వెళ్లి ఫొటోలు తీయాలి. ఈ క్రమంలో అప్పుడే ఎందుకు ఫొటోలు తీస్తున్నారంటూ దుకాణ సిబ్బంది కానిస్టేబుళ్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. బార్లతో అయితే ఇంకా తలనొప్పిగా మారింది. నిబంధనల ప్రకారం రాత్రి 11 గంటల వరకే మద్యం అమ్మాలి. కానీ.. బార్‌ను అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచొచ్చు. ఈ క్రమంలో 11 గంటలకు ఫొటోలు తీస్తున్న కానిస్టేబుళ్లతో వ్యాపారులు గొడవపడుతున్నారు. లైసెన్సీలతో షాపులు, బార్లు మూయించాలని అధికారులు చెబుతున్నారు తప్ప, సమయం దాటి తెరిచి ఉంచిన లైసెన్సీలపై కేసులు మాత్రం నమోదు చేయడం లేదు. కేసులు లేనప్పుడు ఎన్ని ఫొటోలు తీస్తే ఉపయోగం ఏంటని కానిస్టేబుళ్లు ప్రశ్నిస్తున్నారు.

అధికారుల అత్యుత్సాహం

కొందరు అధికారుల అత్యుత్సాహం వల్లే ఈ కొత్త విధానాలు తీసుకొచ్చినట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం దృష్టిలో మంచిపేరు కోసం కొందరు అధికారులు క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఇబ్బందులకు గురిచేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. అలాగే ఎక్సైజ్‌లో కొందరు ఉన్నతాధికారులు ఆదాయంపై మాత్రమే దృష్టిపెడుతున్నారు. ఎలాగైనా అమ్మకాలు పెంచాలంటూ జిల్లాల అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. కొందరు అధికారులు ఒత్తిడి చేయడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలూ పెరుగుతున్నాయి. మొత్తంగా ఎక్సైజ్ శాఖ పనితీరు గందరగోళంగా మారిందని సిబ్బంది పేర్కొంటున్నారు.


వివరాలు తెలియచేస్తున్న నెల్లూరు డీఎస్పీ సింధుప్రియ

ఐఆర్ఎస్ అధికారి పేరిట బురిడీ

- **భూవివాదం పరిష్కరిస్తానని 2 లక్షలు వసూలు**
- **ఆర్జేసీనంటూ ఆలయ భూముల రిపోర్టు కాపీలు స్వాధీనం**
- **ఈవో ఫిర్యాదుతో కర్ణాటక వాసి అరెస్టు**

నెల్లూరు(క్రైం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): సులభంగా డబ్బు సంపాదించాలని ఐఆర్ఎస్ అధికారి అవతారమెత్తాడో మోసగాడు. డాక్టర్ రమేష్ రాహూరు పేరుతో హల్‌చల్ చేస్తున్న అతడిని సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వివరాలను నెల్లూరు డీఎస్పీ పి.సింధుప్రియ శనివారం మీడియాకు వెల్లడించారు. కర్ణాటకలోని రాయచూర్ దొంగరంపూర్ ప్రాంతానికి చెందిన రాహూరు రమేష్ ఐఆర్ఎస్ అధికారిగా అవతారమెత్తారు. భూవివాదం పరిష్కరిస్తామని నెల్లూరు నగరానికి చెందిన వెంకటరమణ వద్ద రూ.2 లక్షలు తీసుకున్నాడు. ఆ డబ్బుతో ఐఆర్ఎస్ అధికారి అంటూ.. నేమ్ బోర్డులు, స్టాంపులు, ఇతర సామగ్రి కొనుగోలు చేశాడు. ఈనెల 3న తన కారులో నెల్లూరు ఆదిత్యనగర్‌కు వచ్చాడు. వెంకటరమణ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో ఆ రాత్రి ఓ లాడ్జిలో బస చేశాడు. 4న నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామి ఆలయానికి చేరుకొని ఈవో శ్రీనివాసులరెడ్డిని కలిశాడు. తాను ఐఆర్ఎస్ అధికారినని, నెల్లూరు రీజనల్ జాయింట్ కమిషనర్‌గా బదిలీపై వచ్చానని, రిపోర్టు చేసేముందు స్వామిదర్శనానికి వచ్చానని చెప్పాడు. దీంతో ఈవో ఆలయ మర్యాదలతో దర్శనం చేయించారు. అనంతరం వివాదంలో ఉన్న ఆలయ భూముల రిపోర్టు కాపీలను ఈవో దగ్గర నుంచి తీసుకెళ్లాడు. అదేరోజు సాయంత్రం తనను కలవాలని ఫోన్ చేయడంతో ఈవోకు అనుమానం వచ్చింది. ఆరాతీయగా, నకిలీ ఐఆర్ఎస్ అధికారి అని తెలిసింది. సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 6న ఆదిత్యానగర్‌లో నిందితుడిని అరెస్ట్ చేశారు. కారు, సెల్‌ఫోన్లు, స్టాంపులను సీజ్ చేశారు.

వెబ్ కౌన్సెలింగ్ పారదర్శకం

- **క్లస్టర్ల వారీగా పోస్టుల ఖాళీలు**
- **సులభంగా ఎంపికకు అవకాశం**
- **పాఠశాల విద్యాశాఖ వివరణ**

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్ విధానం పారదర్శకంగా ఉంటుందని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. మాన్యువల్‌తో పోలిస్తే వెబ్ విధానంలో టీచర్లు సులభంగా పాఠశాలలను ఎంపిక చేసుకోవచ్చని, దీనివల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొంది. వెబ్ కౌన్సెలింగ్‌లో ప్రయోజనాలపై శనివారం వివరణ ఇచ్చింది. 2021లో 38వేల మంది, 2023లో 44వేల మంది టీచర్ల బదిలీలు వెబ్ కౌన్సెలింగ్ ఆధారంగానే ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాతంగా పూర్తయ్యాయని వివరించింది. ఈ విధానంలో పారదర్శకతతో పాటు ఎక్కువమంది సిబ్బంది అవసరం ఉండదని వివరించింది. మాన్యువల్ కౌన్సెలింగ్‌లో వ్యక్తుల జోక్యానికి ఆస్కారం ఉంటుందని, వెబ్‌లో ఎవరూ జోక్యం చేసుకునే పరిస్థితి ఉండదని స్పష్టం చేసింది. ఈ ఏడాది 1,494 మంది గ్రేడ్-2 హెచ్ఎంలు, 5,653 మంది మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలు, 28,088 మంది స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు ఎలాంటి వివాదాలు లేకుండా పూర్తయ్యాయని తెలిపింది. అలాగే 4,853 మంది టీచర్ల బదిలీలు కూడా ఆన్‌లైన్ విధానంలోనే చేపట్టామని విద్యాశాఖ వెల్లడించింది.

వెబ్‌తో ప్రయోజనాలివీ..

ప్రతి మండల కేంద్రం నుంచి పాఠశాల ఎంత దూరంలో ఉందో కిలోమీటర్లతో సహా చూపిస్తారు. దీనివల్ల టీచర్లు తక్కువ దూరంలో ఉన్న పాఠశాలలను సులభంగా చూసుకోవచ్చు. క్లస్టర్ వారీగా ఖాళీలు చూసుకోవచ్చు. ఒక్కో క్లస్టర్‌లో 150-200 పాఠశాలలు ఉంటాయి. దీనివల్ల వేల సంఖ్యలో ఉన్న బడుల జాబితాల్లో వెతుక్కునే భారం ఉండదు. టీచర్లు ఎంపిక చేసుకున్న పాఠశాలలను ఎన్నిసార్లయినా సేవ్ చేసుకోవచ్చు. తప్పనిసరి బదిలీల్లో ఉన్న టీచర్లు తుది నిర్ధారణ చేయాలి. రిక్వెస్ట్ బదిలీ కోరుకునేవారు ఆప్షన్లు ఎంపిక చేసుకుంటే సరిపోతుంది. అన్ని స్థాయిల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. దీనివల్ల ఇంటర్నెట్ కేంద్రాలు, ఇతర టీచర్లపై ఆధారపడే పరిస్థితి ఉండదు.

మాన్యువల్ కౌన్సెలింగ్‌తో నష్టాలు

మాన్యువల్ విధానంలో అన్ని ఖాళీలు కనిపించకపోవచ్చు. దీనివల్ల అర్హులైన సీనియర్ టీచర్లకు అన్యాయం జరుగుతుంది. ప్రస్తుత బదిలీల్లో 16,029 మంది ఎస్జీటీలు రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్‌లో దాదాపు 38శాతం కొత్తగా ఏర్పడే ఖాళీలు వెంటనే కనిపించవు. దీనివల్ల ఎక్కువ పాయింట్లు ఉన్న టీచర్లు కూడా కొంతమేర అవకాశం కోల్పోతారు. ఇప్పుడు మాన్యువల్ కౌన్సెలింగ్ చేపడితే బడులు పునఃప్రారంభమయ్యే నాటికి బదిలీలు పూర్తికావు. రోజుకు 400 నుంచి 500 మంది టీచర్లకు మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహించగలరు. టీచర్లు తమ వంతు వచ్చే వరకు కౌన్సెలింగ్ కేంద్రాల్లో గంటల తరబడి వేచిచూడాలి.

నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

ఎస్జీటీల బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్ విధానంపై నిరసనలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా డీఈవో కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపింది. మాన్యువల్ విధానంలోనే ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. కాగా, ఎస్జీటీల బదిలీలు మాన్యువల్ కౌన్సెలింగే నిర్వహించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ కోరారు.

చిత్రజ్యోతి

SINCE 1965

అల్లు.. అట్లీ సినిమాలో దీపిక




అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. 'ఏఏ 22.. అట్లీ 6' అనేది వర్కింగ్ టైటిల్. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోకి బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకోన్‌ను ఆహ్వానిస్తూ మేకర్స్ 'ఫేసెస్ ఆఫ్ ఏఏ 22.. అట్లీ 6' పేరిట ఓ వీడియోను విడుదల చేశారు. ఇందులో దీపికకు అట్లీ స్క్రిప్ట్ వివరించడం.. ఆమెకు లుక్ టెస్ట్ చేయడం వంటివి చూపించారు. ఇందులో ఆమెది యాక్షన్‌కు అధిక ప్రాధాన్యమున్న శక్తిమంతమైన పాత్రని తెలుస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు అట్లీ మాట్లాడుతూ "దీపిక అద్భుతమైన నటి. సినిమాలో ఆమె పాత్ర ఎంతో కీలకంగా ఉండబోతోంది. ఈ చిత్రంతో ప్రేక్షకులకు మరిచిపోలేని ఓ గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందివ్వబోతున్నాం" అని అన్నారు. సమాంతర ప్రపంచం, పునర్జన్మల కాన్సెప్ట్‌తో భారీ స్థాయిలో రూపుదిద్దుకోనున్న ఈ సైన్స్ ఫిక్షన్ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది.

డబ్బింగ్ పూర్తి చేసిన నాగార్జున



నాగార్జున, ధనుష్ కథానాయకులుగా శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం కుబేర. ఈ నెల 20న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమాలో తన పాత్ర డబ్బింగ్‌ను పూర్తి చేశారు నాగార్జున. ఈ సందర్భంగా డబ్బింగ్ స్టూడియోలో నాగార్జున, దర్శకుడు శేఖర్ కమ్ముల, నిర్మాత పుష్కర్ రామ్‌మోహన్ కలసి మాట్లాడుకుంటున్న ఫొటోలను షేర్ చేశారు. రష్మిక కథానాయికగా నటించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.

ఈ రక్కసి క్రీడను ఆపాలంటే..



ఆది సాయికుమార్ హీరోగా యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్'. షైనింగ్ పిక్చర్స్ బేనర్‌పై రాజశేఖర్ అన్న భీమోజు, మహిధర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల మేకర్స్ 'శంబాల' మేకింగ్ వీడియోని రిలీజ్ చేసి అంచనాలు పెంచేశారు. తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ని విడుదల చేశారు. 'ఈ విశ్వంలో అంతుపట్టని రహస్యాలెన్నో ఉన్నాయి. సైన్స్‌కి సమాధానం దొరకనప్పుడు మూఢ నమ్మకం అంటుంది.. అదే సమాధానం దొరికితే నమ్మకం అంటుంది. పంచభూతాలని శాసిస్తోందంటే ఇది సాధారణమైనది కాదు.. దీని ప్రభావం వల్ల మనం ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందో ఊహించలేం.. ఇప్పుడు ఈ రక్కసి క్రీడను ఆపాలంటే..' అంటూ వచ్చిన వాయిస్ ఓవర్ ఉత్కంఠభరితంగా ఉంది.

ఆ నలుగురు అనేది కరెక్ట్ కాదు



సునీల్ నారంగ్

'మోదీ గారే పవన్ కల్యాణ్‌ని తుఫాన్ అన్నారు. ఆయన సినిమాను ఎవరు ఆపుతారు. ఆ నలుగురు అనేది కరెక్ట్ కాదు. ఎవరి దగ్గర ఎన్ని థియేటర్లు ఉన్నాయనే లెక్కలు చూస్తే ఆ నలుగురు అనే టాపిక్ ఉండదు' అని తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీఎఫ్‌సీసీ) అధ్యక్షుడు సునీల్ నారంగ్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఎక్కువ సినిమాలు రావాలి. థియేటర్లు నడవాలి. హీరోలు గాడ్స్ వంటి వారు. వారు ఏం చేయాలనేది మేం చెప్పలేం. కొత్త కమిటీ అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుంది. ప్రొడ్యూసర్ బాగా లేడు, డిస్ట్రిబ్యూటర్ బాగా లేడు. ఓటీటీ, క్యూబ్, బుక్ మై షో సంస్థలు మాత్రమే బాగున్నాయి' అని అన్నారు. టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్ మాట్లాడుతూ 'సింగిల్ స్క్రీన్లు బంద్ అయిపోతున్నాయి. 2016 నుంచి పర్సంటేజీ విధానం కోసం ప్రయత్నిస్తున్నాం. మేము థియేటర్లు బంద్ అని ఎప్పుడూ అనలేదు. ఈ బంద్ వెనుక ఇద్దరు ప్రొడ్యూసర్లు, ఇద్దరు దర్శకులు ఉన్నారు. పవన్ కల్యాణ్ సినిమా వస్తోందని థియేటర్లు ఖాళీగా ఉంచాం. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ కేవలం మూడు సినిమాలు మాత్రమే హిట్ కొట్టాయి. ఆ మూడు చిత్రాల ద్వారానే మాకు రెంటల్ విధానం వర్కౌట్ అయింది. ప్రతి హీరో ఏడాదికి కనీసం రెండు సినిమాలైనా చేయాలని కోరుతున్నాం. మల్టీప్లెక్సులతో పోల్చితే సింగిల్ స్క్రీన్ థియేటర్లలో తిను బండారాల ధరలు తక్కువే' అని అన్నారు.

టీఎఫ్‌సీసీ కొత్త కమిటీ

తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా సునీల్ నారంగ్ ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో కొత్త కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రవీంద్ర గోపాల, ఉదయ్ కుమార్ రెడ్డి, కార్యదర్శిగా శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్ రావు, కోశాధికారిగా సత్యనారాయణ గౌడ్ ఎన్నికయ్యారు. వీరితో పాటు 15 మందిని కార్యనిర్వాహక సభ్యులుగా ప్రకటించారు.

సరికొత్త వినోదం



బన్నీ వాస్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న నూతన చిత్రానికి 'మిత్ర మండలి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌తోపాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్ నీలిరంగు ముసుగుల వెనుక ఉన్న గ్యాంగ్‌ను పరిచయం చేసింది. నూతన దర్శకుడు విజయేందర్.ఎస్ తెరకెక్కిస్తోన్న ఈ చిత్రంలో ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల 'మిషన్ ఇంపాజిబుల్ - ది ఫైనల్ రెకనింగ్' కోసం టామ్ క్రూజ్‌తో కలసి పనిచేసిన నిహారిక ఎన్.ఎం. ఈ చిత్రం ద్వారా తెలుగులోకి అరంగేట్రం చేస్తున్నారు. "మిత్ర మండలి' అనేది స్నేహం ప్రధానంగా నడిచే కథ. ఇది ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందించనుంది' అని చిత్రబృందం తెలిపింది. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప్, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు.

7 రోజుల్లో కోటి కుటుంబాలకు రేషన్

» రేషన్ పంపిణీ చరిత్రలో ఇదో గొప్ప మైలురాయి: మంత్రి నాదెండ్ల

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీని పునఃప్రారంభించిన వారం రోజుల్లోనే కోటికి పైగా కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందించినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్ర ప్రజాపంపిణీ చరిత్రలో ఇదొక గొప్ప మైలురాయి అని శనివారం పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న 1,46,21,232 మంది కార్డుదారులకు ఈ నెల 1నుంచి 29,796 చౌక ధరల దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని పునఃప్రారంభించగా.. శనివారం వరకు 7 రోజుల్లోనే 1,05,27,767 మంది కార్డుదారులు.. అంటే 72 శాతం కుటుంబాలు సరుకులు తీసుకున్నాయని వివరించారు. ప్రతినెలా 1 నుంచి 15 వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు తమకు అనుకూలమైన సమయాల్లో రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించామని పేర్కొన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు మాత్రం వారి ఇళ్ల వద్దే సరుకులు అందించే బాధ్యతలను డీలర్లకే అప్పగించామని తెలిపారు. ఇప్పటివరకు 11,05,439 మందికి వారి ఇంటి దగ్గరకే సరుకులు తీసుకువెళ్లి అందించినట్లు వెల్లడించారు. రేషన్ డీలర్లు సేవా దృక్పథంతో పని చేయాలని సూచించారు.

టీడీపీకి సుగవాసి రాజీనామా




రాయచోటి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం టీడీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబుకు లేఖ పంపారు. గత ఆరునెలలుగా ప్రజలు, అభిమానులు, కార్యకర్తల అభిప్రాయం తీసుకుని.. వాళ్ల మనోభావాల ప్రకారం రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. 1995 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న ఆయన.. రాయచోటి జడ్పీటీసీ సభ్యుడిగా, 2000లో ఉమ్మడి కడప జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పని చేశారు. 2001లో మరోసారి రాయచోటి జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2012లో జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ తరఫున పోటీ ఓటమి పాలయ్యారు. 2024లో మరోసారి ఓటమి చెందాక పార్టీకి దూరంగా ఉన్నారు. కాగా, బాలసుబ్రమణ్యం.. మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు పెద్దకుమారుడు. ఈ కుటుంబం 43 ఏళ్లుగా టీడీపీలో కొనసాగుతోంది. గత నెలలో పాలకొండ్రాయుడు మరణించారు. ఇదిలావుంటే, తన సోదరుడు బాలసుబ్రమణ్యం టీడీపీకి రాజీనామా చేయడం ఆయన వ్యక్తిగత విషయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పేర్కొన్నారు.

రేపటి నుంచి ఏపీ పీజీసెట్

తిరుపతి(విద్య), జూన్ 7(ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ఏపీ పీజీసెట్- 2025 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 9, 10, 11, 12 తేదీల్లో మూడు షిఫ్టులుగా పరీక్షలు జరగనున్నాయి. మొదటి సెషన్ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, మూడవ సెషన్ సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు జరుగనున్నాయి. మొదటి రోజు 17 సబ్జెక్టులకు, రెండో రోజు 7 సబ్జెక్టులకు, మూడవ రోజు 5 సబ్జెక్టులకు, నాల్గవ రోజు 2 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ సహా మన రాష్ట్రంలోని 30 కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి. ఈ ఏడాది పీజీ సెట్‌లో పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, టూరిజం, లైఫ్ సైన్సెస్ సబ్జెక్ట్‌లకు కలిపి ఒకే పరీక్షగా నిర్వహించనున్నారు. ఫలితంగా విద్యార్థులు ఒక్క పరీక్షతో ఏడు సబ్జెక్టుల్లో సీట్లు పొందే అవకాశం ఏర్పడింది. ఇప్పుడు మొత్తం 31 సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగనున్నాయి. ప్రశ్నపత్రాలను ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో సిద్ధం చేశారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషా సంబంధిత సబ్జెక్టులు మాత్రమే ఆయా మాధ్యమాల్లో ఉంటాయి. కాగా 9వ తేదీన పీజీసెట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షతో పాటు డీఎస్సీ పరీక్ష కూడా ఉండటంతో రెండింటికీ హాజరుకానున్న అభ్యర్థుల కోసం ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షను 10వ తేదీ మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించనున్నారు. పీజీసెట్ ఫలితాలను ఈనెల 25వ తేదీలోపు ప్రకటిస్తామని పీజీసెట్ చైర్మన్, ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు చెప్పారు.

తప్పు చేస్తే ఊరుకోను

(మొదటి పేజీ తరువాయి)



"జగన్ పాలనలో రాష్ట్రమంతా నిరాశ, నిస్పృహ, చీకటి అలముకుంది. రాష్ట్ర ప్రజలు భయంకర పరిస్థితులు చవి చూశారు. 1995, 2014లో కూడా ఇన్ని ఇబ్బందులు చూడలేదు. రాష్ట్రం పేరు వింటేనే పెట్టుబడిదారులు వచ్చే పరిస్థితి లేకుండా చేశారు. అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని ఆర్థికంగా పాతాళానికి తొక్కేశారు."

\- సీఎం చంద్రబాబు

నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొందరు బాగానే పనిచేస్తున్నారని చెప్పారు. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పనిచేయాలని, ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించారు. "ఎమ్మెల్యేగా గెలిచాం కదా అని ఎవరైనా అతి విశ్వాసానికి పోతే వారికే ఎక్కువ నష్టం జరుగుతుంది. మీరు వన్‌టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదనేది నా ఆలోచన. కొందరు వన్‌టైం ఎమ్మెల్యేలుగా ఉండిపోతామని అనుకుంటే అది.. వారిష్టం" అని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజలు అన్నీ గమనిస్తుంటారని, జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

ఒకరిద్దరితోనే నష్టం

మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పనితీరుతో ప్రజలకు దగ్గరయ్యారని చంద్రబాబు తెలిపారు. వారి వల్ల పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్నారు. ఒకరిద్దరి ప్రవర్తన కారణంగా అక్కడక్కడా నష్టం జరుగుతోందన్నారు. ఒకరి కోసం పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందంటే అలాంటి నేతలను దూరంగా పెట్టడానికి వెనుకాడబోనని స్పష్టం చేశారు. కొన్ని సందర్భాల్లో పాలనలో తప్పుల వల్ల, అధికారుల తీరు వల్ల కూడా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, మంత్రులు ఈ విషయంలో మరింత బాధ్యతగా ఉండాలన్నారు. "తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే. పనితీరు ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. మంచిచెడులు తెలుసుకుని బాధ్యతగా పనిచేయాలి. పనిచేస్తున్న వారికి ప్రమోషన్ ఉంటుంది. పనిచేయని వారి విషయంలో 1995 నాటి విధానం అమలు చేస్తా." అని స్పష్టం చేశారు. త్వరలోనే ఎమ్మెల్యేలతో ముఖాముఖి భేటీలు నిర్వహించి స్థానిక పరిస్థితులపై చర్చిస్తానని తెలిపారు.

ఏడాది పాలనపై విజయోత్సవాలు

ఏడాది పాలనపై 12న అన్ని నియోజకవర్గాల్లో కూటమి తరఫున విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఏడాది పాలనపై విజయోత్సవాల్లో అన్ని స్థాయిల నేతలు భాగస్వాములు కావాలన్నారు. అదేరోజు సాయంత్రం ఎన్డీయే పక్షాలు, అధికార యంత్రాంగంతో వచ్చే నాలుగేళ్లలో చేపట్టే కార్యక్రమాలపై అమరావతిలో సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. "ఏడాదిలో స్పష్టమైన మార్పు చూపించాం. అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి." అని సూచించారు. "గత జగన్ ప్రభుత్వంలో రాష్ట్రమంతా నిరాశ, నిస్పృహ, చీకటి అలముకుంది. ప్రజలు భయంకర పరిస్థితులు చవి చూశారు. 1995, 2014లో కూడా ఇన్ని ఇబ్బందులు చూడలేదు. రాష్ట్రం పేరు వింటేనే పెట్టుబడిదారులు ఎవరూ వచ్చే పరిస్థితి లేకుండా చేశారు. రాష్ట్రాన్ని అసమర్థ పాలనతో ఆర్థికంగా పాతాళానికి తొక్కేశారు. అయినా సమస్యలు చూసి పారిపోలేదు. అన్నింటినీ చక్కదిద్దుకుంటూ ముందుకెళుతున్నాం." అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. "గత పాలకులు విధ్వంసం చేసిన రాష్ట్రాన్ని సర్వశక్తులు ఒడ్డి ముందుకు తీసుకెళ్తున్నాం. ఆ ఫలితాలు అడ్డుకోవడానికి రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారు. రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞం ఆగదు. మనం తీసుకునే నిర్ణయాలతో మంచి ఫలితాలు వస్తున్నాయి. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. గత ప్రభుత్వ అరాచకాలను గుర్తు చేయాలి" అని దిశానిర్దేశం చేశారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ అందించిందని, అలా అని ఎప్పుడూ వాళ్లవైపు చూడకూడదని సీఎం అన్నారు. రాష్ట్రం నిలదొక్కుకోవాలంటే ఇంకా కష్టపడాలన్నారు. "కేంద్రం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,400 కోట్ల ప్యాకేజీ ఇచ్చింది. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ వస్తుంది. నేను ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేంద్రమంత్రులతో సమావేశమై పరిస్థితులు, ఉన్న అవకాశాలు వివరిస్తున్నాను. మనకు పదవులు కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం. అందుకే చేయూతనివ్వమని కేంద్రాన్ని కోరుతున్నా." అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ నెల 21న విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఒకేచోట 5 లక్షల మందితో యోగాడే నిర్వహిస్తున్నామని అన్నారు. అదే రోజున రాష్ట్రవ్యాప్తంగా లక్ష చోట్ల యోగా నిర్వహిస్తామని, యోగా అందరి జీవితంలో భాగం కావాలని, ఇది మన సంపద, వారసత్వమని చంద్రబాబు అన్నారు. పార్టీ కార్యకర్తలందరూ యోగా దినోత్సవంలో పాల్గొనాలని, ఇది ఏ మతానికీ సంబంధించినది కాదని, ఆరోగ్య రక్షణ కోసం చేసేదని తెలిపారు.

బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు

పోలవరం-బనకచర్ల అనుసంధానంతో అద్భుత ఫలితాలు వస్తాయని, దీనివల్ల తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి నష్టం కలగదని చంద్రబాబు తెలిపారు. గోదావరిలో వృథాగా కలిసే 3 వేల టీఎంసీల నీటిలో 200 టీఎంసీలు మాత్రమే మనం వినియోగించుకుంటామన్నారు. తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా అందరూ తనకు ముఖ్యమేనన్నారు. తెలంగాణ ప్రభుత్వం గోదావరిపై కట్టిన ఏ ప్రాజెక్టునూ టీడీపీ వ్యతిరేకించలేదని, కానీ కొందరు సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని చూస్తున్నారని అన్నారు.

సీఎం చెప్పిన మరిన్ని విషయాలు

- ఈ నెల 12 లేదా 14వ తేదీలోపే 'తల్లికి వందనం' పథకం అమలు.
- ఈ నెలలోనే 'అన్నదాత సుఖీభవ' పథకం కూడా.
- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.
- రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు పాలనా అనుమతులు.
- 4.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు.
- 2027 నాటికి పోలవరం పూర్తి.

ఎవరిని పడితే వారిని చేర్చుకోవద్దు!



» ముందు పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారమివ్వండి

» టీడీపీ నేతలకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా స్పష్టీకరణ

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీలోకి ఇతర పార్టీల నాయకులను చేర్చుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎవరిని పడితే వారిని చేర్చుకోవద్దు' అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశానుసారం పార్టీ నేతలకు ఆయన శనివారం ఓ లేఖ రాశారు. 'ఇతర పార్టీల నుంచి వచ్చే వారిని టీడీపీలో చేర్చుకునే విషయంలో ఎలాంటి తొందరపాటు వద్దు. ఎవరైనా పార్టీలో చేరాలని అనుకుంటే తప్పనిసరిగా వారి గురించి టీడీపీ కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలి. కేంద్ర కార్యాలయం వారి గురించి విచారణ చేసిన తర్వాత పార్టీ అనుమతితో వారిని పార్టీలోకి ఆహ్వానించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు అందరూ గమనించాలి' అని పల్లా స్పష్టం చేశారు.

ముకేశ్ అంబానీ దాతృత్వం.. ఐసీటీకి రూ.151 కోట్ల విరాళం



» రసాయన శాస్త్రవేత్త ఎంఎం శర్మ పుస్తకావిష్కరణ సభలో వెల్లడి..!

న్యూఢిల్లీ, జూన్ 7: రిలయన్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ భారీ విరాళం ప్రకటించారు. తాను ముంబైలో 1970ల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐసీటీ)కి బేషరతుగా రూ.151 కోట్ల విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. ఐసీటీ రసాయన శాస్త్రవేత్త-ప్రొఫెసర్ ఎంఎం శర్మ జీవిత చరిత్ర 'డివైన్ సైంటిస్ట్' పుస్తకావిష్కరణ శుక్రవారం జరిగింది. ఈ సభలో ముకేశ్ అంబానీ మాట్లాడుతూ ప్రొఫెసర్ ఎంఎం శర్మ సూచన మేరకు 'గురుదక్షిణ'గా సంస్థకు విరాళం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. నిత్యం బిజీబిజీగా ఉండే ముకేశ్.. ఈ పుస్తకావిష్కరణ సభలో 3 గంటలకు పైగా సమయం వెచ్చించడం గమనార్హం. తనకు స్ఫూర్తిగా నిలిచిన ప్రొఫెసర్ ఎంఎం శర్మ.. దేశంలో ఆర్థిక సంస్కరణల అమలులో కీలక భూమిక పోషించారని కొనియాడారు. ఎంఎం శర్మ- భారత్ గురు అని పేర్కొన్నారు. లైసెన్స్ రాజ్ సంకెళ్ల నుంచి విముక్తి కలిగించినప్పుడే విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గించి, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలతో పోటీ పడి భారత్ పారిశ్రామిక రంగం ఎదుగుతుందని విధాన నిర్ణేతలను ఎంఎం శర్మ ఒప్పించారని ముకేష్ అంబానీ తెలిపారు. భారత పారిశ్రామిక రంగంలో మార్పులు తెస్తేనే అంతర్జాతీయ రంగంలో కొరతను అధిగమించగలమని తన తండ్రి ధీరూభాయి అంబానీ, ప్రొఫెసర్ శర్మ అభిలషించారని అభిప్రాయ పడ్డారు. ప్రైవేటు పెట్టుబడుల భాగస్వామ్యంతో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం దేశంలో సంపద సృష్టిస్తుందన్నారు.

కోయంబత్తూరు ఎయిర్‌పోర్ట్‌లో రూ.3 కోట్ల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా నుంచి సింగపూర్ మీదుగా కోయంబత్తూరు చేరిన విమానంలో రూ.3 కోట్ల విలువ గంజాయిని తరలించిన మహిళను కస్టమ్స్ అధికారులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. విదేశాల నుంచి వచ్చే విమానంలో గంజాయిని తరలిస్తున్నట్టు అందిన రహస్య సమాచారంతో కస్టమ్స్ అధికారులు శుక్రవారం రాత్రి నిఘా ముమ్మరం చేశారు. ఆస్ట్రేలియా నుంచి వచ్చిన విమాన ప్రయాణికులను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ మహిళ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో ఆమెను ప్రత్యేక గదికి తీసుకెళ్లి మహిళా పోలీసుల చేత తనిఖీ చేయించారు. ఆ తనిఖీల్లో ఆ మహిళ లోదుస్తుల్లో దాచిన 3 కిలోల గంజాయి ప్యాకెట్లు కిందపడటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ మహిళను అదుపులోకి తీసుకున్న కస్టమ్స్ అధికారులు విచారణ జరుపుతున్నారు.

అది వేశ్యల రాజధాని

అమరావతిపై మరోసారి జగన్ బ్యాచ్ విషం.. సాక్షి లైవ్ డిబేట్‌లో మహిళలకు ఘోర అవమానం



కేఎస్ఆర్, జర్నలిస్టు కృష్ణంరాజు ఫొటోలను చెప్పులతో కొడుతున్న రాజధాని అమరావతి మహిళలు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: రాజధాని అమరావతిపై జగన్ అండ్ బ్యాచ్ మరోసారి విషం చిమ్మింది. ఇక్కడి మహిళలను తీవ్రంగా కించపరచడమే లక్ష్యంగా బరితెగించింది. అమరావతి వేశ్యల రాజధాని అంటూ రోత చానల్‌లో జర్నలిస్టుల ముసుగులో ఉన్న వ్యక్తులు శనివారం ఉదయం లైవ్ డిబేట్‌లో నోరుపారేసుకున్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు (కేఎస్ఆర్) నిర్వహించిన డిబేట్‌లో పాల్గొన్న జర్నలిస్టు, విశ్లేషకుడు కృష్ణంరాజు మాట్లాడుతూ.. "చంద్రబాబు అమరావతి దేవతల రాజధాని అంటున్నారు, కానీ ఇది సెక్స్ వర్కర్లకు నిలయం. ఇక్కడే ఎక్కువ మంది వేశ్యలు ఉన్నారు. వారికోసం ఎన్నో స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి" అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై రాజధాని మహిళలు భగ్గుమన్నారు. రాజధాని అమరావతి మహిళలను కించపరిచిన వారు వెంటనే క్షమాపణలు చెప్పాలని అల్టిమేటమ్ జారీ చేశారు. కృష్ణంరాజుకు మహిళల చేతిలో చెప్పు దెబ్బలు తప్పవన్నారు. డిబేట్ నిర్వహించిన కొమ్మినేని కూడా క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు. సాటి మహిళలను అగౌరవపరుస్తుంటే ఖండించకుండా ఉన్నందుకు భారతిరెడ్డి కూడా బాధ్యురాలేనని, ఆమె కూడా మహిళలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఐదేళ్లు అమరావతి ఉద్యమం చేసి వైసీపీకి 11 సీట్లు మాత్రమే వచ్చేటట్టు చేసి సత్తా చాటామని, ఇప్పుడు సాక్షి చానల్ మూసే వరకు మరో ఉద్యమం చేపడతామని మహిళలు ప్రకటించారు. ఉద్యమం తమకు కొత్తకాదని, కేసులు కూడా కొత్త కాదన్నారు. రాజధాని ప్రాంత మహిళలను తీవ్రంగా కించపరచడంలో భాగస్వాములైన ఆ ముగ్గురు బహిరంగ క్షమాపణలు చెప్పాలని, లేదంటే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని రైతు జేఏసీ హెచ్చరించింది. ఈ సందర్భంగా మహిళలు కేఎస్ఆర్, కృష్ణంరాజు ఫొటోలను గోడకు అతికించి చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. అనంతరం తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లి ఫిర్యాదు చేశారు. కేఎస్ఆర్, జర్నలిస్ట్ కృష్ణంరాజును 24 గంటల్లో అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని ఐదు కోట్ల ఆంధ్రులదని, పూర్వకాలం నుంచి ఈ ప్రాంతానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని మహిళలు చెప్పారు. కృష్ణంరాజును, కేఎస్ఆర్‌ను ఉరితీయాలని ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి చానల్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా పెదపాడు పోలీస్‌స్టేషన్‌లో కూటమి శ్రేణులు ఫిర్యాదు చేశాయి.



మహిళలను అసభ్యంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కి వెళుతున్న మహిళలు, రైతులు



జర్నలిస్ట్ కృష్ణంరాజు ఫొటోను కాళ్ల కింద వేసి తొక్కుతున్న రాజధాని అమరావతి మహిళలు

కృష్ణంరాజు ఇంటిని ముట్టడించిన రైతులు

అసభ్యకర వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు వాడపల్లి కృష్ణంరాజు ఇంటిని అమరావతి రైతులు శనివారం ముట్టడించారు. విజయవాడ అయోధ్యనగర్‌లోని ఆయన ఇంటికి రైతులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమరావతి మహిళలకు కృష్ణంరాజు తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు వస్తున్నారన్న సమాచారంతో కృష్ణంరాజు ఇంటి నుంచి పారిపోయారు. ఆయన ఇంటి ముందు రైతులు కొద్దిసేపు నినాదాలు చేసి వెనుదిరిగారు.

కృష్ణంరాజు, కేఎస్ఆర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి: బాలకోటయ్య

రాజధాని అమరావతిపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన కేఎస్ఆర్, కృష్ణంరాజులను వెంటనే అరెస్ట్ చేయాలని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య డిమాండ్ చేశారు. ప్రజా రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అని వ్యాఖ్యానించడం క్షమించరాని నేరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. 24 గంటల్లో వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని బాలకోటయ్య డిమాండ్ చేశారు.

ఆ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం: సాక్షి యాజమాన్యం

సాక్షి టీవీ వేదికగా జర్నలిస్టులు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అంతా ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. సాక్షిపై సోషల్ మీడియాలో కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జరిగిన తప్పునకు క్షమాపణలు కోరాల్సిన సాక్షి యాజమాన్యం, వైసీపీ రాష్ట్ర నాయకత్వం తప్పించుకునే ప్రయత్నం చేసింది. కృష్ణంరాజు వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని.. ఇందులో సాక్షి యాజమాన్యానికిగానీ, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డికి గానీ సంబంధం లేదంటూ శనివారం ప్రకటించి చేతులు దులుపుకొన్నాయి.

రాజధానిలో ఆగ్రహజ్వాలలు

తుళ్లూరులో శనివారం సాయంత్రం రాజధాని మహిళలు, రైతులు, రైతు కూలీలు లైబ్రరీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కేఎస్ఆర్, కృష్ణంరాజు దిష్టిబొమ్మలను దహనం చేశారు. సాక్షి పత్రికను అబద్ధాల వైసీపీ కరపత్రిక అంటూ రోడ్డుమీద తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. సాక్షి పత్రిక, చానెల్ నడుపుతున్న భారతీరెడ్డి క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. గవర్నర్‌ను, జాతీయ మహిళా కమిషన్‌ను కలసి ఫిర్యాదు చేస్తామని రైతు జేఏసీ తెలిపింది. జర్నలిస్ట్ ముసుగులో జగన్‌రెడ్డి చెంచాగా వ్యవహరించే కృష్ణంరాజును వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించింది. ఇక మహిళలకు రక్షణగా సెంటర్‌లో రైతులు మానవహారంగా ఏర్పడ్డారు. కృష్ణంరాజు, కేఎస్ఆర్ చిత్రపటాలను చెప్పులతో కొట్టి, కాళ్ల కింద వేసి తొక్కారు. అటుగా వెళ్తున్న బస్సులు, వాహనాల్లో ఉన్న ప్రయాణికులు కూడా దిగివచ్చి మహిళలకు సంఘీభావం తెలిపారు.



మహిళలను అవమానిస్తే కాలగర్భంలో కలిసిపోతారు

» జగన్ గ్యాంగ్‌ని ఎట్టిపరిస్థితుల్లో క్షమించం: మంత్రి లోకేశ్

» వైసీపీ అధ్యక్షుడు జగన్ ఇల్లు ఎక్కడుంది?: గొట్టిపాటి

» ఆడబిడ్డలను అవమానించిన వారిని ఉపేక్షించొద్దు: అనగాని

» క్షమాపణ చెప్పకుంటే మహిళా లోకం తిరగబడుతుంది: కొలుసు

అమరావతి, నూజివీడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత మహిళలను కించపరుస్తూ జగన్ చానల్‌లో పాత్రికేయుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై పలువురు ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై ద్వేషంతో మహిళలను అవమానించడం వైసీపీ దిగజారుడుతనానికి పరాకాష్ఠ అని మంత్రి లోకేశ్ మండిపడ్డారు. 'మహిళలను అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయం. ఆకాశంపై ఉమ్మేయాలనుకుంటే అది మీ మీదే పడుతుంది. అమరావతిపై విషం చిమ్మాలనుకుంటే అది మీ తాడేపల్లి ప్యాలెస్‌లోనే పడుతుంది. అమరావతి ముమ్మాటికీ దేవతల రాజధానే. భూములు త్యాగాలు చేసిన అమ్మల అమరావతి. మూడు రాజధానుల కపట కుట్ర పొత్తిళ్లలో తంతుంటే.. జై అమరావతి అని నినదించిన శాంతమూర్తుల పవిత్ర భూమి మన రాజధాని. కన్న తల్లిని, సొంత చెల్లిని తరిమేసిన దుర్మార్గుడికి మహిళల త్యాగాలు, గొప్పతనం ఏం తెలుస్తుంది? అమరావతిపై విషం చిమ్మేందుకు జన్మనిచ్చిన అమ్మలను, జన్మంతా మనతో నడిచిన మహిళాలోకాన్ని కించపరిచిన జగన్ గ్యాంగ్‌ని ఎట్టి పరిస్థితుల్లో క్షమించం. జగన్‌రెడ్డి బేషరతుగా మహిళలకు క్షమాపణ చెప్పాలి. లేకుంటే దేవతల రాజధాని అమరావతి... దెయ్యం జగన్ పని పడుతుంది' అని లోకేశ్ హెచ్చరించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'రాజధాని మహిళల్ని కించపరచేలా వైసీపీ పేటీఎం బ్యాచ్ మాట్లాడుతోంది. జగన్ ఇల్లు ఎక్కడుంది? రాజధాని మహిళలను కించపరచేలా మాట్లాడుతున్న వైసీపీ నేతలు తినేది అన్నమేనా లేదా ఇంకేదైనానా? పనికిమాలిన బ్యాచ్‌తో ఇంకెంతకాలం అమరావతిపై విషప్రచారం సాగిస్తారు? తలాతోకా లేకుండా అర్థం లేని వ్యాఖ్యలతో మహిళల్ని కించపరచే మీరు మనుషులేనా?' అని గొట్టిపాటి మండిపడ్డారు. మంత్రి కొలుసు పార్థసారథి ఓ ప్రకటన చేస్తూ... 'రాజధాని అమరావతి ప్రాంత మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. వారి మాటలు వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో సాక్షి పత్రికపై, కృష్ణంరాజుపై తిరుగుబాటు తప్పదు. కృష్ణంరాజును మహిళలు తరిమి, తరిమి కొడతారు' అని హెచ్చరించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, 'రాజధాని అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడటం నీచాతినీచం. ఆడబిడ్డలను అవమానించిన వారిని ఉపేక్షించకూడదు' అని అన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పందిస్తూ... ఆడబిడ్డలందరినీ ఘోరంగా అవమానించేలా వ్యాఖ్యలు చేయించడం వైసీపీ చెత్త రాజకీయాలకు నిదర్శనం' అని విమర్శించారు.

కొమ్మినేని, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోండి
డీజీపీకి డిప్యూటీ స్పీకర్ రఘురామ లేఖ

రాష్ట్ర రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అంటూ వ్యాఖ్యానించిన జర్నలిస్టు కృష్ణంరాజు, ఆ కార్యక్రమ నిర్వాహకుడు కొమ్మినేని శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. ఈమేరకు ఆయన శనివారం డీజీపీకి లేఖ రాశారు. మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసినందుకు కొమ్మినేని, కృష్ణంరాజుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ కార్యక్రమాన్ని టెలీకాస్ట్ చేసిన జగన్ మీడియాపైనా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా మహిళల గౌరవాన్ని, అమరావతి ప్రతిష్ఠను కాపాడాలని లేఖలో డిప్యూటీ స్పీకర్ కోరారు.



కాకినాడలో 7 వేల మందితో యోగా

యోగాంధ్రలో భాగంగా కాకినాడ ప్రధాన రహదారిలో శనివారం ఏడు వేల మందితో యోగా నిర్వహించారు. పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి ఎల్ఐసీ భవనం వరకు... కిలోమీటర్ మేర యోగాభ్యాసకులు ఆసనాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష ప్రాంతాల్లో 'యోగాంధ్ర'

2 కోట్ల మందితో నిర్వహిస్తాం .. ఆరోగ్యాంధ్ర దిశగా అడుగులు: మంత్రి సత్యకుమార్

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకాలతో అస్తవ్యస్తంగా మారిన ప్రజారోగ్య వ్యవస్థను ప్రక్షాళన చేసి గాడిలో పెట్టామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. డిజిటల్ ఆరోగ్య సేవలు, ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, లక్ష ప్రాంతాల్లో 2 కోట్ల మందితో 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహించి ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ నెల 12నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మంత్రి శనివారం విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్య కార్యక్రమాల అమలులో వేగం పెంచి సత్ఫలితాలు సాధించడం, రోగ నిర్ధారణ పరీక్షల సామర్థ్యం పెంపు, వైద్య సిబ్బందిలో క్రమశిక్షణ, జవాబుదారీతనాన్ని పెంచడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఫలితంగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సిబ్బంది హాజరు 7.42% నుంచి 14.20 శాతానికి పెరిగిందని తెలిపారు. ఓపీ సేవలు 8%, ఐపీ సేవలు 17.61% పెరిగాయని చెప్పారు. ఎన్‌హెచ్ఎం కింద 2024-25లో కూటమి ప్రభుత్వం 30కి పైగా పథకాలను అమలు చేసిన తీరు, సాధించిన ఫలితాలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతిగా రూ.100 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఇలాంటి గుర్తింపు రాష్ట్రానికి లభించలేదన్నారు. 104 సంచార వైద్య వాహనాల ద్వారా ప్రజల ఇంటివద్దనే 47 రకాల వైద్య పరీక్షలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సర్వజనాస్పత్రులకు 3,200కు పైగా ఆధునిక పరికరాలు సమకూర్చామని, రాష్ట్రవ్యాప్తంగా 58 లక్షల మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామని మంత్రి పేర్కొన్నారు. వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కమిషనర్ జి.వీరపాండియన్ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఉత్తీర్ణత 53%

- రేపటి నుంచి రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తులు

అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాల్లో 52.9శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. బెటర్‌మెంట్ పరీక్షలు రాసిన విద్యార్థుల్లో 81శాతం మంది మార్కులు మెరుగుపరుచుకున్నారు. సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాలను ఇంటర్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా శనివారం విడుదల చేశారు. ఫస్టియర్‌లో జనరల్ అభ్యర్థులు 1,27,182 మంది పరీక్షలు రాయగా 57,400 మంది(45శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ ఒకేషనల్ విద్యార్థులు 13,690 మంది పరీక్షలు రాస్తే 6,725 మంది(49శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా ఫస్టియర్‌లో 46శాతం ఉత్తీర్ణత నమోదైంది. సెకండియర్ జనరల్ విద్యార్థులు 87,793 మంది పరీక్షలు రాస్తే వారిలో 55,210 మంది(63శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ ఒకేషనల్‌లో 10,170 మంది పరీక్షలు హాజరైతే 6,777 మంది(67శాతం) ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా సెకండియర్‌లో 63శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక బెటర్‌మెంట్ పరీక్షలు రాసిన ఫస్టియర్ విద్యార్థుల్లో జనరల్ కోటాలో 2,30,303 మందికి 1,90,038 మంది(83శాతం) మంది, ఒకేషనల్ కోటాలో 5,659 మందికి 1,705 మంది(30 శాతం) మార్కులు మెరుగుపరుచుకున్నారు. మొత్తంగా 81శాతం మంది మార్కులు మెరుగుపడ్డాయి. మొత్తంగా రెండేళ్లలో 63శాతం మంది అబ్బాయిలు, 64శాతం మంది అమ్మాయిలు సప్లిమెంటరీలో ఉత్తీర్ణులయ్యారు. సాధారణ ఫలితాలు, సప్లిమెంటరీ ఫలితాలు కలిపి చూస్తే ఈ ఏడాది జనరల్ విద్యార్థులు ఫస్టియర్‌లో 82.16శాతం మంది, సెకండియర్‌లో 93.35శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గత మూడేళ్ల ఫలితాల్లో ఇదే అత్యధికం. సప్లిమెంటరీ ఫలితాలపై విద్యార్థులు ఈనెల 9 నుంచి 13 వరకు రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని బోర్డు తెలిపింది. ఒక్కో సబ్జెక్టుకు రీవెరిఫికేషన్‌కు రూ.1300, రీకౌంటింగ్‌కు రూ.260 దరఖాస్తు ఫీజు చెల్లించాలి.

రెండోరోజూ కాకాణిది అదే తీరు

- ఏ ప్రశ్న అడిగినా తెలియదనే జవాబు
- నేటితో ముగియనున్న పోలీసు కస్టడీ



నెల్లూరు(క్రైం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి పోలీసు కస్టడీలో రెండోరోజు శనివారం కూడా నోరు మెదపలేదని తెలిసింది. పొదలకూరు మండలం రుస్తుం మైన్స్‌లో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న కాకాణిని కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. కృష్ణపట్నం పోలీసు స్టేషన్‌లో నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విచారణ సాగింది. పోలీసులు ఏ ప్రశ్న అడిగినా 'నాకు తెలియదు, గుర్తులేదు...' అని మాత్రమే కాకాణి సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ఆదివారంతో కాకాణి పోలీసు కస్టడీ ముగియనుంది. కాగా, రుస్తుం మైన్స్ అక్రమ తవ్వకాల కేసులో వేమిరెడ్డి అరవింద్ కుమార్‌రెడ్డి(ఏ6)కి నాలుగు రోజుల క్రితం బెయిల్ మంజూరు కాగా, కరుణాకర్‌రెడ్డి(ఏ7), శివారెడ్డి (ఏ8)కి హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారు శనివారం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు.

ఎందుకీ వాహన సేవ?

(మొదటి పేజీ తరువాయి)

సరుకులను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. దాదాపు 30 వేల చౌక ధరల దుకాణాల ద్వారా కొన్ని దశాబ్దాలుగా రేషన్ సరుకుల పంపిణీ సజావుగా సాగిపోతోంది. రేషన్ డీలర్లకు ఆయా సరుకులపై కమీషన్ మాత్రమే చెల్లించేవారు. ప్రభుత్వానికి ఒక్కో డీలరుపై నెలకు సగటున రూ.7 వేలకు మించి ఖర్చు వచ్చేది కాదు. అయితే... గత జగన్ ప్రభుత్వం ఎవరూ అడక్కపోయినా డోర్ డెలివరీ పేరుతో అనాలోచితంగా రేషన్ వాహనాలను తీసుకొచ్చింది. ఇదో పెద్ద ప్రహసనం, తతంగం! సుమారు రూ.539 కోట్లు బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి... 9260 ఎండీయూ వ్యాన్లు కొనుగోలు చేసింది. ఈ వాహనాలను లబ్ధిదారులకు అప్పగించింది. వీరిలో అత్యధికులు వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులే అన్నది బహిరంగ రహస్యం. లబ్ధిదారుల నుంచి 10 శాతం వాటా తీసుకుని.. మిగిలిన 90 శాతం అప్పును ప్రభుత్వమే చెల్లించేలా బ్యాంకులతో ఒప్పందం చేసుకుంది. అంటే.. సుమారు రూ. 6 లక్షల విలువైన వాహనంలో రూ.60వేలు లబ్ధిదారుడు కట్టగా, మిగిలిన రూ.5.40 లక్షల రుణాన్ని ప్రభుత్వమే చెల్లించాలన్న మాట. ఆ వాహనాల ఈఎంఐల కింద సుమారు రూ. 247 కోట్లు, ఏటా సర్వీసు ఫీజు కింద రూ. 200 కోట్లు చెల్లిస్తూ, వాహనాల బీమా... దీనికి అదనంగా ప్రతినెలా ఎండీయూ ఆపరేటర్లకు రూ.21వేల జీతం! వెరసి... ఇంటింటికీ రేషన్ పేరుతో ఎండీయూ వాహనాలకు ఇప్పటి వరకు రూ. 1,860 కోట్లు ఖర్చు చేసేశారు. రేషన్ డీలర్లకు కమీషన్ చెల్లిస్తూనే... రేషన్ వాహనాలకు ఇంత భారీస్థాయిలో ప్రజాధనాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇదో గుదిబండగా మారింది. రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది. ఇంత చేసినా పేదలకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ అవుతున్నాయా? అంటే అదీ లేదు. నెలలో 15 రోజులు మాత్రమే రేషన్ వాహనాలను రేషన్ సరుకుల పంపిణీకి వినియోగిస్తున్నారు.



ఎండీయూ వాహనంపై అతికించిన స్టిక్కర్‌ను తొలగిస్తే కనిపించిన జగన్ బొమ్మ

మిగిలిన రోజులన్నీ ఆ వాహనాలను ఆపరేటర్లే తమ సొంత పనులకు వినియోగించుకుంటున్నారు. పైగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 600 మంది ఎండీయూ ఆపరేటర్లు తమ వాహనాలను తిప్పడం మానేశారు. ఇంటింటికీ పంపిణీ ఒక మిథ్యగా మారింది. నెలలో ఒక రోజు... వీధి చివర్లో బండి నిలిపి, సైరన్ మోగిస్తే లబ్ధిదారులు బండి ముందు క్యూలో నిల్చుని సరుకులు తీసుకోవాలి. ఆ సమయానికి కార్డుదారుడు అందుబాటులో లేకుంటే అంతే సంగతులు. ఇక... గత ప్రభుత్వంలో రేషన్ మాఫియా వ్యవస్థీకృతమైపోయింది. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేసుకుంది. ఇంటింటికీ తిరుగుతున్న ఎండీయూ ఆపరేటర్లే కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించడం మొదలుపెట్టారు. ప్రభుత్వం కిలో రూ.46కు పైగా ఖర్చు పెట్టి పేదలకు ఉచితంగా అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని కార్డుదారుల నుంచి కేవలం రూ.10 లకే తీసుకోవడం, చాలామందికి సరుకులు ఇవ్వకుండానే వెళ్లిపోవడం, ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నేరుగా ఎండీయూ వాహనాల్లోనే స్మగ్లర్ల అడ్డాలకు రేషన్ బియ్యాన్ని తరలించడం వంటి ఉదంతాలు ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చాయి. బియ్యం అక్రమ రవాణాలో భాగస్వాములైన దాదాపు 300 మంది ఎండీయూ ఆపరేటర్లపై కేసులుకూడా నమోదయ్యాయి. ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టినతర్వాత రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. వీటన్నింటి నేపథ్యంలో... కూటమి ప్రభుత్వం ఈపద్ధతిని మార్చేసింది. ప్రతి నెలా 15 రోజుల్లో ఎప్పుడైనా,ఎక్కడైనా రేషన్ డీలర్ వద్ద సరుకులు తీసుకునే పాత విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇది బా గానే ఉంది! కానీ...ఎండీయూ వాహనాల మాటేమిటి?

ఊరికే ఇచ్చేస్తారా?

సాధారణంగా ప్రభుత్వం తమ అధికారుల కోసం వాహనాలను అద్దెకు తీసుకుంటే... నెలవారీగా అద్దె, ఇతర ఖర్చులను చెల్లిస్తారు. అంతటితో అది పూర్తవుతుంది. అంతేగానీ ప్రభుత్వమే వాహనం కొనిచ్చి.. నెలనెలా వేతనాలు చెల్లించి.. ప్రభుత్వానికి చెందిన ఆ వాహనాన్ని మళ్లీ ఆపరేటర్‌కే అప్పగించడం ఎక్కడా ఉండదు. స్వయం ఉపాధి పథకాల కింద వాహనాలను లబ్ధిదారులకు ఇవ్వడం సహజం. కానీ... ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానం రద్దు చేసినప్పటికీ... వాటిని మాత్రం వాటి ఆపరేటర్లకే 'ఫ్రీ'గా ఇచ్చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకోవడమే విచిత్రం! ఒక్కో వాహనానికి ఆపరేటర్ భరించింది రూ.60 వేలు. మిగిలిన రూ.5.40 లక్షలు బ్యాంకు రుణం! ఆ మొత్తం ప్రభుత్వమే చెల్లించనుంది. అంతేకాదు... వాహనం కూడా ఆపరేటర్‌కే సొంతమవుతుంది. వెరసి... జగన్ సర్కారు ప్రవేశపెట్టిన 'ఇంటింటికీ రేషన్' విధానం మాత్రమే రద్దయింది. వాహనానికి సంబంధించి ఆయన తీసుకున్న నిర్ణయమే అమలవుతోంది. తన భవిష్యత్తు అవసరాల కోసం రేషన్ వాహనాలను ఉపయోగించుకునే వ్యూహంలో భాగంగా జగన్ నిర్ణయాలు తీసుకుని ఉండవచ్చు. కానీ... కూటమి ప్రభుత్వం కూడా అదే బాటలో నడవడం ఎందుకు? వాటిని ఆపరేటర్లకే ఉచితంగా ఇచ్చేయడంలో హేతుబద్ధత ఏమిటి? వాహనం కావాలంటే రుణం మీరే చెల్లించండి. వద్దనుకుంటే... వాహనం వెనక్కి ఇచ్చేయండి! అని ఎందుకు చెప్పడంలేదు?



ఖాళీగా ఉన్న విజయవాడ బందరు రోడ్డు

కోస్తాలో ఠారెత్తించిన ఎండ

- నేడు అక్కడక్కడా పిడుగులతో వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రుతుపవనాలు మందగించడం, బంగాళాఖాతంలో అల్పపీడనాలు లేకపోవడంతో కోస్తాలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. శనివారం కొన్నిచోట్ల వడగాడ్పులు వీచాయి. వరుసగా నాలుగోరోజు కోస్తాలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కావలిలో 41.1, గన్నవరంలో 41, నెల్లూరులో 40.8, అమరావతిలో 40.7, బాపట్లలో 40.5, ఒంగోలులో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు రాష్ట్రంలో ఆదివారం ఉక్కపోతతో పాటు40-41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రానున్న 24 గంటల్లో కోస్తాలో ఎండ వేడి కొనసాగుతుందని, కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఉరుములు, పిడుగులో వర్షాలు కురుస్తాయని తెలిపింది. అల్లూరి, కాకినాడ, ప్రకాశం, పల్నాడు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది.

రాష్ట్రపతి విశాఖ పర్యటన వాయిదా



విశాఖపట్నం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖపట్నం పర్యటన వాయిదా పడింది. ఈ నెల పదో తేదీన నగరంలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు కావలసి ఉంది. అధికార యంత్రాంగం అందుకు తగిన ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అనివార్య కారణాలవల్ల స్నాతకోత్సవాన్ని తాత్కాలికంగా వాయిదావేశామని, త్వరలో మరోతేదీ ప్రకటిస్తామని విశ్వవిద్యాలయం మీడియా సెల్ చైర్మన్ తెలిపారు.

లిక్కర్ సొమ్ము విదేశాలకు!

(మొదటి పేజీ తరువాయి)

డబ్బులు చేరినట్లు ఆధారాలు సేకరించడంలో సిట్ అధికారులు ఎంతో ప్రయాస పడ్డారు. సుమారు 200 మందిని విచారించి కీలక నిందితుల్ని అరెస్టు చేశారు. మద్యం వ్యాపారాన్ని నియంత్రించే ఉద్దేశంతో ఏర్పాటైన సిండికేట్‌లో కీలక సభ్యుడైన బాలాజీ గోవిందప్ప, రాజ్ కసిరెడ్డి ముఖ్య అనుచరుడు చాణక్య ఇచ్చిన సమాచారం, వారి బ్యాంకు లావాదేవీల ఆధారంగా ముంబైలో పెద్ద వ్యవహారమే నడిచినట్లు పసిగట్టారు. రాజ్ కసిరెడ్డి ఆఫీసు, ఇంట్లో స్వాధీనం చేసుకున్న రికార్డుల ద్వారా తేల్చిన గుట్టు, బాలాజీ గోవిందప్ప మైసూరులో బినామీ పేరుతో తెరిచిన బ్యాంక్ అకౌంట్, ముడుపులు వసూలు చేసిన ఏ6 చాణక్య విచారణలో వెల్లడించిన అంశాలను క్రోడీకరించి పోలీస్ బాస్‌కు వివరించారు. సిట్ అధికారులు ఇచ్చిన ఈ కీలక సమాచారం ఆధారంగా.. ఐదు రోజుల క్రితం సీఐడీ డీఐజీ ఫక్కీరప్ప కాగినెల్లి నేతృత్వంలో పది మంది అధికారుల బృందాన్ని ముంబైకి పంపారు. అక్కడ పలు బ్యాంకుల కేంద్ర కార్యాలయాలకు వెళ్లి షెల్ కంపెనీల లావాదేవీలను పరిశీలించింది. రెండు షెల్ కంపెనీలకు సంబంధించిన వ్యవహారాల్లో బాలాజీ గోవిందప్ప బాగోతం బయటికొచ్చింది. స్వతహాగా ఆడిటర్ అయిన గోవిందప్ప చాలా



సంవత్సరాలుగా లెక్కల గోల్‌మాల్‌లో ఆరితేరినట్లు తెలుసుకున్న దర్యాప్తు బృందం అక్కడి ఆడిటర్లతో పాటు ఆదాయపు పన్ను అధికారుల సహకారం తీసుకుంది. పలు షెల్ కంపెనీల ద్వారా భారీ మొత్తం దేశం దాటి వెళ్లినట్లు కీలక ఆధారాలు సేకరించింది. మొత్తం ఐదు దశల్లో.. అంటే ఏ నుంచి బీకి.. బీ నుంచి సీకి.. ఇలా ఐదు కంపెనీలు దాటిన తర్వాత ఆరో షెల్ కంపెనీ ఎఫ్ నుంచి దేశం దాటినట్లు తేలింది. మరో నాల్గైదు రోజుల పాటు అక్కడే ఉండి మరింత కీలక సమాచారాన్ని తీసుకు వస్తామని సీఐడీ బృందం పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చింది. అత్యంత కీలకమైన ఆ ఆధారాలతో రాష్ట్రంలో రాజకీయ సంచలనాలకు దారి తీసే చర్యలకు పోలీసులు ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


మాన్షన్ హౌస్.. బంగారు బాతు

ముంబైలో 'మాన్షన్ హౌస్' యాజమాన్యం ఇచ్చిన ముడుపులు బంగారు బాతు గుడ్లేనని దర్యాప్తు సంస్థ నిర్ధారణకు వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ లిక్కర్ బ్రాండ్‌కు ఎక్కువ సేల్స్ ఉంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ బ్రాండ్ మద్యాన్ని ఏపీలో సరఫరా చేసే ఎంఎస్ బయోటెక్ కంపెనీ యజమాని జయపాల్ రెడ్డిపై లిక్కర్ మాఫియా కమీషన్ల కోసం ఒత్తిడి తెచ్చింది. ఆయన స్పందించక పోవడంతో ఆ బ్రాండ్ లిక్కర్ ఆర్డర్లను ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా బ్లాక్ చేయించారు. చివరకు ఆయన దారికి రావడంతో బేసిక్ ధరలో 20 శాతం ముడుపులు ప్రతి వారం చెల్లించాల్సిందిగా రహస్య ఒప్పందం చేసుకున్నారు. జయపాల్ రెడ్డి సిబ్బంది శ్రీనాథ్, ప్రవీణ్ ద్వారా మద్యం మాఫియా ముఠాకు చెందిన చాణక్య, ప్రకాశ్‌కు చేరింది. అయితే నగదు కాకుండా బంగారం రూపంలో ఇవ్వాలని అడగడంతో ముంబైలో పేరున్న బంగారం షాపులకు ముడుపుల డబ్బులు మళ్లించి బంగారం బిస్కెట్లు తీసుకున్నారు. భారతీ సిమెంట్స్‌లో శాశ్వత డైరెక్టర్ అయిన బాలాజీ గోవిందప్ప ఒక కీలక మహిళకు అత్యంత నమ్మకస్తుడు. నగదు తీసుకున్నా దాచుకోవడం కష్టమని.. బంగారం అయితే ఏటా విలువ పెరుగుతుందని ఆయన చేసిన సూచనతోనే ఈ బాగోతం నడిచినట్లు సీఐడీ అధికారులు భావిస్తున్నారు. జగన్ హయాంలో 1400 కోట్ల రూపాయల విలువైన మద్యం సరఫరా చేసిన మాన్షన్ హౌస్ 20 శాతం కమీషన్ అంటే... 280 కోట్ల రూపాయల విలువ చేసే బంగారం గనినే అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ గని బయట పడితే అంతిమ లబ్ధిదారు అసలు రూపం ప్రజలకు స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది.

సొమ్ము షెల్ కంపెనీలకు..

లిక్కర్ స్కామ్‌లో సిట్ అధికారులు సుమారు 196.5 కోట్ల రూపాయల బంగారం షాపుల లావాదేవీలు గుర్తించారు. అందులో పద్మావతి జ్యుయలరీ షాప్‌కు 107 కోట్లు, తాయాల్ ఎంటర్ ప్రైజెస్‌కు 85 కోట్లు, సోనా చాంది జ్యుయలర్స్‌కు 3.5 కోట్లు, ఉదయ్ జ్యుయలరీ ఇండస్ట్రీస్‌కు సుమారు కోటి రూపాయల వరకు చెల్లించి బంగారం కొన్నట్టు తేల్చారు. రాజ్ కసిరెడ్డి ముఖ్య అనుచరుడైన చాణక్య వ్యవహారాలు నడిపినట్లు అధికారులు గుర్తించారు. తాజాగా డీఐజీ నేతృత్వంలోని బృందం మరింత లోతుగా కూపీ లాగి మనీలాండరింగ్ వ్యవహారాలు, షెల్ కంపెనీల లావాదేవీలు పసిగట్టినట్లు సమాచారం. ఇందులో డికార్ట్ లాజిస్టిక్స్ యజమాని ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి పేరుతో ఏర్పాటైన టెక్కర్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ద్వారా డొల్ల కంపెనీలకు ముడుపులు చేరినట్లు ఆధారాలు లభించాయి. శాన్‌హోర్డ్ ల్యాబ్స్ 30 కోట్లు, ఎస్‌పీవై ఆగ్రోస్ 15.6 కోట్లు, శాంజ్ ఫీడ్ టెక్నాలజీస్ 6.4 కోట్లు షెల్ కంపెనీలకు మళ్లించాయి. వాటితో పాటు టెక్కర్, అర్రామ్, ఈజీలోడ్ అనే డొల్ల కంపెనీలు కూడా లావాదేవీలు జరిపినట్లు తేలింది.

గోవిందప్ప మామూలోడు కాదు



స్కామ్‌లో ప్రారంభ దశ నుంచి అంతిమ లబ్ధిదారుకు ముడుపులు చేర్చే దాకా బాలాజీ గోవిందప్ప పాత్రపై దర్యాప్తు బృందం ఆధారాలు సేకరించింది. మూడున్నర వేల కోట్ల లిక్కర్ స్కామ్‌లో కీలక నిందితుడైన రాజ్ కసిరెడ్డి(ఏ1)తో తరచూ కీలక విషయాలు చర్చించినట్లు గుర్తించింది. కసిరెడ్డి కార్యాలయానికి వచ్చి మద్యం కంపెనీల నుంచి వసూలు చేసిన ముడుపుల డబ్బులు కారులో తీసుకెళ్లేవారని, అలా తీసుకెళ్లిన కోట్లాది రూపాయలు షెల్ కంపెనీల్లోకి మళ్లించి కర్ణాటకలో స్థిరాస్తి వ్యాపారాలతో పాటు ఇతరత్రా మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించినట్లు సమాచారం. కమీషన్లు వసూలు చేసి అసలైన లబ్ధిదారుకు ఇవ్వడమే కాకుండా ఆయన కూడా వ్యక్తిగతంగా భారీ లబ్ధి పొందినట్లు పసిగట్టారు. 2012లోనే జగన్ అక్రమాస్తుల కేసులో గోవిందప్పను సీబీఐ విచారించి ఉంటే అప్పట్లోనే ఆయన లీలలు వెలుగులోకి వచ్చేవని అధికారులు అభిప్రాయపడినట్లు తెలిసింది.

స్మార్ట్ షాక్



(మొదటి పేజీ తరువాయి)

బిల్లులు తడిసిమోపెడవుతున్నాయని వాపోతున్నారు. విద్యుత్తు రంగానికి అదానీ స్మార్ట్ మీటర్ గుదిబండగా మారనున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లతో వినియోగదారులపై చార్జీల భారం మోయలేనంతగా పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ జరిగింది

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయ విద్యుత్తు వాడకం లెక్కలు తేలాలంటూ.. వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. అదేవిధంగా గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్మార్ట్ మీటర్లను బిగించేందుకు కేంద్ర ప్రభుత్వ రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్) నిధులను బూచిగా చూపారు. ఆర్డీఎస్ఎస్‌లో చేరితేనే ఇంధన సంస్థల అభివృద్ధికి కేంద్రం నిధులు ఇస్తుందని జగన్ నమ్మబలికారు. స్మార్ట్ మీటర్ల బిగింపునకు ముందుకు వచ్చే సంస్థల కోసం టెండర్లు పిలిచారు. ఈ టెండర్లలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పాల్గొనేందుకు వీలు లేకుండా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)లో ఎన్‌ప్యానల్ అయిన సంస్థలకు మాత్రమే బిడ్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. ఈ విధానంతో పోటీ తత్వాన్ని మొగ్గలోనే తుంచేశారు. టెండర్లు తెరిచాక షిర్డీసాయి ఎలక్ట్రికల్స్, అదానీ సంస్థలు బిడ్ దక్కించుకున్నాయి. సంప్రదింపుల తర్వాత గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు షిర్డీసాయి ఎలక్ట్రికల్స్.. పట్టణ ప్రాంతాల్లోని పారిశ్రామిక, వాణిజ్య, నెలకు 200 యూనిట్లకు పైగా కరెంటు వాడేవారికి అదానీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు అనుమతులు ఇచ్చారు. స్మార్ట్ మీటర్లను బిగించేందుకు గాను సింగిల్ ఫేజ్ వినియోగదారులు నెలకు రూ.86, త్రీ ఫేజ్ వినియోగదారులు నెలకు రూ.196 చొప్పున 92 నెలల పాటు చెల్లించాలి. అంటే.. సింగిల్ ఫేజ్ వినియోగదారులపై రూ.7,912, త్రీ ఫేజ్ వినియోగదారులపై రూ.16,192 భారం పడుతుంది. బహిరంగ మార్కెట్లో ఈ మీటర్ల ధర రూ.3,200 నుంచి రూ.7,800 వరకు మాత్రమే ఉండగా.. డబుల్ ధరలు నిర్ణయించారు. దీనికి యాజమాన్య నిర్వహణ 'ట్యాగ్'ను తగిలించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే సమయానికి ఎన్నికలు సమీపించడం, విద్యుత్తు చార్జీలను పెంచుతూ వచ్చిన జగన్ సర్కార్‌పై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో స్మార్ట్ మీటర్ల కార్యక్రమాన్ని వాయిదా వేశారు. జగన్ సర్కారు ఓటమికి విద్యుత్తు చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల రుద్దుడు కూడా ఓ కారణం.

మళ్లీ తెరపైకి...

కూటమి అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లు బిగించాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను బిగిస్తే రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని గ్రహించిన కూటమి ప్రభుత్వం ఈ ప్రతిపాదన విరమించుకుంది. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థతో కాంట్రాక్టును రద్దు చేసుకుంది. కానీ పట్టణ ప్రాంతాల్లో పారిశ్రామిక, వాణిజ్య, నెలకు 200 యూనిట్లకు పైగా విద్యుత్తును వాడే వినియోగదారులకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్ ప్రారంభించాయి. మొదట పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారులకు అదానీ స్మార్ట్ మీటర్లను బిగించే కార్యక్రమాన్ని డిస్కమ్‌లు చేపట్టాయి. స్మార్ట్ మీటర్లు బిగించాక భారీగా బిల్లులు రావడంతో పారిశ్రామికవేత్తలలో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. పరిశ్రమలను మూసేయడం మినహా తమకు మరో గత్యంతరం లేదని వాపోతున్నారు. మీటర్ల పనితీరును ముందస్తుగా పరీక్షించకుండా నేరుగా బిగించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అయితే డిస్కమ్‌లు తేలిగ్గా కొట్టి పారేస్తున్నాయి. పరిశ్రమలు విద్యుత్తు వినియోగించని సమయంలో కెపాసిటర్లను ఆపేయాలని సూచిస్తున్నాయి.

మాకూ అదే అమలు చేయండి

స్మార్ట్ మీటర్ల విషయంలో జగన్ సర్కారు చేసుకున్న ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయడం లేదన్న ప్రశ్నకు ఇంధన సంస్థలు నేరుగా సమాధానం చెప్పడం లేదు. ఆర్డీఎస్ఎస్‌కింద నిధులు రావాలంటే సంస్కరణలు అమలు చేయాల్సిందేనని చెబుతున్నాయి. టెండర్లు రద్దుచేస్తే న్యాయచిక్కులు వస్తాయని అంటున్నాయి. ఇదే నిజమైతే.. వ్యవసాయ పంప్ సెట్లకు మీటర్లను బిగించే కాంట్రాక్టును షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌తో ఎలా రద్దు చేసుకున్నారన్న ప్రశ్నకు సమాధానం చెప్పడంలేదు. షిర్డీ సాయికి అడ్డురాని మార్గదర్శకాలు అదానీకి ఎందుకు వస్తాయని నిపుణులు, ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. వ్యవసాయ విద్యుత్తు మీటర్లపై తీసుకున్న నిర్ణయాన్నే పరిశ్రమలు, వాణిజ్య, పట్టణ గృహాలకు అమలు చేయాలని కోరుతున్నాయి.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*